ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 18.02.2025 | సంపుటి : 11 సంచిక : 218 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ
Simultaneously Published from Hyderabad & Karimnagar
ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## అమెరికాలో మెరుపు వరదలు

8 మంది మృతి

జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ

న్యూయార్క్ (జనంసాక్షి): అమెరికాలోని కెంటకీలో వచ్చిన మెరుపు వరదల్లో మృతుల సంఖ్య పెరిగి 8కి చేరింది. అక్కడి ఒబియాన్ నదికి సంరక్షణగా నిర్మించిన కట్ట తెగిపోవడంతో ఒక్కసారిగా సమీప ప్రాంతాలు జలమయం అయ్యాయని ఒబియాన్

మిగతా 2లో..



## రద్దీ నియంత్రణకై ప్రత్యేక హోల్డింగ్ జోన్స్

తొక్కిసలాట ఘటనతో రైల్వేశాఖ అప్రమత్తం

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ రాజధానిలోని న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో గత శనివారం జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని తీవ్రంగా కలచివేసింది. కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే ప్రయాణికులు పోటెత్తడంతో ఈ

మిగతా 2లో..

అర్హులందరికీ

# కొత్త రేషన్‌కార్డులు

ఎన్నికల కోడ్ అమల్లోలేని జిల్లాల్లో వెంటనేకార్డులు జారీ చేయండి

- ఈ దిశగా సత్వర చర్యలు తీసుకోవాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్(జనంసాక్షి):ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోలేని జిల్లాలో వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో పౌరసరఫరాల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ, కొత్త కార్డుల జారీపై అధికారులతో చర్చించారు. అలాగే.. ప్రభుత్వం జారీ చేయనున్న కొత్త రేషన్ కార్డులకు సంబంధించి పలు డిజైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికి రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే.. వచ్చే ఉగాది నుంచి రేషన్ కార్డులపై

మిగతా 2లో..

## ఇసుక అక్రమ దందాపై కొరడా ఝుళిపించాలి

అక్రమార్కులపై కఠిన చర్యలకు సింఎం రేవంత్ ఆదేశం

వార్త 2లో

## ఆంధ్రా ఎక్కువ నీళ్లు వాడకుండా టెలిమెట్రీతో అడ్డుకుందాం

- ఈ విధానం అమలుకు వెంటనే చర్యలు చేపట్టాలని కేఆర్ఎంబీకి లేఖ రాయండి
- ఏపీ ఏకపక్ష ధోరణిపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలి
- వాటాల వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జలసంఘంపైనే ఉంది : సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి):శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణజలాలను వినియోగించుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత కోటా కంటే ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు టెలిమెట్రీ విధానమే పరిష్కారమని సీఎం స్పష్టం చేశారు. టెలీమెట్రీ విధానం అమలుకు అయ్యే ఖర్చులో సగం

మిగతా 2లో..

# వచ్చే ఐదేళ్లూ రేవంత్‌రెడ్డే సీఎం

రిజర్వేషన్ ఆ తరువాతి ముఖ్యమంత్రి బీసీ కావొచ్చు

- బీసీ రిజర్వేషన్ బిల్లుపై మోదీని ఒప్పించే దమ్ముందా?
- దేశవ్యాప్త కులగణనకు ప్రధానిని ఒప్పించే సత్తా ఉందా?
- కేంద్రమంత్రి బండిసంజయ్‌కి టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్




హైదరాబాద్(జనంసాక్షి): బీసీ నేతను సీఎం చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వచ్చే ఐదేళ్లవరకు సీఎం రేవంత్‌రెడ్డే ఆయన స్పష్టం చేవారు. భాజపా నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు తెస్తామని.. ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టించే దమ్ముందా? అని సంజయ్‌ను ప్రశ్నించారు.గాంధీ భవన్‌లో జరిగిన ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. "బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని మోదీని ఒప్పించే దమ్ముందా.. బండి సంజయ్? దేశవ్యాప్త కులగణనకు మోదీని అడిగే సత్తా ఉందా? దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా భవిష్యత్తు బీసీలదే. భాజపా, భారాసలు బీసీ నేతను సీఎంని చేయగలవా? అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బండికి సవాల్ విసిరారు.

## ఢిల్లీ,బీహార్‌లలో భూప్రకంపనలు

ఢిల్లీలో రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 4.0 గా నమోదు

గంటల వ్యవధిలోనే బిహార్‌లోనూ భూకంపం

భయపడాల్సిన పనిలేదన్న ప్రధాని మోడీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని న్యూఢిల్లీతో పాటు పలు పరిసర ప్రాం తాల్లో సోమవారం భూకంపం సంభవిం చింది. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారుజాము కొద్ది సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనలకు గురైన ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు.

మిగతా 2లో..

# దూసుకొచ్చిన మృత్యువు

గుంటూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కూలీలతో వెలుతున్న ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ముగ్గురి దుర్మరణం.. మృతులంతా మహిళలే

గుంటూరు(జనంసాక్షి): గుంటూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీ మహిళలు ప్రయాణిస్తున్న ఆటోను పల్లె వెలుగు బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో ఏడుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సుద్దపల్లి నుండి కంతేరుకు 10 మంది మహిళా కూలీలు సోమవారం ఉదయం ఆటోలో బయల్దేరారు. చేబ్రోలు మండలం నారా కోదూరు-బుడంపాడు గ్రామాల మధ్య గుంటూరు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు.. ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులు సుద్దపల్లికి చెందిన అల్లంశెట్టి అరుణ,





## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70 ఏళ్లు పూర్తి చేసుకొని నేడు 71 వసంతంలోకి అడుగుట్టారు.. కేసీఆర్ పుట్టినరోజు సదర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా.. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు కూడా పెద్ద ఎత్తున కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నారు. అయితే.. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి

మిగతా 2లో..

### తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆరే కావాలంటున్నారు

ఆయన మళ్లీ సీఎం కావాలన్నది రాష్ట్ర ప్రజల ఆకాంక్ష: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ జాతికి మాజీ సీఎం కేసీఆర్ హీరో అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేసీఆర్ 71వ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. 71 కిలోల భారీ కేక్‌ను కేటీఆర్, భారాస

మిగతా 2లో..

ఆర్‌ఆర్‌ఆర్‌తో రాష్ట్ర ప్రగతికి

# మరో మెట్టు

ఓఆర్‌ఆర్‌ను కేసీఆర్ కమీషన్ల కోసం అమ్ముకున్నారు :మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్గొండ (జనంసాక్షి): ఎన్నికల ముందు మాజీ సీఎం కేసీఆర్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)ను కమిషన్ కోసం అమ్ముకున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. రూ.30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) పనులను ప్రారంభించడంలో గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని

మిగతా 2లో..

## కుటుంబాన్ని మింగిన అప్పులు

నలుగురి ఆత్మహత్య

కర్ణాటక మైసూరులో ఘటన



బెంగళూరు(జనంసాక్షి): అప్పుల బాధ తట్టుకోలేక ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నాటకలోని మైసూరులో జరిగింది. విశ్వేశ్వరయ్య నగర్‌లో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అప్పుల వారి ఒత్తిడి

మిగతా 2లో..



## పీఠంముడి

ఢిల్లీ సీఎం అభ్యర్థి ఎంపికపై బిజెపి మల్లగుల్లాలు

బీజేఎల్పీ సమవేశం రేపటికి వాయిదా

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ బీజేపీ శాసనసభాపక్ష సమావేశం వాయిదా పడింది. సోమవారం జరగాల్సిన బీజేఎల్పీ సమావేశాన్ని అధిష్ఠానం ఫిబ్రవరి 19 వతేదీ మంగళవారానికి వాయిదా వేసింది. దీంతో తదుపరి సిఎం ఎవరన్న విషయం మరింత ఆలస్యం కానుంది. 8ననే ఫలితాలు వచ్చినా సిఎం అభ్యర్థిని ఎంపికచేయడంలో బిజెపి మల్లగుల్లాలు పడుతోంది. సోమవారం ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎవరనే విషయానికి తెరపడుతుందని అంతా భావించారు. కాగా, ఢిల్లీ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. దీంతో నూతన సీఎంపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి 19న జరిగే సమావేశంలో బీజేఎల్పీ నేతను ఎన్నుకోనున్నారు. ఈ సమావేశంలో

మిగతా 2లో..

## చైనా భారత్‌కు శత్రువు కాదు

శామ్ పిట్రోడా మరో వివాదాస్పద వ్యాఖ్య

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడాతన వివాదాస్పద వ్యాఖ్యలతో సొంత పార్టీని తరచూ ఇరకాటంలో పెడుతుంటారు. తాజాగా తన పార్టీ వైఖరికి భిన్నమైన వాదనలు వినిపించారు.భారతదేశం చైనాను శత్రువులా చూడొద్దని శామ్ పిట్రోడా అన్నారు. చైనా నుంచి వచ్చే ముప్పు ఊహించని విధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని గుర్తించి, గౌరవించాల్సిన సమయం ఆసన్నమైందని.. ఇకనైనా భారత్ తన వైఖరి మార్చుకొని చైనాను శత్రువులా చూడటం మానుకోవాలని

మిగతా 2లో..

భారత్‌లో పెట్టుబడిదారులకు

# మెరుగైన ప్రతిఫలం

అందుకే వారు లాభాల స్వీకరణకు దిగుతున్నారు

ధరల స్థిరీకరణకు కేంద్రం చర్యలు చేపడుతోంది

ఎఫ్ఐఐ విక్రయాలపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు



ముంబయి(జనంసాక్షి): భారత ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు తరలిపోవడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు .భారత్‌లో పెట్టుబడులు పెట్టిన వారికి మెరుగైన ప్రతిఫలం అందుతోందని, అందుకే వారు లాభాల స్వీకరణకు దిగుతున్నారని చెప్పారు. పెట్టుబడులకు మెరుగైన రాబడులు ఇచ్చే వాతావరణం భారత్‌లో ఉందని పేర్కొన్నారు. ముంబయిలో ఈ మేరకు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇదే అంశంపై ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్‌కాంత పాండే మాట్లాడుతూ.. ప్రపంచం ఎదుర్కొంటున్న ఒడుదొడుకుల్లో ఇదీ ఒకటి అని పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికాకు చెందిన

మిగతా 2లో..



అమెరికా నుంచి అమృత్‌సర్‌కు

## మూడో విమానం

మూడో దఫాలో భారత్ చేరుకున్న మరో 112 మంది అక్రమ వలసదారులు

అమృత్‌సర్(జనంసాక్షి): అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన వారిని తిప్పి పంపేందుకు ట్రంప్ యంత్రాంగం చేపట్టిన ఆపరేషన్ కొనసాగుతోంది. తాజాగా అమెరికా నుంచి మరో వలసదారుల విమానం ఆదివారం రాత్రి అమృత్‌సర్‌కు చేరుకుంది. 112 మంది భారతీయులను తీసుకొచ్చింది. ఇప్పటికే రెండు విమానాల్లో భారత్‌కు చెందిన వలసదారులను

మిగతా 2లో..

# ముగింపు దిశగా రష్యా ఉక్రెయిన్ యుద్ధం!

ఆ దిశగా జోరందుకున్న శాంతిచర్చల సన్నాహాలు

అటు రష్యాతో ట్రంప్ సమాలోచనలు • పశ్చిమాసియాకు జెలెన్‌స్కీ పర్యటన

యుద్ధానికి ముగింపు పలకాలని పుతిన్ డొనాల్డ్ ట్రంప్‌లు కోరుకుంటున్నారని వెల్లడించి రష్యా



కీవ్(జనంసాక్షి):అమెరికా-రష్యా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు పలకాలని వ్లాదిమిర్ పుతిన్ డొనాల్డ్ ట్రంప్‌లు కోరుకుంటున్నారని రష్యా వెల్లడించింది. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. అమెరికా- రష్యాల మధ్య సంబంధాల పునరుద్ధరణ, ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం తదితర అంశాలపై సౌదీ అరేబియా వేదికగా ఇరు దేశాల నేతలు భేటీ కానున్న నేపథ్యంలో లావ్రోవ్ ఈ విధంగా స్పందించారు.రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ గుర్తు చేశారు. ఇరు దేశాల మధ్య క్షీణించిన సంబంధాలపై వారు మాట్లాడారని, వాటి పునరుద్ధరణ కోసం ఇరు దేశాధ్యక్షులు చర్చలు జరిపేందుకు అంగీకరించారని

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
18.02.2025

## సోనియా గాంధీ అల్లుడి కారణంగా సిఎంపీఎఫ్ రూ.722 కోట్లు కోల్పోయింది !

### బి ఎం ఎస్ నాయకుడు కె.లక్ష్మా రెడ్డి ఆరోపణ!




(ప్రత్యేక ప్రతినిధి/ జనంసాక్షి) రియల్టీ సంస్థ డి ఎచ్ ఎఫ్ ఎల్(దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) డిబెంచర్లలో పెట్టుబడి పెట్టిన తర్వాత బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ రూ.722 కోట్ల నష్టం వాటిల్లిందని, దీనిపై సి బి ఐ దర్యాప్తు జరపాలని ఆర్ ఎస్ ఎస్ అనుబంధ కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్ చేసింది.డి ఎచ్ ఎఫ్ ఎల్ కు, కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు మధ్య ఉన్న సంబంధాన్ని ఎత్తి చూపుతూ, యుపిఎ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పుడు పెట్టుబడులకు బాధ్యులను న్యాయం చేయాలని బిఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు.బి ఎం ఎస్ కు అనుబంధంగా ఉన్న ఆల్ ఇండియా కోల్ మజ్దూర్ సంఘ్ యొక్క 19వ త్రైవార్షిక సమావేశంలో కేంద్ర బొగ్గు మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలోనే ఈ విషయంలో సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ లేవనెత్తారు.బిఎంఎస్ బొగ్గు పరిశ్రమ ఇన్‌చార్జ్ కె.లక్ష్మా రెడ్డి శాఖాపరమైన విచారణ జరుగుతోందని, కానీ ఇప్పుడు ఈ విషయంపై సీబీఐ దర్యాప్తు చేయాలని లక్ష్మణ్ రెడ్డి అన్నారు.నిధులను దారి మళ్లించినందుకు బాధ్యులను జవాబుదారీగా ఉంచాలని ఆయన అన్నారు.బిఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సురేంద్ర కుమార్ పాండే మాట్లాడుతూ, ఒక ప్రైవేట్ కంపెనీలో రూ.722 కోట్లు ఎలా పెట్టుబడి పెట్టగలరని అన్నారు. ఈ డబ్బు బొగ్గు కార్మికులకు సామాజిక భద్రతా చెల్లింపుల కోసం ఉంది. ఒకవేళ పెట్టుబడి పెట్టాల్సి వస్తే దానిని ప్రభుత్వ రంగ సంస్థల బాండ్లలో లేదా షేర్లలో పెట్టుబడి పెట్టి ఉండాలి.ఈ డబ్బును డిఎల్ఎఫ్ బాండ్లలో తప్పుగా పెట్టుబడి పెట్టారని, కంపెనీ సంక్షోభంలో ఉన్నందున సకాలంలో ఉపసంహరించుకోలేదని ఆయన అన్నారు. భూ కబ్జా కేసులో డిఎల్ఎఫ్ ప్రమోటర్లు మరియు వాద్రా ఇప్పటికే సిబిఐ దర్యాప్తును ఎదుర్కొంటున్నారు.కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అనేది బొగ్గు రంగ కార్మికుల కోసం ఒక ప్రత్యేక నిధి, దీనిని ప్రావిడెంట్ ఫండ్,పెన్షన్ బకాయిల చెల్లింపుకు ఉపయోగిస్తారు.

## 'పీఠం'ముడి

నూతనంగా ఎన్నికైన 48 మంది బీజేపీ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. అలాగే కమలం పార్టీ ఎంపీలు సైతం హాజరుకానున్నారు. బీజేఎల్పీ నేత ఎన్నిక తర్వాత ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలవనున్నారు. ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం కోర్డినేటర్లుగా వినోద్ తావ్డే, తరుణ్ చుగ్‌లను బీజేపీ అధిష్ఠానం నియమించింది. మరోవైపు ఫిబ్రవరి 20న ముఖ్యమంత్రి, మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి తేదీ సైతం ఖరారు చేసింది. కాగా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేసులో పర్వేష్ వర్మ(న్యూ ఢిల్లీ), రేఖా గుప్తా (షాలిమార్ బాగ్), విజేందర్ గుప్తా (రోహిణి), సతీష్ ఉపాధ్యాయ్ (మాల్వియా నగర్), ఆశిష్ సూద్ (జనక్‌పురి), పవన్ శర్మ (ఉత్తమ్ నగర్), అజయ్ మహావార్ (ఘోండా) ఉన్నారు. ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేసిన సంగతి తెలిసిందే. దాదాపు 27 ఏళ్ల తర్వాత కమలం పార్టీ అక్కడ అధికారంలోకి రానుంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 48 స్థానాలను బీజేపీ కైవలం చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు పలువురు కీలక నేతలు ఓటమి పాలయ్యారు. కాగా, ప్రస్తుతం ఢిల్లీ సీఎం ఎవరనే విషయం ఉత్కంఠ కొనసాగుతోంది

## ఢిల్లీ,బీహార్‌లలో భూప్రకంపనలు

రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.0 గా నమోదు అయింది. ఢిల్లీతోపాటు నోయిడా, గురుగాం ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి.దేశ రాజధాని ఢిల్లీలో స్వల్ప భూప్రంకపనలు వచ్చాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ ఎక్స్ వేదికగా తెలిపింది. భూకంప కేంద్రం లోతు కేవలం 5 కిలోమీటర్లు మాత్రమేనని స్పష్టం చేసింది. కొన్ని సెకన్ల పాటు మాత్రమే భూమి కంపించడంతో భయాందోళనలకు గురైన జనం ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. భూకంప మండలం-4లో అధికస్థాయి భూకంపాలు (6- 6.9) వస్తాయి. దేశంలో 17.49శాతం భూభాగం ఇటువంటిదే. ఇందులో జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, దిల్లీ, సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లోని ఉత్తర ప్రాంతాలు, బిహార్, పశ్చిమ్ బెంగాల్, మహారాష్ట్ర పశ్చిమ తీరం, రాజస్థాన్‌లు ఉన్నాయి. మండలం-5లో 7కన్నా ఎక్కువ తీవ్రమైన భూకంపాలు సంభవిస్తాయి. 10.79శాతం భూభాగంలో ఇలాంటివి చోటుచేసుకునే ప్రమాదముంది.

## కుటుంబాన్ని మింగిన అప్పులు

భరించలేకే ఓ కుటుంబం బలవంతంగా ప్రాణాలు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను మైసూర్‌కు చెందిన వ్యాపారి చేతన్ (45), అతని భార్య రూపాలి (43), కుమారుడు కుశాల్ (15), చేతన్ తల్లి ప్రియంవద (65) గా గుర్తించారు. భార్య, కుమారుడు, తల్లికి విషమిచ్చి చంపిన అనంతరం చేతన్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. .

## ఆర్ఆర్ఆర్‌తో రాష్ట్ర ప్రగతి మరో మెట్టు

విమర్శించారు. ఆదివారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. "హైదరాబాద్ చుట్టూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తున్న ఆర్ఆర్ఆర్‌తో రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుంది. ఎస్సెల్బీసీ టన్నెల్ తవ్వే యంత్రాలను అమెరికా నుంచి తెప్పిస్తాం" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## చైనాను శత్రువులా చూడొద్దు

సూచించారు. తొలినుంచి చైనాతో భారత్ అనుసరిస్తున్న ఘర్షణాత్మక వైఖరి ఇరుదేశాల మధ్య శత్రుత్వాన్ని పెంచుతోందని శామ్ పిట్రోడా ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు.

## దూసుకొచ్చిన మృత్యువు

కుర్రా నాంచారమ్మ, తోట సీతారాములుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో వ్యవసాయ కూలీల మృతిపై సీఎం విచారం వ్యక్తం చేశారు. కూలీ పనుల కోసం వెళ్తున్న మహిళలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విచారకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై మంత్రి నాదెండ్ల మనోహర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందడం దురదృష్టకరమని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి... బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణం చెందిన ఘటన కలచి వేసిందని జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ప్రమాద వార్త తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మంత్రి దుర్గేష్ ఫోన్లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. అనంతరం జీజీహెచ్ లో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు



సన్న బియ్యం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని.. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జనవరి 26న కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియను తెలంగాణ ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియ ఆగిపోయింది. కొందరికి రేషన్ కార్డులు జారీ చేసి.. మరికొందరికి ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది. దీంతో అప్రమత్తమైన సీఎం రేవంత్.. రేషన్ కార్డుల జారీపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమెల్సీ కోడ్ అమల్లో లేని జిల్లాలో వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే.. ఖమ్మం, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలో మాత్రం ఎన్నికల కోడ్ అమల్లో లేదు. సీఎం ఆదేశాలతో ఈ మూడు జిల్లాల్లో రేషన్ కార్డుల జారీ పక్రియ షురూ కానుంది. తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి కమిషనర్ శాసనాలు ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్ కార్డుల జారీ పక్రియ అర్హులందరికీ అందుబాటులోకి రానివ్వాలని, ఈ పక్రియ త్వరగా ప్రారంభించమని ఆయన్ని కోరారు. ఈ సమిక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న జిల్లా కేంద్రాలు మినహాయించి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ వంటి జిల్లాల్లో కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియను ప్రారంభించనున్నారు. రేషన్ కార్డుల తొలగింపు విధానంలో ఎన్నికల కోడ్ ఉనికి చాలా సమయానికి మలచేందుకు గమనించి, మొదటి సారి ఎంపిక చేయడానికి ప్రత్యుత్తరంగా జారీ లో తిరుగుబాటు పనిలో దీర్ఘ కార్యక్రమాలు ఉండాయి.

### ఆంధ్రా ఎక్కువ నీళ్లు వాడకుండా

# టెలిమెట్రీతో అడ్డుకుందాం

నిధులను చెల్లించేందుకు ఏపీ ప్రభుత్వం ముందుకు రావటం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. టెలీ మెట్రీ విధానం అమలుకు అవసరమైన నిధులన్నీ ముందుగా మన ప్రభుత్వమే చెల్లిస్తుందని, వెంటనే టెలీమెట్రీ అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని సీఎం ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, పంటలకు సాగు నీటి విడుదలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.నీటి వాటాల పంపిణీ, నీటి వాటాల వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల సంఘంపైనే ఉందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నిర్ణీత వాటా కంటే ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఏపీ ఏకపక్షంగా నీటిని తరలించే విషయంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎండలు పెరిగిన కొద్దీ తలెత్తే గడ్డు పరిస్థితులను ముందస్తు అంచనా వేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ ఉన్నత అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని, వాటికి అనుగుణంగా పరిష్కార మార్గాలు అనుసరించాలని ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా, పంటలు ఎండిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీతో పాటు ప్రధాన ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగం వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, సాగు నీటికి తాగునీటికి ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని, రాష్ట్రమంతటా అన్ని ప్రాంతాల్లో సాగు తాగు నీరు. విద్యుత్తు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగు నీరు, సాగునీటిని అందించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని సీఎం ఆదేశించారు. వెంటనే సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని జిల్లాల వారిగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు పంటలు, నీటి విడుదల పై ఆయా జిల్లాల కలెక్టర్లు సంబంధిత ఇరిగేషన్ ఇంజనీర్ల తో వెంటనే సమీక్ష లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రాజెక్టులు, కాల్వలు, ఆయకట్టులో పంటలు, నీటి విడుదల తీరును కలెక్టర్ల స్వయంగా పరిశీలించాలని సూచించారు. నిర్ణీత ఎజెండాను ఖరారు చేసుకొని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు.

## ఇసుక అక్రమ దందాపై కొరడా ఝుళిపించాలి

### అక్రమార్కులపై కఠిన చర్యలకు సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి):ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝుళిపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అక్రమార్కులను వదిలేది లేదని హెచ్చరించారు. అక్రమదందాకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశంచారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఈ సమస్యపై సమగ్రంగా చర్చించారు. అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అణచివేయాలని సంబంధిత శాఖల అధికారులను సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు తగినంత ఇసుక కావాలంటే ముందుగా అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని సీఎం సూచించారు. ఇదిలా ఉండిగా ఇందిరమ్మ పథకం కింద లబ్దిదారులకు రూ. 5 లక్షలు అందించనున్నారు. వాళ్ల ఖర్చును తగ్గించేందుకు ఇసుకను ఉచితంగా అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అక్రమ రవాణా అడ్డుకట్ట తప్పనిసరి అని సీఎం పేర్కొన్నారు. అందుకే, అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంతోపాటు, ప్రభుత్వ పథకాలకు అవసరమైన ఇసుక సరఫరా నిరాటంకంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అమెరికా నుంచి అమృత్‌సర్‌కు మూడో విమానం

అమెరికా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 5 నుంచి 10 రోజుల వ్యవధిలో 3 విడతలుగా వలసదారులను వెనక్కి పంపింది. తొలి విడతగా 104, రెండో విడతలో 116 మంది భారత్‌కు చేరుకున్నారు.

## పెట్టుబడులు పెట్టిన వారికి మెరుగైన ప్రతిఫలం

### ఎఫ్ఐఐ విక్రయాలపై నిర్మలా సీతారామన్

ఎఫ్ఐఐలు తిరిగి వారి దేశానికి వెళ్లిపోతున్నాయని పేర్కొన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశమని, ముమ్ముందూ వృద్ధి కొనసాగుతుందన్నారు.ద్రవ్యోల్బణానికి సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. ధరలను స్థిరంగా ఉంచేందుకు సప్లయ్‌కు సంబంధించి చర్యలను ప్రభుత్వం చేపడుతోందని, డిమాండ్‌కు సంబంధించిన ఆర్‌బీఐ నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ కింద ఉన్న బీమా హామీ మొత్తాన్ని రూ.5 లక్షలకు మించి పెంచాలని కేంద్రం ఆలోచన చేస్తున్నట్లు ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం నాగరాజు వెల్లడించారు.

## రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక హోల్డింగ్ జోన్స్

ఘటన చోటుచేసుకుంది. రైలు వద్ద, ప్లాట్‌ఫాంపై గందరగోళంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్లలో రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక హోల్డింగ్ జోన్స్‌ను ఏర్పాటుచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా అత్యధిక ట్రాఫిక్ ఉండే 60 రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు శాశ్వత హోల్డింగ్ ప్రాంతాలను నిర్మించాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. అంతేగాక, రద్దీ నియంత్రణ, విపత్తు నిర్వహణ కోసం కృత్రిమ మేధను వినియోగించనున్నట్లు సదరు కథనాలు వెల్లడించాయి. దీనిపై అవగాహన కల్పించేందుకు స్థానిక అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారట. ఈ హోల్డింగ్ ఏరియాల వద్దకు ప్రయాణికులు వెళ్లేందుకు వీలుగా సెపరేటర్లు, గుర్తులు ఏర్పాటుచేయనున్నట్లు తెలుస్తోంది. న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో గత శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కుంభమేళాకు వెళ్లే వారితో రైల్వేస్టేషన్‌లోని 14, 15వ ఎ÷-లాట్‌ఫాంలు కిక్కిరిసిపోయి ఉన్నాయి. 14వ నంబరు ప్లాట్‌ఫాం పైకి ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రావాల్సిఉంది. అదే సమయంలో ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైలు 12వ నంబరు ప్లాట్‌ఫాంపైకి వస్తోందని రైల్వేస్టేషన్‌లో ప్రకటన వెలువడిందని, దీంతో ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ అదే అనుకొని జనమంతా 12వ నంబరు ప్లాట్‌ఫాం పైకి వెళ్లాలని ఒక్కసారిగా తోసుకుంటూ వచ్చారు. అదే సమయంలో 14వ నంబరు ఎ÷-లాట్‌ఫాం పైకి భారీగా వస్తున్న జనం జారి వారిపై పడటంతో తొక్కిసలాట జరిగిందని రైల్వే బోర్డు సమాచార విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై రైల్వేశాఖ ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టింది.

## అమెరికాలో మెరుపు వరదలు

కౌంటీ మేయర్ వెల్లడించారు. ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. దీంతోపాటు ఆ ప్రాంతంలో విపత్తు సంభవించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతోపాటు ఫెడరల్ సహాయాన్ని కూడా ఆయన కేటాయించారు. జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం వచ్చిన వరద నుంచి వందల మందిని రక్షించినట్లు రాష్ట్ర గవర్నర్ ఆండీ బెషీర్ వెల్లడించారు. ఈ సంఖ్య 1,000 వరకు ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో చాలాచోట్ల రోడ్లు మునిగిపోయాయి. కెంటకీలోని రివర్ మెడికల్ సెంటర్ ప్రాంతానికి కూడా వరద నీరు చొచ్చుకు రావడంతో చాలామంది పేషెంట్లను ఇతర ప్రాంతాలకు తరలించారు. 39,000 ఇళ్లల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. బలమైన గాలులు వీస్తుండటంతో మరిన్ని ప్రాంతాల్లో కరెంటు నిలిచిపోవచ్చని భావిస్తున్నారు. ఇక అమెరికా ఉత్తర ప్రాంతంలో ప్రాణాలు తోడేసేంత చలి ఉంది. జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ అయ్యాయి. అట్లాంటాలో చెట్టు విరిగి ఇంటిపై పడటంతో ఒక వ్యక్తి మరణించారు. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలుల కారణంగా నార్త్, సౌత్ డకోటా, మిన్నెసోటలోని కొన్నిచోట్ల -45.6 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు ఉష్ణోగ్రత పడిపోయింది

## ముగింపు దిశగా రష్యా ఉక్రెయిన్ యుద్ధం!

చెప్పారు.ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి అమెరికా-రష్యా మధ్య సంబంధాలు ఊహించని స్థాయిలో పతనమైన విషయం తెలిసిందే. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉక్రెయిన్ యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడితోనూ చర్చలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. సౌదీ అరేబియాలో శాంతి చర్చలుంటాయని చెప్పారు. ఇందులో ట్రంప్-పుతిన్‌లు నేరుగా సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఇప్పటికే యూఏఈ చేరుకొన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఈ శాంతి చర్చల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**పశ్చిమాసియాకు జెలెన్‌స్కీ**

ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ముగించడం కోసం ట్రంప్ చేస్తున్న యత్నాలు జోరందుకొన్నాయి. సౌదీ అరేబియాలో శాంతి చర్చలు జరగనున్నట్లు ఆయన ప్రకటించారు.తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా నిన్న అర్ధరాత్రి అధికారిక పర్యటన నిమిత్తం యూఏఈ చేరుకొన్నారు. భారీ మానవీయ సహాయ కార్యక్రమం నిమిత్తం తాను ఇక్కడికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు.మరోవైపు కొన్ని రోజుల్లో అమెరికా-రష్యా మధ్య సౌదీ అరేబియాలో ఉక్రెయిన్‌పై శాంతి చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్‌కోఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్‌వాల్ట్జ్ కూడా సౌదీకి ప్రయాణమయ్యారు. ఈసందర్భంగా రియాద్‌లోని కొందరు అధికారులు మాట్లాడుతూ ఈ చర్చలకు వేదిక కావడంతోపాటు.. మధ్యవర్తిత్వంలోను తమ దేశం కీలకపాత్ర పోషించనుందన్నారు.ఇక ఉక్రెయిన్ లేకుండానే ఈ చర్చలు చేపడతున్నారంటూ అమెరికా మిత్రదేశాల నుంచి అసంతృప్తులపై ట్రంప్ స్పందించారు. యుద్ధాన్ని ముగించే ఏ చర్చల్లోనైనా జెలెన్‌స్కీ భాగస్వామి అవుతారని ట్రంప్ వివరణ ఇచ్చారు. అంతేకాదు.. చాలా తొందరలో రష్యా అధినేతతో తాను భేటీ కానున్నట్లు చెప్పారు. ఆయన ఫ్లోరిడాలోని డెటోనా రేసులో పాల్గొన్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "కచ్చితమైన సమయం అనుకోలేదు.. కానీ, తొందర్లోనే జరుగుతుంది" అని విలేకర్లతో పేర్కొన్నారు.మరోవైపు అమెరికా-రష్యా చర్చలకు దూరంగా జరిగిన బ్రిటన్ మాత్రం భిన్నమైన ప్రకటన చేసింది. ఆ దేశ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ అవసరమైతే ఉక్రెయిన్‌లో తమ సేనలు బరిలోకి దిగుతాయని అన్నారు. ఐరోపా దేశాల అత్యవసర సమావేశానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇది ఉక్రెయిన్ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు. ఐరోపా ఉనికికి కీలకమైంది. సుదీర్ఘకాలం కాలం పాటు ఉక్రెయిన్‌లో శాంతి, సురక్షితను కాపాడటం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు.మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే శాంతిచర్చల దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగడం ఐరోపా దేశాల్లో కలవరం రేకెత్తిస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇప్పటికే ఆయన ఫోన్లో మాట్లాడారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం నిలిచిపోవడం వల్ల తలెత్తే పరిణామాలపై ఇప్పుడు ఈయూ దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. యుద్ధ విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తమ భద్రతకు ముప్పు తలెత్తవచ్చన్న ఆందోళన ఐరోపా దేశాల్లో ఉంది. రష్యా కన్ను తమపై పడే అవకాశం ఉందని అవి భావిస్తున్నాయి. చర్చలపై ట్రంప్ దృష్టిసారించగా ఈయూ దేశాలు సోమవారం పారిస్‌లో అత్యవసరంగా సమావేశం కాబోతున్నాయి.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

రేవంత్‌రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాం క్షలు తెలిపారు.. ఎక్స్‌లో బర్త్‌డే విషెస్ చెబుతూ పోస్ట్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి.. సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉం డాలంటూ ఆకాంక్షించారు.. రాష్ట్రాభి వృద్ధికి పాటుపడుతూ ప్రజాసేవలో నిమ గ్నం కావాలని రేవంత్ రెడ్డి ట్వీట్ చేశా రు.కాగా హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ఈ వేడులను బీఆర్ఎస్ శ్రేణులు అంగరంగ వైభవంగా జరిపాయి. కేక్ కట్ చేసి.. స్వీట్లు తినిపించుకున్నారు. పలు ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయగా.. మరికొన్ని చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొన్నారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.సీతా ఫల్ మండిలోని ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు కార్పొరేటర్ హేమ పరీక్ష ప్యాడ్స్,పెన్నులు,పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నామలగుండు లోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, ఇంకా ప్రజలకు సేవలందించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలకలగూడ పార్క్ లో మొక్కలు నాటారు సీతాఫల్‌మండి రెయిన్‌బో అనాథ ఆశ్రమంలో చిన్నారుల మధ్య తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారి అనిల్, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు గుండు దయానంద్, గంగపుత్ర, కో కన్వీనర్ జగన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నరసింహ చారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు.ఉప్పల్ చిలుకానగర్ చౌరస్తాలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, మిఠాయిలు పంచారు. ఉప్పల్ డివిజన్‌లో పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అత్తాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు అప్పారెడ్డి ముఖేశ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. చిన్నారులకు స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు.కాచిగూడ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దుల ఓం ప్రకాశ్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కార్యాలయం వెంకటేశ్ హాజరై కేక్ కట్ చేశారు. కాచిగూడలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్ బాబ్జి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి.. బాటసారులకు పంపిణీ చేశారు. రామాంతపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంథం జోత్స్న నాగేశ్వరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ దగ్గర కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం గోకుల్‌నగర్ బృందావన్ గార్డెన్‌లో మొక్కలు నాటారు. నిజాంపేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు కేక్ కట్ చేశారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని ఆదర్శ అనాథ ఆశ్రమంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి అల్పాహారం, పండ్లు, ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు.

## తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆరే కావాలంటున్నారు

నేతలు కట్ చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లా డారు. 'కేసీఆర్.. తెలంగాణ కారణజన్ముడు .ఆయన మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు గట్టిగా పనిచేద్దాం. రానున్న మూడున్నరేళ్లు 60 లక్షల గులాబీ దండు.. ఇదే లక్ష్యంతో ముందుకెళ్లాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'ప్రతి తండ్రీ తమ పిల్లల హీరో అని అంటారు. నా తండ్రి నా ఒక్కడికే కాదు.. తెలంగాణ హీరో కావడం నా అదృష్టం. కల కనడం.. దాని కోసం హద్దులేని నిబద్ధతతో బయలుదేరారు. విమర్శకులను ఎదుర్కోవడం, అది ఎలా నెరవేరుతుందో వారికి గర్వంగా చూపించారు. తెలంగాణ అనే కలను ప్రేమించారు. వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించకుండా తెలంగాణ సాధించారు. మీరు గర్వంగా మీ కొడుకని పిలుచుకునే వ్యక్తి కావడమే నా లక్ష్యం. మీ వారసత్వానికి అర్హులుగా ఉండటానికి ప్రతీక్షణం కృషి చేస్తా' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో ఎమోషనల్ పోస్ట్ ట్వీట్ చేశారు.



# ఆరోగ్య సంరోణలో ఇండియా గ్లోబల్ లీడర్

- సీఎస్‌ఆర్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని

**బోస్టన్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ఆరోగ్య సంరక్షణ, సరికొత్త ఆవిష్కరణల విషయంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఉందని, అపోలో సీఎస్‌ఆర్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని పునరుద్ఘాటించారు. బోస్టన్‌లో జరిగిన హార్వర్డ్ ఇండియా బిజినెస్ ఫోరమ్ 2025లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్యం విషయంలో నేడు అందివచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకోవడంతోపాటు, భారత్ అనుసరించే సంప్రదాయ ఆరోగ్య సంరక్షణ పద్ధతులు అనేక సమస్యలకు పరిష్కారం చూపుతున్నాయన్నారు. అంతేకాకుండా, ప్రపంచానికే పరిష్కార మార్గాలను చూపిస్తున్నామని తెలిపారు. హెల్త్‌కేర్ రంగంలో ఏఐ, బిగ్ డేటాను ఏవిధంగా విస్తృతంగా వాడుతున్నదీ.. దాని సాయంతో వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, తదితర విషయాలను రియల్‌టైమ్‌లో ఎలా అంచనా వేస్తున్నదీ ఉపాసన వివరించారు. అసలు వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తూనే, ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి తగిన వైద్యం అందించే విషయంలోనూ తన అభిప్రాయాలను పంచుకున్నారు. డిజిటల్ హెల్త్, యూపీఐ చెల్లింపులు, మారుమూల ప్రాంతాలకు టెలిమెడిసన్ ద్వారా వైద్య సేవలు అందించటం, భారత్‌లో ముఖ్యంగా హెల్త్, టెక్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. 'భవిష్యత్‌లో ఆరోగ్య సంరక్షణకు చేయాల్సింది వీలైనన్ని ఎక్కువ ఆస్పత్రులు కట్టడం కాదు. ప్రజలకు వాటి అవసరమే రాకుండా చేయటం. భారత్ ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌ను సిద్ధం చేస్తోందని పేర్కొన్నారు.

# ఖమ్మం స్టేషన్‌లో చురుకుగా పునరుద్ధరణ పనులు

- ఖమ్మం మీదుగా పలు రైళ్ల రద్దు



**ఖమ్మం, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కాజీపేట–విజయవాడమధ్య మూడో రైల్వే లైన్ పనులు చకచక కొనసాగుతున్నాయి. రైల్వే అమృత్ పథకం కింద ఈ పనులు చేపట్టారు. ఖమ్మం మీదుగా హైదరాబాద్, వరంగల్, విజయవాడ పరిధిలో పలు రైళ్లను రద్దు చేసి మరీ వేగంగా పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్నాయి. దీని కోసం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్ ఫామ్‌ను కొంత మేర కూల్చివేశారు. కొండపల్లి నుంచి కాజీపేట వరకు పలు స్టేషన్లలో ఇప్పటికే లైన్ నిర్మాణం పూర్తయింది. మిగిలిన చోట్ల పనులు స్పీడప్ చేసి జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొండపల్లి – మధిర మధ్య మూడో లైన్ నిర్మాణం పనులు పూర్తికాగా ఇటీవల ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మధిర నుంచి మోటమర్రి వరకు మూడో లైన్‌ను మార్చి వరకు, మోటమర్రి నుంచి పందిళ్లపల్లి స్టేషన్? వరకు ఏప్రిల్ లోపు పనులు పూర్తి చేయాలని ఎ÷–లాన్?చేస్తున్నారు. ఈ పనుల కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇదంతా పూర్తయ్యాక ఖమ్మం నుంచి డోర్నకల్ వరకు, ఆ తర్వాత మహబూబాబాద్‌వరకు పనులు చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కాజీపేట–విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌పనుల కారణంగా ఖమ్మం మీదుగా విజయవాడ, వరంగల్ వైపు వెళ్లే పలు రైళ్లను ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. అయితే రద్దయిన రైళ్లలో కొన్నింటిని నిర్ణీత తేదీల్లో నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. భద్రాచలం –విజయవాడ, డోర్నకల్– విజయవాడ ప్యాసింజర్లు, గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 10 నుంచి పది రోజుల వరకు రద్దు చేశారు. ఖమ్మం మీదుగా నడిచే 107 రైళ్లలో 30 రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని అధికారులు సూచించారు.

# ఉమేశ్ హత్యకేసులో ఐదుగురి అరెస్ట్

- డిసిపి కోటిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** మేడ్చల్‌లో ఆదివారం పట్టపగలు జరిగిన ఉమేశ్ హత్య కేసు వివరాలను డీసీపీ కోటిరెడ్డి వివరించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. నిందితుల నుంచి 2 కత్తులు, 4 ఫోన్లు, 2 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 'హతుడు ఉమేశ్‌పై కామారెడ్డి పీఎస్‌లో 14 కేసులు ఉన్నాయి. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను వేధించేవాడు. అతడి తీరుతో విసిగిపోయి సోదరుడు రమేశ్ హత్య చేశాడు. నలుగురితో కలిసి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం' అని డీసీపీ తెలిపారు. మేడ్చల్‌లో జాతీయ రహదారి–44పై పట్టపగలు అందరూ చూస్తుండగానే ఉమేశ్‌ను అతని సొంత తమ్ముడు, చిన్నాన్న కుమారుడు వెంటాడి, వేటాడి కత్తులతో పొడిచి చంపిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే.

# రుణమాఫీ కాలేదని బ్యాంకు ఎదుట బైకును తగలబట్టిన రైతు



**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని బరోడా బ్యాంక్ ఎదుట బైకును తగలబట్టిన రైతు రుణమాఫీ కాలేదని మనస్థాపానికి గురై బ్యాంకు ఎదుట తన బైకును తగలబట్టిన గోలగుండం గ్రామానికి చెందిన చందు అనే రైతు ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అది లోకి తెచ్చారు. పోలీసులు బాధితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# పెద్దగట్టు జాతరతో ట్రాఫిక్ ఆంక్షలు

- హైదరాబాద్-విజయవాడ మధ్య దారి మళ్లింపులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి మధ్య రాకపోకల సాగిస్తున్న వారు ట్రాఫిక్ హెచ్చరికలు గమనించి పోవాల్సి ఉంది. ఎందుకంటే హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర సందర్భంగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై పోలీసులు ఆంక్షలు విధించారు. లింగమంతుల స్వామి జాతర ఐదు రోజులపాటు జరిగనుంది.. ఈ జాతరకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణలో పెద్దగట్టు జాతరగా ప్రసిద్ధికెక్కిన లింగమంతుల స్వామి జాతర ప్రారంభమైంది. రాష్ట్రంలో మేడారం సమ్మక్క–సారలమ్మల జాతర తరువాత రెండవ అతిపెద్ద జాతరగా దీనికి పేరుంది. యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుల స్వామి జాతర ఆదివారం అర్ధ రాత్రి కేసరం నుంచి పెద్దగట్టు దేవరపెట్టే రాకతో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరగనున్న జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. భక్తులు గజ్జెల లాగులు ధరించి, కత్తులు, కటర్లు, డప్పు వాయిద్యాలతో గుట్ట పైకి చేరుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.. దీంతో జాతర జనసంద్రమైంది.. కాగా.. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర సందర్భంగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై పోలీసులు ఆంక్షలు విధించారు. జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు జాతీయ రహదారిపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కెట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ మీదుగా విజయవాడకు మళ్లిస్తున్నారు. అలాగే, విజయవాడ నుంచి వచ్చే వాహనాలను కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు..

# కుటుంబ కలహాలతో నిండుప్రాణం బలి

- భార్య, పిల్లలను చూడటానికి వెళ్తే... నిప్పటించిన అత్తారింటివారు
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**కొత్తగూడెం, ఫిబ్రవరి17 (జనంసాక్షి) :** కుటుంబ కలహాలు నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. దంపతుల మధ్య కలహాలు రావడంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. తర్వాత భర్త.. అత్తగారింటికి వెళ్లి భార్య పిల్లలను చూద్దామనుకుంటే.. అత్తింటి వారు అతడిని అడ్డుకున్నారు. అంతేనా.. ఇంటి అల్లుడన్న విషయం మరచి అతడిపై అత్తామామ, బామ్మర్దులు ఏకంగా పెట్రోల్ పోసి నిప్పంటించి, ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఒళ్లంతా మంటలు రేగడంతో అతడు సమీపంలోని నీటి తొట్టిలో పడిపోయాడు. ఇరుగు పొరుగు గమనించి ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ దారుణ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రామచంద్రునిపేటకు చెందిన ఎజ్జు వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల కుమార్తె కావ్య. ఆమెను మూడేండ్ల క్రితం పాల్వంచ మండలం దంతలబోరు గ్రామానికి చెందిన బల్లెం గౌతమ్ (24) ప్రేమ వివాహం చేసుకున్నాడు. గౌతమ్ ఎలక్ట్రిషన్ పనిచేస్తూ సుజాతనగర్‌లో నివాసం కాపురం పెట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు. అయితే 5 నెలల క్రితం భార్యాభర్తలు గొడవ పడటంతో కావ్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 2న రాత్రి భార్యా పిల్లలను చూసేందుకు గౌతమ్ అత్తింటికి వెళ్లాడు. అయితే అల్లుడు గౌతమ్‌ను అత్త మామ, బామ్మర్దులు ఇంట్లోనికి అనుమతించలేదు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారు గౌతమ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించి ఇంట్లోకెళ్లి తలుపులు వేసుకున్నారు. మంటలకు తాళలేక గౌతమ్ కేకలు వేస్తూ పక్కనే ఉన్న నీటితొట్టిలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అతడిని ఇరుగు పొరుగు ఖమ్మం హాస్పిటల్‌కి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎంకి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గౌతమ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి బల్లెం వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# సౌత్ ఆఫ్రికాలో కెసిఆర్ జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలు సౌత్ ఆఫ్రికా లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం బీఆరెస్ సౌత్ ఆఫ్రికా శాఖ అధ్యక్షులు నాగరాజు గుర్రాల ఆధ్వర్యంలో జరగాయి. సౌత్ ఆఫ్రికా లోని జోహనెస్బర్గ్ లో కోర్ కమిటి సభ్యులు మరియు కమ్యూనిటీ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసారు, అందరితో కలిసి కెసిఆర్ గారి జన్మదినాన్ని జరుపుకున్నారు. జొహాన్నెస్బర్గ్ లో సాయి కిరణ్ నల్ల ,అరవింద్ చికోటి , వెంకట్ రావు తాళ్లపల్లి , రాంబాబు తోడుపు నూరి,నమా రాజేశ్, సాయి కిరణ్ వేముల , రవీందర్ నల్లబాపని మిగితా సభ్యులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు అందరూ కెసిఆర్ గారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**బీఆర్ఎస్‌పై రాజకీయ కుట్రలను ఖండిస్తున్నాం**

బీఆర్ఎస్ పార్టీపై, కేటీఆర్‌పై కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు చేస్తున్న రాజకీయ కుట్రలను ఖండిస్తున్నట్టు సౌత్ ఆఫ్రికా ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు నాగరాజు గుర్రాల తెలిపారు. కేసులు పూర్తిగా పొలిటికల్ మోటివేటెడ్, ఆధారాలు లేని లొట్టపీసు కేసులు మాత్రమేనని, చట్టం పట్ల ఉన్న గౌరవంతో వారు విచారణలకు సమగ్రంగా సహకరించడం గొప్ప నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. ఫార్ములా–ఈ కార్ రేస్ లాంటి అంతర్జాతీయ కార్యక్రమాలు, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయిలో నిలబెట్టడం లక్ష్యంగా చేపట్టినవని, అవి తెలంగాణ అభివృద్ధిని గర్వంగా తెలియజేస్తున్నాయని, కాంగ్రెస్ లాంటి రాజకీయ పార్టీలు అసత్య ప్రచారాలు చేసి, ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నాయన తెలపారు. కేటీఆర్ నిబద్ధత, నిజాయితీ, ధైర్యం స్ఫూర్తిదాయకమన అన్నారు. కాంగ్రెస్ పార్టీలు డైవర్షన్ రాజకీయాలను ఆపి, ప్రజల అవసరాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# విజయవంతంగా ముగిసిన తెలుగు వికీపీడియా పండగ 2025



**తిరుపతి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన "తెలుగు వికీపీడియా పండగ 2025" ఘనంగా ముగిసినట్లు వికీపీడియా యూజర్ గ్రూప్ తరుపున కో–ఆర్డినేటర్ కృపాల్ కశ్యప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 50 మందికి పైగా తెలుగు వికీపీడియా సభ్యులు పాల్గొన్నారు. నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. 2003లో ప్రారంభమైన తెలుగు వికీపీడియా ఇప్పటివరకు లక్షకు పైగా వ్యాసాలను కలిగి ఉన్నది. సదస్సు సందర్భంగా "తెలుగు వికీపీడియాను విస్తరించే మార్గాలు', 'సభ్యుల వ్యాస రచనా నైపుణ్యాల మెరుగుదల', 'వ్యాసాలను ప్రజలకు మరింత ఆసక్తికరంగా రూపొందించే పద్ధతులు' వంటి కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. అదనంగా, "తెలుగు వికీపీడియాలో చేరండి... అందరికీ విజ్ఞానం పంచండి" అనే నినాదంతో తిరుపతి నగర వీధుల్లో వికీపీడియా సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంచిపడి, ప్రజలకు వికీపీడియా గురించి అవగాహన కల్పించారు. "తెలుగు వికీపీడియా బడి" పేరుతో త్వరలో ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. కొత్త సభ్యులు వీటి ద్వారా వికీపీడియాలో భాగస్వాములు కావచ్చని తెలియజే శారు. గత దశాబ్ద కాలంలో తెలుగు వికీపీడియాకు విశేష సేవలు అందించిన వారిని ఈ వేడుకల్లో సత్కరించారు. ఉత్తమ నిర్వాహకునిగా యర్రా రామారావు సత్కారం పొందారు. చదువరి ,ఎన్.ఆర్. గుళ్ళపల్లి, శ్రీరామమూర్తి, బత్తిని వినయ్ కుమార్ గౌడ్, స్వరలాసిక, టి. సుజాత, రవిచంద్ర, రామేశం, ఐ. మహేష్, బి.కె. విశ్వనాథ్ వికీ పునస్కారాలను అందుకున్నారు. ఈ 21వ వార్షిక సమావేశంలో విభిన్న క్రియాశీల సహకారుల సంఖ్యను పెంచడం, ఎక్కువ మందికి చేరవేయడంగా లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు తెలిపారు.

# బహ్రెయిన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ ఆధ్వర్యంలో బహ్రెయిన్‌లోని అండాలస్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ అధ్యక్షుడు రాధారపు సతీష్ కుమార్ అధ్యక్షతన కేక్ కట్ చేశారు. ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ అధ్యక్షుడు రాధారపు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యమ సమయం నుంచి నేటి వరకు కేసీఆర్ వెంట ఎలా ఉన్నామో, భవిష్యత్తులో కూడా వారి వెంటే ఉంటామని రాధారపు సతీష్ కుమార్ తెలిపారు. అధికారం అంటే పేదల జీవితాలు మార్చేందుకు వచ్చిన అవకాశం అని నిరూపించిన ఏకైక నాయకుడు కేసీఆర్. ప్రజాపాలన అంటే నిర్బంధాల పాలనా అయింది. పాలన చేతగాక, కేవలం ప్రజల దృష్టి మార్చేందుకు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారు. ఓవైపు తెలంగాణలో కాంగ్రెస్ గ్యారెంటీలను అమలు చేయాలని ప్రజలు రోడ్డెక్కుతుంటే మరోవైపు రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారు. దేశంలో ఏ సీఎం కూడా వారానికోసారి ఢిల్లీ వెళ్లినట్టు చరిత్రలో లేదని తెలిపారు. ప్రజాపాలన అంటే నిర్బంధాల పాలన అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి, మగ్గిడి రాజేందర్, అన్నారం సుమన్, కార్యదర్శులు, చెన్నమనేని రాజేందర్, ఉత్కం కిరణ్ గౌడ్, చిలుకూరి రాజలింగం, తిప్పారవేణి శ్రీనివాస్, దేవదాస్, కొడారి రాజేందర్, జాడి వెంకటేష్, చిన్న గంగారాం, చివేరి రాము బీఆర్ఎస్ నాయుకులు హాజరైన వారిలో వున్నారు.

# కువైట్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సంబరాలు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కువైట్ అద్యక్షురాలు అభిలాష గొడిశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు మహేష్ బిగాల సూచనలతో భారత రాష్ట్ర సమితి కువైట్ సభ్యులు మొక్కలు నాటారు. అద్యక్షురాలు అభిలాష మాట్లాడుతూ కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేసారు. నైజీరియా దేశస్థుడు ఛాస్ కూడా కేసీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్యక్షురాలు అభిలాష గొడిశాల, సుబాన్ సోహెల్, సురేష్ గౌడ్, ప్రమోద్ కుమార్, అయ్యప్ప, మహబూబ్, లవన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

- సర్వమత ప్రార్థన, తెలంగాణలోనూ సేవా కార్యక్రమాలు



**లండన్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఉపాధ్యక్షులు హరి గౌడ్ నవాబుపేట్, రవి రేటినేని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండే విధంగా అన్ని మతాల దేవుళ్ళు ఆశీర్వదించాలని ముందుగా హిందూ, ముస్లిం మరియు క్రైస్తవ మత ప్రతినిధులతో సర్వమత ప్రార్థన నిర్వహించారు. వారంతా పూజలు, ప్రార్థనలు చేసి కెసిఆర్‌కు భగవంతుడి ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని ప్రార్థించి ఆశీర్వచనం అందించారు. హాజరైన అతిథులంతా కూడా ఈ ప్రార్థనలల్లో పాల్గొన్నారు. సర్వమత ప్రార్థనలు చేసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఆశీర్వదించిన అన్ని మతాల ప్రతినిధులకు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎఫ్డీసి మాజీ చైర్మన్, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ కెసిఆర్ ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఎలాగైతే ఉద్యమ సమయం నుండి నేటి వరకు వారి వెంట ఉన్నామో, భవిష్యత్తులో కూడా వారి వెంటే ఉంటామనీ, ఖండాంతరాల్లో ఉంటూ భారాస జెండా మోసే అవకాశం కలిపించిన కేసీఆర్‌కు అన్ని సందర్భాల్లో మా వెంటే ఉంటూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, హరీష్ రావు గారికి, కవితకు, ఇతర నాయకులందరికి కృతజ్ఞతలు తెలిపి ఇలా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని, హాజరైన కార్యవర్గ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే ప్రధాన కార్యదర్శి మరియు టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైన క్రమశిక్షణ కలిగిన క్రియాశీలక కార్యకర్తలుగా పార్టీకి ఎల్లపుడూ అండగా ఉంటూ కెసిఆర్ గారి నాయకత్వాన్ని బలపరుస్తూ రాబోయే రోజుల్లో పార్టీ పిలుపిచ్చిన అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు.

**PUBLIC NOTICE**


**LOST OF DEEDS & DOCUMENTS**

It is hereby informed to the General Public that my client **Sate Venkata Sreenivas S/o. Late Durgaiah** R/o H.No. 5-211/A. Gandhi Street Medchal Village and Mandal, Medchal Malkajgiri District. Aadhar No. 6594 1393 1480, has lost original Deposit of Title Deed vide Document No. 4046 of 2011 dt: 08-12-2011 and Release of Mortgage Rights Deed vide Document No 4931 of 2016 dt: 21-07-2016 on 14-02-2025 while he was travelling from his house to Xerox Centre situated at beside Bus Depot, Medchal, on his motor cycle, and inspite of his best efforts he unable to trace it and it is lost beyond recovery, in case if it is traced out the above said documents by any person or persons hand over the same to me are my client. If anybody misused the above said documents, they are liable for punished as per law.

**C.KRISHNA**
**ADVOCATE**
**H.No. 5-237. Near Rathamshala Medchal Village, Medchal Mandal and District, Cell: 9648921353**

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
18 ఫిబ్రవరి 2025
తెలంగాణ

# దళిత సామాజిక సాహితీ స్వరం"నాగస్వరం"




ప్రణవ నాదాలెన్ని ప్రతిధ్వనించినా/ ఆదిమ స్వరం నాదే/ నాగజాతి రక్త సంతకాన్ని నేను/ధమ్మ పథ బాటసారిని నేను/సత్య 'జ్యోతి 'కిరణాన్ని/నేను 'భీమ'పతాకాన్ని/నాది నాదస్వరం" ఇది ముగింపు కాదు ఆరంభం.కోయి కోటీశ్వరరావు రచించిన "నాగ స్వరం" దళిత ఉద్యమానికి ఒక సాహస గీతం, సామాజిక న్యాయానికి ఒక సాహిత్య ఆయుధం. ఈ కవితాసంపుటిలో దళితుల మూలాలను, వారి సంఘర్షణలను, ప్రతిఘటనలను ఒక ప్రత్యేకమైన శైలిలో కవిత్వీకరించారు కవి. పేదరికం, కుల వివక్షతల మధ్య నుండి విద్యాసాధన ద్వారా మేల్కొన్న ఒక కవి యొక్క వేదనకు అక్షర రూపం నాగస్వరం. కోటీశ్వరరావు ఒక వ్యవసాయ కూలి కుటుంబం నుండి బయటపడి, సామాజిక అడ్డంకులను ఎదుర్కొంటూ, సాహిత్యం ద్వారా దళిత చైతన్యానికి ఒకసూర్యోదయంగా మారిన కథనం ఇక్కడ ప్రతిధ్వనిస్తుంది. రచయిత తన బాల్యాన్ని వ్యవసాయ కూలిగా గడిపినా, పేదరికం మరియు కుల అణచివేతల మధ్య నుండి విద్య ద్వారా స్వయంగా మరియు సమాజాన్ని మార్చే ప్రయాణానికి నాగస్వరం ప్రతీక సాంప్రదాయికంగా మంగళకరమైన సంగీతాన్ని ఊదే నాగస్వరం ఇక్కడ దళితుల స్వరానికి ప్రతీక.కోటీశ్వరరావు రచనా శైలి ప్రగతిశీల, కవిత్వంతో కూడిన సాహిత్యం.దళిత అనుభవాలను సజీవంగా తీసుకువస్తాడు.దళిత జీవితంలోని రోజువారీ అణచివేతలను తెలుగు సాహిత్యంలో దళిత వాస్తవికతను ఇంత తీవ్రంగా ముడివేసిన రచనలు అరుదు. ఇది భారతీయ సమాజం లోని కుల వ్యవస్థపై ఒక విమర్శ, కానీ నిరాశకు బదులు సామూహికపోరాటానికి పిలుపు. రచయిత కోయి కోటేశ్వరరావు తన సాహిత్యంతో దళిత మూలాలను గర్వంగా భావించడం, వారి హక్కులకోసం పోరాడటం ఇక్కడ నేపథ్య సందేశం. ఇది సాహిత్యం మరియు సామాజిక ఉద్యమాల మధ్య సంబంధాన్ని నొక్కిచెప్పే ఒక సాహసప్రయత్నం. "నాగస్వరం"ఒక కవితా సంపుటి మాత్రమే కాదు. ఒక సాంస్కృతిక పునరుజ్జీవనం. కోయి కోటీశ్వరరావు దళితుల మనస్తత్వాన్ని, వారి సృజనాత్మక శక్తిని ప్రపంచానికి చూపించాడు. కుల వివక్షను "నాగస్వరం" ధ్వనితో ధ్వంసం చేయాలనే ఆకాంక్షతో కవిత్వానికి ప్రాణం పోసి తెలుగు సాహిత్యంలో దళిత వాస్తవికతకు దారి చూపాడు.వేదంలో ఏముందో తెలియదు గానీ/మా అయ్య స్వేదం లోనే సృష్టి జీవం ఉంది"".అనే వాక్యాలు ప్రాచీన గ్రంథాలపై సవాలుగా నిలుస్తాయి. ఇక్కడ శ్రమ, పొలం, మట్టి, సామాన్య జీవితం శ్రమైక జీవితంలోని వేదాంతాన్ని చూశాడు రచయిత. రాముడి పాదాలు కంటే, సామాన్యుడైన తండ్రి పాదాలు మట్టిని పరమాన్నంగా మార్చడం అనేది శ్రమజీవుల మహిమను ప్రతిబింబిస్తుంది. దైవం గుడిలో కాదు, పంట పొలాలలో ఇళ్లలోని అన్నపాత్రలో ఉందిని కవి స్పష్టం చేశారు. సామాజిక వైరుధ్యాల పై తీవ్ర విమర్శ చేస్తూ,కవితలోని కొన్ని పంక్తులు సమకాలీన సామాజిక వ్యవస్థపై కలంకత్తిని జలిపించారు. కులవ్యవస్థ యొక్క అసహ్యకరమైన తీరుపై తీవ్రమైన విమర్శ చేశారు. మన సాంకేతిక పరిజ్ఞానం/ చంద్రుని మీద రహస్యాలను శోధిస్తుంటే/మన సంస్కారం మాత్రం/ఇంకా కులం మలాన్ని వాసన చూస్తుంది. నేటి సాంకేతిక యుగంలో కూడా మనిషి కులము యొక్క అస్తిత్వాన్ని వదలకపోవటం ఎంతటి అమానుశ్రమం అర్థమయ్యేలాగా చెప్పారు."ఆడతనమే ఆగర్భ శత్రువు/ అత్యాచారం జరగని చోటు భూస్థలం అంతా దొరకదు"అని స్త్రీలపై అత్యాచారాలు, లింగ అసమానతలను ఘాతుకంగా బహిర్గతం చేశారు. కాళ్లు చేతులు నరకబడిన/కారం చేడు నువ్వైతే/గుండె పగిలిన చుండూరుని నేను/ దళిత మాత కనుబొమ్మల్ని/ విడదీసే కుంకుమ చెట్టుని/ కూకటి వేళ్లతో పేగులుదాం"/ కుల ఆధిపత్య వ్యవస్థకు వ్యతిరేకంగా దళిత ప్రతిఘటనను చిత్రించారు,కవి కోయి కోటేశ్వరరావు. బలాదూరుగా ఎక్కడెక్కడో తిరిగే నీటి ప్రవాహం/పవిత్ర గంగాజలమవుతుంది కానీ/అమ్మ అంత ఆత్మీయంగా/నేను వండిన అన్నం మాత్రం/అంటరానిదయింది!అనే పంక్తులు హిందూ సాంప్రదాయంలోని విడ్డూరమైన పవిత్రతా భావనలను ఎత్తి చూపుతాయి. నదులు, మంత్రాలు పవిత్రమైనవి కాగా, శ్రమజీవి చేతుల అన్నం "అంటరానిది" అవడం సామాజిక వ్యాధిని బహిర్గతం చేస్తుంది. సమతా పరిమళాలు ప్రసరించే/బోధి వృక్షం పై కూర్చుని/అసమానతలు, అంతరాలు శాశ్వతం/'కావు' 'కావు' 'కావు'అని/ఎలుగెత్తి చాటాలనిపిస్తుంది. అని అసమానతులపై కవి వేదనను వ్యక్తపరిచారు. పూరి గుడిసెలకు ఆత్మగౌరవ/పోరు పాఠాలు నూరి పోసిన కవీ!/నువ్వు లేకపోతే మాత్రం ఏమైంది?/వర్ణ సమాజం ఒంటిమీద/నీ వాక్యము కరెంటు తీగల పాకుతూనే ఉంటుంది. ప్రముఖ కవి మద్దూరి నాగేష్ బాబు కవిత్వాన్ని యాది చేశారు.సామ్రాజ్యవాద వ్యతిరేకత, కుల విముక్తి, లింగ సమానత్వం, మరియు శ్రమజీవుల ఆధిపత్యం.అనే నాలుగు స్తంభాలపై నిలిచి, తెలుగు సమాజానికి ఒక ఆదర్శ ప్రపంచాన్ని ఊహిస్తుంది. కవి యొక్క "నాగస్వరం" ఒక వ్యక్తి యొక్క స్వరం కాదు %-% ఇది.అణగారిన వర్గాల అన్ని స్వరాల సమ్మిళితం. ఇది చదివే వారిని ప్రశ్నించేలా చేస్తుంది."మన సంస్కారం ఇంకా కులం మలాన్ని వాసన చూస్తే, చంద్రుడిపై రహస్యాలు ఎందుకు?" ఈ కవిత ఒక యుద్ధగీతం. ఇది భూమికి, శ్రమకు, స్త్రీకి, దళితునికి మరియు మనుషులందరికీ సమర్పించబడిన చైతన్య గీతిక. నేను భీమపతాకాన్ని అంటే డాక్టర్ భీమ్ రామ్ అంబేద్కర్ చైతన్య పతాకాన్ని, నాది నాగస్వరం అంటే దళిత సాంస్కృతిక ప్రతీక, అని కవి కోటేశ్వరరావు తన గుండెల్లోని తిరుగుబాటును ప్రకటించారు."అవమానాల నిప్పును పుక్కిట పట్టిన కవిత్వం"ఈ నాగస్వరం కోటి గొంతుల స్వరమేల అవుతుందని ఆకాంక్షిస్తూ కోటికి శతకోటి అభినందనలు తెలియజేశారు. ప్రొఫెసర్ శిఖామణి."పొలిమేరల ఆవలి నుండి వినిపించే పొలికేకలు"కోయి కోటేశ్వరరావు కవిత్వంలో దుఃఖముంది .ఆగ్రహం ఉంది నిరసన ఉంది ప్రేమ ఉంది .వీటన్నిటిని వ్యక్తపరచటానికి ఎక్కువ సందర్భాలలో వ్యంగ్యాన్ని సాధనంగా ఎంచుకున్నాడని కలేకూరి ప్రసాద్ ముందుమాటలో తెలుస్తుంది. ప్రముఖ దళిత సాహితీ విశ్లేషకులు జి.లక్ష్మీనరసయ్య మాటలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తాత్వికతకు కవిత్వ రూపమిచ్చిన విలువైన పుస్తకం "నాదస్వరం"అని కోయ కోటేశ్వరరావు తాత్విక కవిత గీతికను వివరించారు.



పూసపాటి వేదాద్రి
కవి సాహితీ విశ్లేషకులు
9912197694

# కార్పొరేట్‌ను ఓడగొట్టండి!




చాలా మందికి ప్రజలతో ఎలాంటి సంబంధం లేకుండానే డబ్బు పుష్కలంగా సంపాదించుకున్న, తర్వాత ప్రజా సేవ యాదికి వస్తుంది.అలాంటి వారి ఎంగిలి మెతుకులకు ఆశపడే వారు, కక్కుర్తి పడే వారు, వారికి మద్దతు ఇస్తూ ఉంటారు.వారికి ప్రజా సేవలో జీవితం అంకితం చేసిన వారు కనిపించరు. కేవలం డబ్బున్న వాళ్ళే కనిపిస్తారు. ఇప్పుడు తెలంగాణ లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం, నుంచి పోటీకి దిగిన వాళ్ళలో కొందరు అలాగే గెలిచి పోవాలని చూస్తున్నారు. కరీంనగర్, అదిలాబాద్ తదితర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కార్పొరేట్ లను ఓడించాలని, సింగరేణి ప్రాంతం పట్టభద్రులు నిర్ణయించుకున్నారు. జీవితాంతం విద్య ను వ్యాపారంగా చేసుకుని ఇప్పుడు, ప్రజా సేవ అంటూ రంగం లోకి రావడం, దానికి కి కాంగ్రెస్ పార్టీ ట్యాగ్ ( అభ్యర్థిగా) రంగ ప్రవేశం చేయడం జరిగింది. విద్యను అమ్ముకుని కోట్లు గడించిన వ్యక్తి, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల నేత, యజమాని నరేందర్ రెడ్డి పట్ల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం పట్ల వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. ఇతనికి మద్దతు ఇచ్చే వారుకూడా విద్యా వ్యాపారం లో రాటుదేలిన వారు కావడం విశేషం! ఇలాంటి వారిని గెలిపించడం, ఇలాంటి వారికి మద్దతు ఇవ్వడం అంటే ఆత్మవంచన చేసుకోవడమే, అవుతుంది. పార్టీ ఏదైనా కానీయండి, ఇలాంటి వ్యాపారస్తులకు, ఓడించాలని, సింగరేణి ప్రాంతం పట్టభద్రులు బాహాటంగా పేర్కొంటున్నారు. నరేందర్ రెడ్డి ఇప్పుడు తాను పోటీ చేస్తున్న పట్టభద్రుల పరిధి లోని నియోజకవర్గం లో ప్రజలకు సేవ చేసిన దాఖలా లేదు! విద్యార్థుల నుంచి అత్యధిక ఫీజులు వసూలు చేసి సంపాదించుకోవడం, తప్ప చేసిన మేలు లేదు! అలాంటి వారికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం ఏమిటో, ఎమ్మెల్యే లు, ఎంపీ లు అతనికి ఓటు వేసి గెలిపించాలని, కోరడం ఏమిటో, వారే సమాధానం చెప్పాలి! కేవలం డబ్బుల ద్వారా గెలువాలని, అనుకునే వారిని, డబ్బులు తీసుకుని అతనికి సపోర్ట్ చేసే వారికి సైతం బుద్ధి చెప్పాల్సిన సమయం ఇది! ఇక్కడ ఈ పార్టీ, ఆపార్టీ అని కాదు, కాని నిజంగా ఏవైరైత ప్రజలకు మేలు చేస్తారో వారిని, రాజకీయ పార్టీ లకు అతీతంగా గెలిపించడం, ఉత్తమం! విద్యను వ్యాపార సామ్రాజ్యంగా అభివృద్ధి చేసి,సంపాదించుకున్న, ఆస్తులను కాపాడుకునే లక్ష్యం తో పోటీలో ఉన్న వారిని ఓడించండి! ఇదే నినాదం తో కోల్ బెల్ట్ లోని పట్టభద్రులు, సింగరేణిలో పట్టభద్రులు అయిన కార్మికులు, బాహాటంగా చర్చించుకుంటు న్నారు. ఈ మేరకు చాప కింద నీళ్ళ లా ప్రచారం కూడా సాగడం విశేషం! విజ్ఞత గల, సమాజ శ్రేయస్సు కోరే వారందరూ నిజాన్ని గ్రహించాలి! విలువైన ఓటును అమ్ముకోకండి! ఉన్న దాంట్లో హూ ఇస్ బెటర్ అనే ది చూసి పార్టీ లకు అతీతంగా ఎమ్మెల్సీ నీ ఎన్నుకోండి! ఈ రోజు కాకుంటే రేపు సాధ్యం కాదు!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# భారత ఆర్థిక అభివృద్ధికి-వ్యూహాలు, సూచనలు, సలహాలు



భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం కీలకమైన మలుపు తీసుకుంటోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 6.4 శాతం వృద్ధి రేటును అంచనా వేయడం దేశ ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తోంది. దీన్ని కొనసాగించడానికి ఇంకా వేగంగా అభివృద్ధి చేసేందుకు వివిధ రంగాల్లో సంస్కరణలు, సమర్థమైన విధానాలు, మౌలిక వసతుల ప్రణాళికలు అవసరం. దీని కోసం ఖర్చులను నియంత్రించడం, రుణ భారం తగ్గించడం, ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణ, ప్రైవేట్ రంగంలో సమర్థత పెంపు, వ్యవ సాయ, పరిశ్రమ, సేవా రంగాల్లో సంస్కరణలు తీసుకురావడం వంటి చర్యలు తీసుకోవాలి.

**ఆర్థిక స్థిరత్వం, అప్పును తగచటం:**

ప్రస్తుతం భారతదేశ జి.డి.పీ (జాతీయ స్థూల ఉత్పత్తి) లో స్వదేశీ,విదేశీ రుణ భారం 83.9 శాతంగా ఉంది. ఇది ఆర్థిక స్థిరత్వానికి పెనుముప్పుగా మారే ప్రమాదం ఉంది. దీన్ని తగ్గించడానికి ఖర్చుల నియంత్రణ, ఆదాయ వనరుల విస్తరణ వంటి చర్యలు అవసరం. ముఖ్యంగా పన్నుల పరంగా కొత్త మార్గాలను అన్వేషించి, జి.ఎస్.టి (వస్తు సేవల పన్ను) వసూళ్లను మరింత సమర్థవంతంగా నిర్వహించాలి. అంతర్జాతీయ సేవల ఎగుమతుల వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా విదేశీ మారక నిల్వలను పెంచుకోవచ్చు. ప్రభుత్వ వ్యయాలు నిఖార్సుగా అవసరమైన వాటిపైనే ఉండేలా సున్నా-ఆధారిత బడ్జెట్ విధానాన్ని అనుసరించాలి.

**ప్రైవేట్ రంగాన్ని బలోపేతం :**

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎం.ఎస్.ఎం.ఇ - మైక్రో, స్మాల్ అండ్ మిడియం ఎంటర్ప్రైజెస్) భారతీయ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నప్పటికీ, తగినంత పెట్టుబడులు లేక అవి స్థిరంగా ఎదగలేక పోతున్నాయి. "ఆత్మనిర్భర్ భారత్ పథకం" కింద మైక్రో, చిన్న పరిశ్రమలకు రూ. 50,000 కోట్ల నిధిని కేటాయించడం ద్వారా మౌలికమైన పెట్టుబడిని పెంచినప్పటికీ, ఇంకా మరిన్ని ప్రోత్సాహకాలు అవసరం. అదే సమయంలో పెద్ద కార్పొరేట్ల దుర్వినియోగాన్ని నిరోధించేం దుకు విలీనాలు, స్వాధీనం, పోటీ చట్టాలను బలోపేతం చేయాలి.

**వ్యవసాయ రంగ అభివృద్ధి:**

వ్యవసాయ రంగం 2024-25లో 3.8 శాతం వృద్ధిని సాధిస్తుందని అంచనా. కానీ దీనిని ఇంకా మెరుగుపరచడం కోసం సమర్థవంతమైన నీటి నిర్వహణ, నాణ్యమైన సాగు పద్ధతులు, ఖరీఫ్, రబీ పంటల విస్తీర్ణంత పెంపు, ఆధునిక యాంత్రిక పద్ధతులు చేపట్టాలి. వ్యవసాయ మార్కెట్ సంస్కర ణలు చేపట్టి, రైతులకు నేరుగా వినియోగదారులకు అమ్ముకునే అవకాశాలను కల్పించాలి. వ్యవసాయ రంగానికి క్లైమేట్ స్మార్ట్ టెక్నాలజీలను ప్రవేశపెట్టడం ద్వారా ఉత్పాదకత పెంచుకోవచ్చు.

**పారిశ్రామిక రంగాన్ని ముందుకు నడిపించే మార్గాలు:**

భారత పారిశ్రామిక రంగం 2024-25లో 6.2 శాతం వృద్ధిని సాధిస్తుందని అంచనా వేశారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని మరింత ప్రభావవంతంగా రూపొందించాలి. ప్రధానంగా ఇలెక్ట్రానిక్స్, ఔషధ ఉత్పత్తుల తయారీ పై ఎక్కువ దృష్టి పెట్టాలి. ఆటోమేషన్, బ్లాక్ చైన్,చిప్ డిజైన్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, వంటి సాంకేతికతల వినియో గాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉత్పాదకత పెంచి, నాణ్యమైన భారతీయ ఉత్పత్తులను అంతర్జాతీయంగా పోటీ చేయగలిగే స్థాయికి తీసుకెళ్లాలి.

**సేవల రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలి:**

సేవల రంగం జి.డి.పీ లో సుమారు 54.72 శాతం వాటా కలిగి ఉంది. కానీ ఇందులో మరిన్ని విస్తరణ అవకాశాలు ఉన్నాయి. ఫిన్‌టెక్, ఎడ్‌టెక్, హెల్త్‌కేర్ టూరిజం వంటి రంగాలను మరింత వేగంగా అభివృద్ధి చేసేందుకు సరైన ప్రణాళికలు అవసరం. ఐ.టీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), బిపిఓ (బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్) రంగాలలో కొత్త పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ఉద్యోగావకాశాలు పెంచుకోవచ్చు. ప్రభుత్వ వైద్య ఖర్చులు గత సంవత్సరాల్లో పెరిగినప్పటికీ, ఇంకా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ మెరుగుపరచాలి. గ్రామీణ ప్రాంతాల్లో అధునాతన వైద్య సదుపాయాలను విస్తరించి, ఏఐ (కృత్రిమ మేధస్సు) ఆధారిత వైద్య సేవలను ప్రోత్సహించాలి. విద్యారంగంలో స్కూల్, కాలేజీల వసతులను మెరుగుపరిచి, అత్యాధునిక సిలబస్, పరిశోధనకు పెద్దపీట వేయాలి.

**ఉద్యోగ, మౌలిక వసతుల అభివృద్ధి:**

భారతదేశంలో నిరుద్యోగిత రేటు 2023-24లో 3.2 శాతానికి తగ్గింది. కానీ ఇప్పటికీ నైపుణ్యపు కొరత సమస్యగా ఉంది. ఇంజనీరింగ్, సాంకేతిక విద్యా కోర్సులను వాస్తవ అవసరాలకు అనుగుణంగా మార్చి, సరికొత్త రంగాల్లో నైపుణ్యాలను పెంచే విధానాలను అమలు చేయాలి. మౌలిక వసతుల ఖర్చులు 2024లో 8.2 శాతం పెరిగాయి. రోడ్లు, రైల్వేలు, విమాన మార్గాల అభివృద్ధి ద్వారా వ్యాపార సౌకర్యాలను పెంచాలి. ఇలా సరైన విధానాలు, దృఢ సంకల్పంతో అమలు చేయాలి. వ్యవస్థల సమర్థతను పెంచే సంస్కరణలతో భారతదేశం గణనీయమైన ఆర్థిక వృద్ధిని సాధించగలదు. దీని కోసం ఆర్థిక క్రమశిక్షణ, సరైన పెట్టుబడులు, రంగాల వారీగా సమర్థత పెంపు వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

**రా!**

నోటికి తాళం వేసుకో
నిత్యసత్యాలనుజి
కంధరం లో దాచుకో
ఆకలి వేస్తున్న
దాహం వేస్తున్న
కడుపులో పైత్యరసం
మంటలు రేపు తున్న
నోరు మెదపకు
ఆకలి తో కడుపు మాడ్చుకో
చూడలేనివి భరించలేనివి
కర్కశ రూపాలు
కదను తొక్కుతున్న
కంతలు కట్టిన గుర్రం లా ఉండిపో
బలమైన బాహుల్ని ముడ్చుకుని
జీ హుజూర్ అంటు కూర్చో తాబేలు లా
చీకటి పులి దెబ్బలు దరువుల్లా పడుతున్న
భరించు బందీవై ఉండిపో...
నీవు అసమర్థుడవు
నీవు పిరికి వాడివి
నీవు ప్రజా ద్రోహివి
అన్నా భరించు
కుక్కిన పేనులా ఉండిపో...
నీలోని అపార శక్తి
నీలోని అపార మేధ
నీలోని త్యాగశీలత
నీలోని మానవతా స్ఫూర్తి
వెలిగించాలి కదా
పరుగులు పెటించాలి కదా
వెలుగులు పంచాలి రా
చీకటి గుహనుండి పులిలా రా
యుద్ధ వీరుడి లా
విప్లవ యోధుడి లా
నదికి గతిశక్తి స్థితిశక్తి ఉన్నట్లు
నీలోను ఉంది రా
బహుజన కేతన మై
బడుగుల లోకం కోసం రా...
అరాచక కీచక పాలన
మనుష్యులను తెగలు గా మతాలు గా
విభజించి పాలించె పాలనపై
పాదం నుండి మస్తకం దాక
నిండామునిగిన తీవ్రవాదంపై
ఖననం చేసిన శవాల పై
భవనాలు నిర్మించె దుర్నీతి పై
ఓ సమసమాజ సమూహం లోకి రా
ఓ మానవ విలువల సమూహం లోకి రా
రావాలి అడుగుల్లో అడుగు కలుపుతూ
రావాలి చేతన తేవాలి
బుద్ధగీతం ఆలపించాలి

**రేడియమ్**
**9291527757**

# ప్రమాదంలో ఆదివాసీల జీవించే హక్కు

**(పౌరహక్కుల నేత అమరుడు ఫిబ్రవరి 18 అమరుడు ఆజాం అలీ వర్ధంతి)**

వ్యక్తులుగా పుడతారు, ఉద్యమంగా విస్తరిస్తారు, ప్రజల కోసం వీరులుగా మరణిస్తారు. వీరోచిత త్యాగాలతో ప్రజల ఉద్యమాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆజాం అలీ అమరత్వం 18-02-2001 మనకు సజీవ సాక్ష్యంగా కనబడుతుంది. జీవించే హక్కును అణచివేస్తున్న ఎన్‌కౌంటర్ విధానాన్ని దేశ వ్యాప్తంగా అన్ని హక్కుల సంఘాలు ప్రశ్నిస్తున్నాయి, దానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నాయి ప్రభుత్వాలు పౌరహక్కుల ఉద్యమకారుల్నే వ్యవస్థీకృత హత్యకు, హత్యకు గురి చేస్తున్నాయి, ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా పరిపాలన చేయలేని స్థితికి నెట్టబడ్డాయి. తమ అప్రజాస్వామిక అణచివేత విధానాలు ప్రజలకు అర్థం కాకుండా ఉండడం కోసం ప్రశ్నించే గొంతులైన పౌరహక్కుల నేతలు హత్యలకు గురి చేస్తున్నారు. అందులో భాగంగానే కాశ్మీర్‌కు చెందిన జలీల్ ఆంద్రాబీని సైన్యం హత్య చేసి, జీలం నదిలో పడేసింది. అస్సాం మానవ అధికార్ సంగ్రామ్ సమితికి చెందిన పరాగ్‌కుమార్ దాస్‌ను ఉల్ఫా ఉద్యమం నుంచి సరెండరై సల్ఫాగా కొనసాగుతున్న సాయుధ మిలిటెంట్లచే హత్యగావించబడ్డారు. ఉద్యమాల్లో ఉండే పోరాట తత్వం ఉద్యమకారుల్ని అమలరులుగా, ఉన్నతులుగా మారుస్తాయి. ప్రశ్నించే గొంతులంటే ప్రభుత్వాలకు గిట్టదు, పౌర హక్కుల సంఘం ప్రశ్నలంటే మరీ మరీ సహించలేని స్థితిలో గోపిరాజన్న మొదలుగా ఆజాం అలీ వరకు హత్యలతో హక్కులోద్యమాన్ని నిశ్శబ్దం చేయాలని అన్ని ప్రభుత్వాలు భావించాయి. కాని హక్కులోద్యమం రాజ్యనిర్బంధానికి ప్రాణ త్యాగానికే సిద్ధపడింది తప్ప ఉద్యమ కార్యాచరణను ఏనాడూ వదులుకోలేదు. హత్యల తరువాత ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా ఉండడం కోసం ఉద్యమకారుల హత్యలకు ప్రతీకార హత్యలుగా పౌరహక్కుల ప్రజాసంఘాల నేతల హత్యలు జరుగుతున్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. పురుషోత్తంను 23 నవంబర్ 2000 సంవత్సరవంలో సర్కార్ హంతకముఠా నయీం హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో హత్య చేశారు. పురుషోత్తం మరణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కారణమైనప్పటికి అరెస్టు కాబడ్డ నయీం ముఠాను పత్రికా సమావేశం ఏర్పరచి నేరస్తులు తామేనని ప్రజల ముందు ప్రకటన చేశారు. పురుషోత్తం అమరత్వం తరువాత సరిగ్గా 3 నెలలకు నల్గొండలో పురుషోత్తం సంస్మరణ సభ నిర్వహిస్తున్న ఆజాం అలీని కూడా ప్రభుత్వం నీయిం మూఠా కలిసి అమానుషంగా హత్యచేశారు. ఆ హత్యలకు న్యాయవ్యవస్థ విఫలత వల్ల నేరస్తులకు శిక్షలు



పడలేదు. చివరికి పోలీస్ అధికారి నేరంలో హంతకుడుగా ఉన్న నయీమే అనేక హత్యలతో పాటు అనేక భూ ఆక్రమణలు చేసి ప్రజల భయపడే విధంగా ప్రభుత్వాలు నిలబెట్టాయి. చంద్ర బాబు, వైఎస్ఆర్, చివరికి కెసిఆర్ కూడా అతనితో అక్ర మ లావాదేవీలను హక్కులోద్యమకారుల అణచివేతను కొనసాగించి చివరికి నయీంను కూడా బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్యచేసింది. దీన్ని కూడా పౌరహక్కుల సంఘం ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని తన నిజనిర్ధారణలో ప్రకటించింది కూడా.

అమరుడు అజాం అలీ అన్నట్టుగా హక్కుల కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా త్యాగం చేసి నిర్బంధకాలాన్ని కూడా జయించిన హక్కుల నేతల పురుషోత్తం. మృధువైన గొంతులను కర్కషంగా కత్తులతో తెగ్గోస్తే ప్రజల్ని నమ్ముకున్న హక్కుల ఉద్యమ కారుడు ప్రాణాన్ని ప్రజలకు అంకితం చేశాడు. ప్రపంచ బ్యాంకు ఉద్యోగి చంద్రబాబు ప్రజా వ్యతిరేక పథకాలను వ్యతిరేకిస్తూనే రాజధాని అయితే కొంత రక్షణగా ఉంటుందనే ఆలోచన స్థాన చలనానికి కారణమైంది. ఆలోచనా, ఆకాంక్షలను నియంత్రించడానికి శిరస్సుపై వేలాడుతున్న కత్తి ఉన్నప్పటికి, ఛాతికి గురిపెట్టబడ్డ తుపాకీ ఉన్న ఎప్పటికి విజయం సాధించలేదు. సాపేక్షికంగా వేగంలో మార్పులు జరగవచ్చు తప్ప పయనానికి మాత్రం ప్రజలే ఊపిరి, హక్కుల ఉద్యమాలే ఉఛ్వాస, నిశ్వాసాలు.

ఈ విధంగా జరిగిన ఎన్ కౌంటర్ హత్యాకాండ ఆపరేషన్ కగార్ పేరుతో 1 జనవరి 2024 నుండి దండకారణ్య ప్రాంతంలో అమలు కాబడుతున్నాయి. సుమారు 650 భద్రతా దళాల క్యాంపులు 7 లక్షల మంది పారా మిలిట్రీ బలగాలతో దానికి తోడు డిఆర్‌జి బలగాలు నిత్యం కూంబింగ్ నిర్వహిస్తూ ఆదివాసీలను అమానుషంగా హత్యగావిస్తున్నది. ఏడాది కాలంగా జరుగుతున్న హత్యాకాండ ఇప్పటికే 400 మార్కును దాటేసింది. ఎన్‌కౌంటర్ కొనసాగుతుండగానే మృతుల సంఖ్య బయటకి వస్తుంది. ఎందుకంటే ముందుగానే ఆదివాసీలను క్యాంపుల్లో నిర్బంధించి ఉంచి చంపాలనుకున్నప్పుడు డ్రెస్సులు తొడిగి అడవిలోకి తీసుకెళ్ళి కాల్చి చంపడమే ఎన్‌కౌంట్ ఆనవాయితిగా కొనసాగుతుంది. అందుకనే ముందుగానే ఎన్‌కౌంటర్ సంఖ్య బయటికి వచ్చేస్తున్నది.

భారత దేశంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం అంతర్భాగమా, కాదా అనే అనుమానం మునుపెన్నడూ లేని విధంగా ఇప్పుడు బలంగా వస్తున్నది. ఎందుకంటే అక్కడి ఆదివాసులు ఈ దేశ ప్రజలా? కాదా? అనే అనుమానం అందరికీ వస్తుంది. ఎందుకంటే గత రెండు దశాబ్దాలుగా చత్తీస్‌ఘడ్ ఆదివాసీలపై అముల కాని రాజ్యం కొనసాగిస్తున్న మారణకాండ రూపాలు మార్చుకుంటూ వస్తున్నది. ఇప్పటికే వేలాదిగా ఆదివాసీలు హత్యకు గురికాబడ్డారు. లక్షల్లో నిర్వాసితులయ్యారు. 2005 నుండి సల్వాజుడుం పేరుతో వేలాది మంది ఆదివాసీలను రమణ్‌సింగ్ ప్రభుత్వం హత్య చేసింది. ప్రొ. నందిని సుందర్, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రజాస్వామిక బాధ్యత వలన సల్వాజుడుం రద్దుకాబడింది. కాని అందులో పని చేసిన వారందరిని డిఆర్‌జి బలగాల పేరుతో కొత్త ఫోర్సుగా ప్రభుత్వంలో చేర్చుకున్నారు. సల్వా జుడుం తర్వాత 2009 లో ఆపరేషన్ గ్రీన్ హంట్ ప్రకటించబడింది. దీనితో సిఆర్‌పిఎఫ్ బలగాలతో పాటు డిఆర్‌జి బలగాలు కూడా ఆదివాసులపై దాడులు చేస్తూ హత్యాకాండను కొనసాగించాయి. అందులో భాగంగానే 2012లో జరిగిన బాసగూడ హత్యాకాండ, 2013 లో ఎడిసిమెట్టలో కూడా ఇటువంటి మారణకాండనే కొనసాగించారు. ఒక్కక్క ఎన్‌కౌంటర్ ఘటనలో 17 మంది ఆదివాసీలు మరణించారు. ఇందులో స్కూలుకు వెళుతున్న మైనర్ బాలురు 5గురు ఉన్నారు. 2011 నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశ అమలవుతూ వస్తుంది. ఈ కాలంలో ఆదివాసీల అక్రమ అరెస్టులు నిర్విరామంగా కొనసాగాయి. సుక్మా, దంతెవాడ, జగ్‌దల్‌పూర్, రాయపూర్ జైళ్ళన్నీ ఆదివాసీలతోనింపబడ్డాయి. అందరిపై ఉపా కేసులు నమోదు కాబడ్డాయి. చత్తీస్‌ఘడ్ ప్రత్యేక భద్రతా చట్టం కేస్ కూడా మోపబడింది. 2017 నుండి ఆపరేషన్ సమాధాన్ పేరుతో డ్రోన్‌లతో దాడి ప్రారంభించారు. జనవరి 1, 2024 నుంచి ప్రారంబమైన ఆపరేషన్ కగార్ 6 నెలల పాప మంగ్లీ సోడి నుంచి ప్రారంభమైంది. ఆమె బీజాపూర్‌జిల్లా మూద్దాం గ్రామానికి చెందిన పాప. పోలీసులు కాల్పులు జరిపి 6 నెలల పాపను చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తారు. ఇప్పటికే ఆపరేషన్ కగార్ పేరుతో 400 మంది ఆదివాసులను అమానుషంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో జరుగుతున్న ఏ మారణకాండపైనైనా హక్కులసంఘాలుగా నిజనిర్ధారణ జరిపి ఇందులో బాధ్యులెవరు, దోషులెవరు అని ప్రపంచానికి తెలియజెప్పే బాధ్యత దశాబ్దాలుగా హక్కుల సంఘాలు బాధ్యత నిర్వహిస్తున్నాయి. కానీ ఇప్పుడు పూర్తిగా ఆదివాసీల జీవించే హక్కు ఆపరేషన్ కగార్ పేరుతో ప్రమాదంలో పడి ఉన్నది.

మన మౌనం నిరసనగా భావించడం లేదు. దాన్ని అంగీకారంగా మన అసమర్థతగా ప్రభుత్వాలు భావిస్తున్నాయి. మన దేశంలోనే మూలవాసులైన ఆదివాసులను అడవిలో కోట్లాది విలువైన సహజ సంపదను కాపాడుతున్న 2005 నుండి సాయుధ మిలిట్రీ బలగాలతో సల్వాజుడుం ప్రైవేటు బలగాలతో ఆదివాసుల జీవనాన్ని పూర్తిగా అతలాకుతలం చేస్తున్నారు. అందులో భాగంగానే ఇప్పుడు 2004 నుండి ఆపరేషన్ కగార్ హత్యాకాండ నిరంతరంగా కొనసాగిస్తుంది. ఈ ఎన్‌కౌంటర్ ఇప్పుడు10 ల సంఖ్య నుండి 100ల్లోకి రేపు రేపు వందల్లో నుండి వేలల్లోకి కూడా ఈ హత్యాకాండ కొనసాగే అవకాశం ఉన్నందున అమరుడు ఆజాం అలీ సంస్మకరణ సందర్భంగా ఆదివాసుల జీవించే హక్కును కాపాడే బాధ్యతను వెతుక్కునే వాళ్ళంగా మన నిశబ్దాన్ని మనమే బద్దలు కొట్టుకుందాం, ఆదివాసుల పక్షం వహిద్దాం. వాళ్ళ జీవించే హక్కు రక్షణ కోసం మనం ఉద్యమంగా కదులుదాం. ఆపరేషన్ కగార్‌లో భాగంగా దేశంలో ఉన్న వనరులను సామ్రాజ్యవాదులకు, బహుళజాతి కంపెనీలకు అప్పగించడం కోసం బుద్ధిజీవులను గొంతెత్తకుండా చేయడం కోసం అక్రమ ఉపా నిర్బంధాలు జైళ్ళల్లో కొనసాగిస్తున్న వ్యవస్థీకృత హత్యలను ప్రశ్నిస్తూనే ఆదివాసీలపై అమలవుతున్న అమానుష నిర్బంధాన్ని ఎదిరించడంలో ప్రశ్నించడంలో ఆజం అలీ సంస్మకరణలో భాగంగా ముందుకు రావాల్సిందిగా పౌరహక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటి ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, బుద్ధి జీవులకు, విద్యార్థి మేధావులకు పిలుపునిస్తున్నాం. ఫిబ్రవరి 18, 2025న ఆజాంఅలీ సంస్మరణ సభను విజయవంతం చేయడానికి ప్రజాస్వామిక వాదులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరుతున్నాము.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం



**శ్రద్ధగ చదువులు నేర్వగ బద్ధకమును**
**వీడివెళ్ళి-బాగుగబడికిన్**
**ముద్దుగనుండిరినచటన్.**
**బుద్ధిగక్రమశిక్షణందు-భువిలోబాలల్.**
**చిత్తకాగిదములసంచి-**
**నెత్తికొనియువీదిబాలలువెళ్ళగ-వీదులందు.**
**చదువునేర్వగకొందరు-చక్కగాను.**
**వెళ్ళుచుండిరిబడికిని-వేగిరముగను.**
**అక్షరములనునేర్చుక- లక్షణముగ**
**దిద్దుకొనుమోయిభవితను-బుద్ధి గాను.**
**మిట్టపల్లిపరశురాములు**

# ఆసరా కోసం ఎదురుచూపులు

- **వికలాంగుల సర్టిఫికెట్ ఉన్నా.. పింఛన్ లేని వైనం**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ఓ అనాథ మహిళను అంగన్వాడి ఉద్యోగులు అక్కున చేర్చుకున్నారు. ఆనంతరం సఖి కేంద్రానికి తరలించారు. ఆమెకు ఆసరా కల్పించే ప్రయత్నం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తనకు పింఛన్ కావాలని.. ట్రై సైకిల్ ఇప్పించాలని అధికారులను వేడుకున్నా.. ఫలించలేదు. ఈ విషయం తెలుసుకున్న అంగన్వాడీ ఉద్యోగులు ఆమెతో చర్చించి.. ఓ అనాధ మహిళగా గుర్తించారు. ఆమెను అక్కడి నుండి సీడీపీవో కార్యాలయానికి తీసుకెళ్లారు. పునరావాసం కల్పించేందుకు సఖి కేంద్రానికి తరలించారు. అందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం నుంచి ఓ మహిళ వేచి ఉంది. ఎంపీడీవోను కలవాలని ప్రాంగణంలో కూర్చుంది. అక్కడున్న మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది ఏం కావాలని ఆ మహిళలను ప్రశ్నించగా.. తనది పోచారం గ్రామమని.. తనకు ట్రై సైకిల్ కావాలని, ఆసరా పింఛన్ ఇప్పించాలని ఎంపీడీవోను కలిసేందుకు వచ్చానని సమాధానం ఇచ్చింది. ఎంపీడీవో ఇంకా రాలేదని వచ్చిన తర్వాత కల్పిస్తామని సిబ్బంది చెప్పడంతో కార్యాలయ ఆవరణలోనే వేచి ఉంది. చివరకు ఎంపీడీవో రావడం ఆలస్యం కావడంతో ఆ మహిళను మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోను కలవాలని సూచించారు. తను ప్రజావాణిలోకి వెళ్ళింది. అక్కడ



కూడా ఆర్డీవో అనంతరెడ్డి ఆమెను తన సమస్య ఏమిటని ప్రశ్నించారు. ఆమె నుండి ఎలాంటి సమాధానం రాలేదు. సైలెంట్‌గా కూర్చుని ఉండిపోవడంతో వెంటనే మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిని ప్రజావాణి కార్యక్రమంలోకి పిలిపించి.. సదరు మహిళ సమస్య కనుక్కోవాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కృష్ణ తన సెక్షన్ కు తీసుకెళ్లారు. ఆమె వివరాలు కనుకునే ప్రయత్నం చేయగా.. పొంతనలేని సమాధానం ఇచ్చింది. తనది ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామం అని ఒకసారి చెప్పగా.. మరోసారి మహబూబ్ నగర్ జిల్లా అని సమాధానం ఇచ్చింది. అయితే ఆమె వద్ద ఉన్న ఆధార్, ఇతర సర్టిఫికెట్లను పరిశీలించే ప్రయత్నం చేశారు. అయితే ఆమెకు 43 శాతంతో కూడిన సదరం సర్టిఫికెట్ కలిగి ఉంది. మరోవైపు తుర్కయాంజల్ అడ్రస్ పేరుతో ఆధార్ కార్డు కలిగి ఉన్నది. అయితే ఆమె నుంచి సరైన సమాధానం చెప్పకపోవడంతో జూనియర్ అసిస్టెంట్ కృష్ణ లిఖితపూర్వకంగా ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు రాయించుకొని సంతకం తీసుకున్నారు. కాగా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ ఉద్యోగులు వెంటనే ఆ మహిళ దగ్గరకు వచ్చి ఆమె కచ్చితమైన వివరాలు కనుక్కున్నారు. ఆమె తను అనాధనని, తనకు ఎవరూ లేరని.. ఎక్కడ బతకాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని, వచ్చిరాని మాటలతో సమాధానం ఇచ్చింది. అయితే తనకు ఉండడానికి జాగా.. తినడానికి తిండి దొరికితే చాలని ఆమె ఐసీడీఎస్ ఉద్యోగులతో చెప్పుకొచ్చింది. చివరకు ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి ఆమె అనాధగా ఐసీడీఎస్ ఉద్యోగులు గుర్తించారు. తను ఎక్కడ ఉన్న ఇబ్బందికర పరిస్థితులు ఉండడంతో ఆమెను వనస్థలిపురంలోని సఖి కేంద్రానికి తరలించి ఆశ్రయం కల్పిస్తామని సీడీపీఓ కార్యాలయానికి తీసుకెళ్లారు. సఖి కేంద్రంలో పునరావాసం కల్పించి.. తన ఆరోగ్యాన్ని మెరుగుపడే విధంగా చూస్తామని ఐసీడీఎస్ ఉద్యోగులు సరళ, పల్లవి చెప్పారు. ఇదిలా ఉంటే.. తనది పోచారం గ్రామమని తనకు ఆసరా మంజూరు చేయాలని ముందుగా.. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళింది. పోచారం గ్రామం అయినందున ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాలని మున్సిపల్ సిబ్బంది సూచించడంతో ఉదయమే ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి అధికారులను వేడుకున్నది. ఆమె ఖచ్చితమైన అడ్రస్సు చెప్పకపోవడంతో ఉద్యోగులు ఆమెను తమ వెంట తీసుకెళ్లి సఖి కేంద్రానికి తరలించారు. అయితే తన చిన్నతనంలోనే తన శరీరం కాలిపోవడంతో తను కొంత మతిస్థిమితం కోల్పోయినట్లుగా అనుమానిస్తున్నారు. ఆమెకు ఉన్నతమైన వైద్యం అందిస్తే ఆరోగ్యం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని ఉద్యోగులు తెలిపారు.

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

- **స్పీకింగ్ ఆర్డర్స్ జారీఅయిన వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించాలి**
- **జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి**
- **జీహెచ్ఎంసీవ్యాప్తంగా ప్రజావాణికి 139 ఫిర్యాదులు**



**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించరాదని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... టౌన్ ప్లానింగ్ నకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై సర్కిళ్లలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారహితంగా ప్రవర్తించడం సరికాదని, ఎవరి పనులు వారు బాధ్యత గా చేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులుస్పీకింగ్ ఆర్డర్స్ జారీ అయిన తర్వాత వెంటనే అనుసరించాల్సిన తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిబంధనల మేరకు అక్రమ నిర్మాణాలు తొలగించడంలో వెనకడుగు వేయరాదని ఆయన స్పష్టం చేసారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 57 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 25, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, ఫైనాన్స్ విభాగాలకు 3 చొప్పున, యుబిడి ల్యాండ్ అక్విజేషన్ విభాగాలకు 2 చొప్పున, శానిటేషన్, యుసిడి, ఎలక్ట్రికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 6 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 82 అర్జీలు అందాయని, అందులో కూకట్ పల్లి 29, ఎల్బీనగర్, సికింద్రాబాద్ లకు 19 చొప్పున, శేరిలింగంపల్లి 10, చార్మినార్ లో 4, ఖైరతాబాద్ లో ఒక్క ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు,సీపీ పి శ్రీనివాస్ గీతా రాధిక, పంకజ, సుభద్ర దేవి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు సి ఏం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ , యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, అడిషనల్ సిసిపి గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, డిప్యూటీ సీఈ పనసారెడ్డి, హౌసింగ్ ఈ ఈ లు పీవీ రమణ, రాజేశ్వర్ రావు,వాటర్ వర్క్స్ సాయి రమణ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజావాణికి సంబంధించి వచ్చిన అర్జీలను పరిశీలన చేసి పెండింగ్ లో లేకుండా అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఖమ్మంలోని గ్లోరీ జీసస్ సోషల్ సర్వీస్ సొసైటీ వర్క్ అసోసియేషన్ డైరెక్టర్ డి. గంగయ్య తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించుటకు ప్రభుత్వ ఆధీనంలో నిరుపయోగంగా ఖాళీగా ఉన్న భవనాన్ని కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన ఎం. సీత పేదరికంలో ఉన్న తనకు ఖమ్మం దగ్గరలో ఉన్న బీసీ గురుకులంలో స్వీపర్ పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిబిసిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలం



బచ్చోడు గ్రామంలోని బి. విజయ, బచ్చోడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో 7.5 లక్షలు ఖర్చుచేసి టాయిలెట్ల రిపేర్లు, కరెంట్ నీటి వసతి కోసం పనులు చేశామని, తమకు అడ్వాన్స్ 25 వేలు మినహా ఏ బిల్లు రాలేదని, తమకు త్వరగా బిల్లులు చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్. అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- **ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి**
- **నేటి ప్రజావాణికి 57 అర్జీలు**
- **నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను అదనపు కలెక్టర్లు, పి అమరేందర్, దేవ సహాయం, లతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ బాదావత్ సంతోష్, అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో



స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నేటి ప్రజావాణికి మొత్తం 57 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టరిత్యా చర్యలు

- **రెవెన్యూ డివిజినల్ అధికారి రవీందర్ రెడ్డి**

**హత్నూర, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** మైనింగ్ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి అన్నారు.హత్నూర రెవెన్యూ కార్యాలయాన్ని సోమవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.భూ సమస్యలు పరిష్కరించడంలో,విద్యార్థులకు ఆదాయ,కుల దృవీకరణ సర్టిఫికెట్ లు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందిని ఆదేశించారు. ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమంగా మట్టి తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తహశీల్దార్ ఫర్వీన్ షేక్‌ను ఆదేశించారు. అనంతరం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో



హత్నూర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని వారు సందర్శించారు. 417, 415 నెంబరు గల బూత్ లల్లో పోలింగ్ నిర్వహణకు సంబంధించి సమకూర్చిన వసతులను పరిశీలించారు. వారి వెంట డిప్యూటీ తహశీల్దార్ దావూద్ తదితరులు ఉన్నారు.

# అచ్చంపేటలో దొంగల హల్చల్

**అచ్చంపేట, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** అచ్చంపేట పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఆదివారం రాత్రి ఒక ఇంట్లోకి దొంగలు చొరబడి హల్చల్ చేసి మహిళపై ఉన్న పుస్తెలతాడును లాక్కొన్న ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన సమాచార మేరకు వివరాలు.. ఆదివారం సాయంత్రం పొద్దుపోయిన తర్వాత ఇంట్లో నేను ఒక్కదానినే ఉన్నానని, ఆ క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని మహిళలు అద్దెకిచ్చే గదులు ఉన్నాయని ఇంటిలోకి వచ్చారన్నారు. వారితో రెండు నిమిషాలు మాట్లాడి అనంతరం గదులు చూపిస్తుండగా ఉన్నట్టుండి ఆ



ఇద్దరు మహిళలు నాపై దాడి చేసి నా మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని గందరగోళం సృష్టించారన్నారు. ఈ క్రమంలో నీవు అరిసిన, ఎవరికైనా ఫోన్ చేసిన చంపుతామని బెదిరింపులకు పాల్పడుతూ తప్పించుకొని పారిపోయారన్నారు. తదుపరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అచ్చంపేట ఎస్సై రమేష్, సిఐ రవీందర్లు ఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలితో జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఆ మహిళా దొంగలు సిసి ఫుటేజ్ లో వెనుక వైపు నుండి నమోదు కావడంతో ఆ వ్యక్తులు ఎవరనేది గుర్తించడం కాస్త ఇబ్బందిగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- **కర్ణాటకలో టాస్క్‌ఫోర్స్ దాడులు**
- **10 లక్షల విలువ చేసే విత్తనాల స్వాధీనం**
- **పెద్దేముల్‌లో 2.70 లక్షల విలువ చేసే విత్తనాలు స్వాధీనం**

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** వర్షాకాలం జూన్ మాసం రాకముందే రైతులను నట్టేట్ల ముంచడానికి విత్తన మాఫియా పగడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అడ్డదారిన తెలంగాణలోకి నకిలీ విత్తనాలను అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకోవడానికి పతక రచన చేసింది. నాణ్యమైన విత్తనాలు సరసమైన ధరకు అందిస్తామని రైతులకు ఏరా వేసే ప్రయత్నం సాగించారు. పక్క ప్రణాళిక విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ బృందం దాడి చేసి విత్తన మాఫియా గుట్టు రట్టు చేసింది. అందులో ఒక్కరిని పట్టుకొని భారీగా నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం. వ్యవసాయ అధికారులు సంయుక్తంగా జరిపిన దాడిలో 10 లక్షల విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడినట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం మీడియాకు తెలియజేశారు. ఇందుకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలియజేశారు. జిల్లాలోని పెద్దేముల్ మండలంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఒక వ్యక్తి నాలుగు ప్లాస్టిక్ సంచులను పట్టుకొని అనుమానస్పదంగా కనిపించిన కారణంగా టాస్క్ ఫోర్స్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ పెద్దేముల్ ఎస్సై శ్రీధర్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతం లు పట్టుకొని విచారించగా ప్లాస్టిక్ సంచులు ట్విన్టల్ 50 కిలోల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలియజేశారు. వీటి విలువ సుమారు2.70 లక్షలు ఉంటుందని తెలియజేశారు. నకిలీ పత్తి విత్తనాలతో పట్టుబడిన వ్యక్తి గురిం చి విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల నియోజకవర్గం మార్టూరు



మండలం కొనంకి గ్రామానికి చెందిన వ్యక్తిగా నిందితున్ని గుర్తించినట్లు తెలియజేశారు. గత 15 సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్రం గాజుర్ కోట్ గ్రామం గురుమిట్కల్ యాద్గి ర్ జిల్లాలో నివాసం ఉంటూ అక్రమంగా నకిలీ పత్తి విత్తనాలను తెలంగాణ రాష్ట్రంలోకి చేరవేసి వివిధ ప్రాంతాల్లో జూన్ మాసంలో వర్షాలు రాకముందే అధిక ధరలకు రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకోవడానికి పెద్దెముల్ మండలానికి వచ్చి పట్టుబడినట్లు ఆయన తెలియజేశారు. కరణ్ కోట్ నాగేష్ టాస్క్ ఫోర్స్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ పెద్దెములు ఎస్సై శ్రీధర్ రెడ్డి కలిసి సమగ్ర విచారణ జరిపి నిందితుడు నివాసముంటున్న కర్ణాటక రాష్ట్రం గాజుర్ కోట్ గ్రామంలోని ఇంటిని సోద చేయగా దాదాపు నాలుగు గంటలకు పైబడి నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడినట్లు తెలియజేశారు. వీటి విలువ దాదాపు7.20 లక్షలు ఉంటుందని అన్నారు. నిందితుడు గతంలో నకిలీ పత్తి విత్తనాలను రైతులకు అమ్ముతుండగా పట్టుబడిన కారణంగా బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో నిందితునిపై కేసు నమోదు అయిందని తెలిపారు. వర్షాకాలంలో



నకిలీ విత్తనాలను మార్కెట్లో విక్రయించడానికి ప్రయత్నిస్తే పోలీసులు వ్యవసాయ అధికారుల నిఘా అధికంగా ఉంటుందని గుర్తించి ఈసారి వర్షాకాలం రాకముందే నకిలీ పత్తి విత్తనాలను రైతులకు అమ్మి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించారని ఆయన తెలియజేశారు. పట్టుబడిన నకిలీ విత్తనాల సంచులపై లేబుల్స్ ల్యాబ్ నెంబర్లు విత్తనాలు తయారుచేసిన గడువు తేదీలు లేవని ఇవి విక్రయించడానికి ప్రభుత్వ అనుమతులు లేవని గుర్తించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలియజేశారు. ఎవరైనా నకిలి విక్రయించడానికి ప్రయత్నిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఈ మేరకు పెద్దముల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితున్ని రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. సకాలంలో నకిలీ విత్తనాలను విక్రయించే వ్యక్తిని గుర్తించి భారీగా విత్తనాలు స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ బృందాన్ని నారాయణరెడ్డి అభినందించారు.

# శభాష్ పోలీస్..!




- **పోలీసులను అభినందించిన డీసీపీ ఎన్. కోటిరెడ్డి**
- **మేడ్చల్‌లో నడిరోడ్డుపై దారుణ హత్యను ఛేదించిన రక్షకులు**
- **బహుమతులు అందించేలా కమిషనర్‌కు సిఫార్సు**
- **నేరాలకు పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరిక**

**మేడ్చల్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నటి రోడ్డుపై దారుణ హత్యకు పాల్పడిన వారిని సకాలంలో అదుపులోకి తీసుకున్న పోలీసులను మేడ్చల్ డీసీపీ ఎన్ కోటిరెడ్డి అభినందించారు. సోమవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించిన డీసీపీ పలు వివరాలు వెల్లడించారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉమేష్(24) నేర చరిత్ర కలిగిన నిందితున్ని వరుసకు తమ్ముడైన రాకేష్, చిన్నాన్న కుమారుడైన లక్ష్మణ్, వారి సహచరులు కలిసి ఉమేష్‌ను హత్య చేశారు. ఉమేష్ వృత్తిరీత్యా ప్రైవేట్ ఉద్యోగి. అనేక నేరాలకు పాల్పడేవాడు. తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులనే అనేక విధాలుగా హింసించాడు. దీంతో విసుకు చెందిన



సొంత తమ్ముడైన రాకేష్, వరుసకు చిన్నాన్న కుమారుడైన లక్ష్మణ్, వారి సహచరులు భూక్యా నవీన్, భూక్య సురేష్, భూక్యా నరేష్ కలిసి పథకం వేశారు. ఉమేష్‌ను ఇంటిలో ఉండగానే అతనిపై దాడి చేశారు. ఇంటి నుంచి తప్పించుకొని నడిరోడ్డుపైకి రాగా వెంబడించారు. ఈ క్రమంలోనే ఉమేష్‌పై రాకేష్, లక్ష్మణ్ కలిసి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. దీనికి వారి సహచరులు కూడా సహకరించారు. హత్య కేసు నిందితులను సకాలంలో పట్టుకొని కేసును చేధించినందుకు మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి పోలీసులను అభినందించారు. వారికి తగు ప్రోత్సహకాలు అందించేలా కమిషనర్‌కు సిఫారసు చేసినట్టు తెలిపారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ సీఐ సత్యనారాయణ, మేడ్చల్ డిఐ సుధీర్ కృష్ణ, అడ్మిన్ ఎస్సై మన్మధరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఏ.అశోక్, అనిత, వీరంతా అడిషనల్ డీసీపీ కే.పురుషోత్తం ఆధ్వర్యంలో చాకచక్యంగా విధులు నిర్వహించి నిందితులను సకాలంలో పట్టుకున్నారని తెలిపారు.

# రెండు పార్టీలకు ఓట్లు అడిగే ముఖం లేదు

● మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్



**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలకు ఓట్లు అడిగే ముఖం లేక,అభ్యర్థులను పెట్టే దమ్ములేదని మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు.సోమవారం నల్లగొండలో పలు ప్రైవేట్ కాలేజీల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగసమస్య పరిష్కరించకుండా, యువతను దేశాభివృద్ధిలో బాగం చేయకుండా ముందుకు పోలేమని మోదీ తపన పడుతున్నారన్నారు.అందుకే ప్రభుత్వ స్కూల్స్ తో పాటు,ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ల్యాబ్ లను ఏర్పాటుకు నిధులు అందిస్తున్నారని తెలియజేశారు. ఉద్యోగులు కల్పించే కంపెనీలకు రాయితీలు ఇస్తున్నారని చెప్పారు.అబ్దుల్ కలాంను అవమానించిన అమెరికా స్థాయి నుండి మోడీని గౌరవించిన తీరును మనం చూస్తున్నాం, ఇది మోదీ విజయం అన్నారు.ఇప్పుడు స్కాములు లేవు,మంత్రులు జైళ్లకు పోవడం లేదు, సుపరిపాలన అందిస్తున్నారన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో మరి కొన్ని సీట్లు ఇస్తే బాగుండు అనే భావన ప్రజల్లో బలంగా పెరిగిందన్నారు. మహారాష్ట్ర,హర్యానా,డిల్లీలో బీజేపీని గెలిపించారన్నారు.ప్రశాంతత, సుస్థిరత,గొప్ప ఆర్థిక వ్యవస్థ కావాలన్న సంస్కృతి సంప్రదాయం కాపాడాలన్నారు. మన గౌరవం పెరగాలన్నా మోడీని మళ్లీ గెలిపించాలని ప్రజలనుకుంటున్నారని తెలిపారు. టీచర్లకు అన్నివేళలా అండగా ఉండేది బీజేపీనని, 317 జీఓకి వ్యతిరేకంగా కొట్లాడింది బీజేపీనే.317 జీఓ వల్ల టీచర్లు ఆత్మహత్యలు చేసుకున్నా కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. అధికారంలోకి రాగానే మారుస్తా అన్న రేవంత్ సప్పుడు చేయడం లేదన్నారు.పదవీవిరమణ డబ్బులు రావాలంటే 10 శాతం లంచం ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని,దాచుకున్న డబ్బులు ఇచ్చే దిక్కులేదన్నారు. ఐదు డి.ఏ లు పెండింగ్,371 బాధలు పోలేదు,రిటైర్మెంట్ బెనిఫిట్స్,విద్య నాశనం అయ్యిందని అన్నారు. ప్రైవేట్ కాలేజీలో ఫీజు రీఎంబర్స్మెంట్‌ను కెసిఆర్ 3ఏండ్లు,రేవంత్ ఇప్పుడు సంవత్సరన్నరగా పెండింగ్ పెట్టారని పేర్కొన్నారు.డబ్బులు విడుదల చేయమంటే రేవంత్ సెటిల్మెంట్‌కి రమ్మంటున్నారట,ఇంతకంటే నీచం ఏమన్నా ఉందా..అని ప్రశ్నించారు. నల్లగొండలో 13 కాలేజీల్లో,10 మూతపడ్డాయని, కాలేజీలు నడపలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. బీజేపీ సర్కార్ కూడా వస్తేనే రాష్ట్రం అప్పులు తీరతాయని, విద్య, వైద్యం బాగుపడుతుందని చెప్పారు. పులి సరోత్తం రెడ్డి మాట్లాడుతూ ఈమధ్య వేల మంది పదవీ విరమణ పొందారని, ఒక్కరికీ బెనిఫిట్స్ అందలేదని తెలిపారు.సీపీఎస్ రద్దు ప్రస్తావన లేదన్నారు. 20 వేల మంది సమగ్ర శిక్ష అభియాన్ వారి సమస్యలు పరిష్కారం చేస్తానని,మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి వారు ధర్నా చేస్తే కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గురుకుల, కస్తూర్బా పాఠశాలలో సమస్యలు తీర్చలేదన్నారు.8 వేల కోట్లు ఫీజు రీ ఎంబర్స్మెంట్ బాకీలు విడుదల చేయడం లేదని పేర్కొన్నారు.నన్ను గెలిపిస్తే సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని హామీ ఇస్తున్నాన్నారు.ఈ సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, సుభాష్ రెడ్డి,సునీత రెడ్డి తదితరులున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 513 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** అక్రమంగా తరలిస్తున్న 513 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు లారీ, ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ డీఎస్పీ వెంకటేశం తెలిపారు.ఆదివారం రాత్రి రేషన్ బియ్యాన్ని అక్రమంగా రాష్ట్రం దాటిస్తున్న ట్లు పక్కా సమాచారంతో హైదరాబాద్ టాస్ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. రాష్ట్రంలోని జిల్లా, మండలాల్లో సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని కర్ణాటక, మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు డిఎస్పీ తెలిపారు. రాష్ట్ర సరిహద్దు 65 జాతీయ రహదారి చిరాక్ పల్లి పోలీస్ స్టేషన్ , మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కంకోల్ టోల్గేట్ ప్రాంతలలో పోలీసులు కాపు కాసి రూ.15 లక్షలు విలువ చేసే 513క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఇద్దరు వ్యక్తులను ఆధీనంలోకి తీసుకున్నట్టు డిఎస్పి తెలిపారు. దాడిలో సిఐ పందరి ఎస్సైలు వెంకటేశ్వర్లు,సాంబశివ, డిటిసిఎస్ ప్రభాకర్ ఉన్నారు.

## ఉప్పల్‌లో గంజాయి కలకలం



**ఉప్పల్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** చిలుకనగర్ శ్రీనివాస హైట్స్ ప్లాట్ నెంబర్ 835 లో ముగ్గురు వ్యక్తులు వెంకట జగదీశ్వర్ రెడ్డి, అక్బర్ హుస్సేన్, అజయ్ కుమార్ ఇంటర్నేషనల్ డ్రగ్స్ మాఫియాతో సంబంధం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో గంజాయి 1.200 గ్రామ్స్, ఓజు కుష్ 53 గ్రామ్స్, ఎండి ఎం ఏ 18 గ్రామ్స్ దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఉప్పల్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

## బాలిక మృతికి కారకులైన వారికి రిమాండ్

**మునిపల్లి, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** మండలంలోని అంతారంలో రాళ్ల దాడికి పాల్పడి అలియాబేగం మృతికి కారకులైన అదే గ్రామానికి చెందిన వీరారెడ్డి,విజయ్ రెడ్డిలను సోమవారం నాడు బుదేరా పోలీస్ స్టేషన్ లో సిఐ వెంకటేష్,ఎస్సై రాజేష్ నాయక్ లు విచారించారు.వారు బాలికపై దాడికి పాల్పడినట్టు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసుకుని రిమాండ్ కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

## డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా డప్పులతో నిరసన



**జిన్నారం, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** గుమ్మడిదల మండల కేంద్రంలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో 13వ రోజు నల్లవల్లి పంచాయితీ ప్యారా నగర్ లో డంపింగ్ యార్డు కు వ్యతిరేకంగా సోమవారం డప్పు కళాకారులతో,డప్పుల దరువులతో నిరసన ర్యాలీని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి భారీగా మహిళలు, పలు సంఘాల నాయకులు తరలివచ్చారు. డంపింగ్ యార్డ్ తరలించేవరకు నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల జేఏసీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు, డప్పు కళాకారుల బృందం, రామ్ రెడ్డి, ముత్యాల్ గౌడ్, ఉదయ్, గోవర్ధన్ రెడ్డి మద్దుల బాల్రెడ్డి వివిధ గ్రామాల నాయకులతో భారీగా పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుక



**లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను సోమవారం లక్ష్మీదేవి పల్లి మండలం ఎదురుగడ్డ గ్రామపంచాయతీ కేంద్రంలో గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బంజారా జాతి ముద్దుబిడ్డ వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం సేవాలాల్ మహారాజ్ కు భోగ్ బండారో సమర్పించారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని ఉద్దేశించి కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడారు. 1739 ఫిబ్రవరి 15న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతంలో సేవాలాల్ మహారాజ్ జన్మించాడని చెప్పారు. జగదాంబ దేవి ఆశీస్సులతో అనేక తండాల్లో పర్యటిస్తూ బంజారా జాతిని జాగృతం చేశారని కొనియాడారు. బాల బ్రహ్మచారిగా, జగదాంబ దేవి భక్తుడిగా బంజర జాతిని సన్మార్గంలో నడిపిన ఆదర్శ ధర్మ గురువు అని గుర్తు చేశారు. వారు చూపిన బాటలో నేటి బంజారా సమాజం నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగ సీతారాములు, కోనేరు చిన్ని, జేబీ శౌరి, మండే హనుమంతరావు,మాజీ సర్పంచ్ బలరాం నాయక్, మాలోత్ విగ్నేష్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంబాబు, దల్సింగ్ నాయక్, మాజీ ఎంపీటీసీ రుక్మిణి, మాజీ ఎంపీటీసీ గోవింద్, రామనాథం, మాజీ కౌన్సిలర్ గొబ్రియా నాయక్, గిరిజన సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రూపురేఖలు మార్చిన ఘనత కేసీఆర్‌దే..

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** తెలంగాణ రూపురేఖలు మార్చిన ఘనంత కేసీఆర్ దే నని కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే భారీ కేక్ కట్ చేసి కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఆవరణలో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ మళ్ళీ కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిసిసిబి ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం మాజీ కార్పొరేషన్ చైర్మన్ బిక్షపతి, మాజీ టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్, సీనియర్ నాయకులు హక్కీమ్, బాలయ్య, శివరాజ్ పాటిల్, చింత గోపాల్, మందుల వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, విఠల్, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, డా.శ్రీహరి, విజేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని మిర్చి రైతులని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలోని కామంచికల్లు, కాచిరాజు గూడెం గ్రామాల్లో కల్లాల దగ్గర ఉన్న మిర్చి పంటను రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు.రైతు ఆరుగాలం కష్టించి పంట పండిస్తే మిర్చి కింటాకు పది నుంచి 13 వేల రూపాయల ధర ఉండటం దారుణమన్నారు.క్వింటాకు 25 వేల రూపాయలు గిట్టుబాటు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈనెల 18న తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రైతు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.ప్రభుత్వం దిగి వచ్చేదాకా తక్కువ ధరలకు మిర్చి పంటను అమ్ముకొని రైతులు నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు.కర్షకుల పక్షాన రైతు సంఘం,సీపీఎం ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి,రైతు సంఘం నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, అనంతిని వీరయ్య, చెరుకూరి రామకృష్ణ, జంగాల ఉపేందర్, రాంబాబు,ఆకుల ప్రదీప్,అద్దంకి వేలాద్రి ,వట్టికోట వెంకన్న, పొన్నం వెంకటరమణ, కారుమంచి గురవయ్య, పొన్నం భాస్కరరావు, పొన్నం మురళి,చాంద్ పాషా,చెరుకూరు లక్ష్మీ నరసయ్య,నువ్వుల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ దుకాణ సముదాయం కూల్చివేత

● మున్సిపల్ కమిషనర్ దశరథ్



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీరెల్లి చౌరస్తా ముందు మున్సిపాలిటీకి సంబంధించిన 10 శాతం స్థలమును కొందరు వ్యక్తులు అక్రమంగా అక్రమించి దుకాణ సముదాయములను నిర్మిస్తున్నారని, ఆ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు గద్వాల మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో గల మున్సిపల్ స్థలాలను అక్రమంగా కట్టడాల నిర్మాణం చేసిన ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కూల్చి వేయడం జరుగుతుందని, గత ఏడాది కింద అదే వ్యక్తి ఇప్పుడు కూల్చివేసిన దగ్గరనే నిర్మాణం చేపడితే గతంలో కూడా కూల్చివేసామని మళ్లీ రాత్రికి రాత్రి నిర్మాణాలు చేశారని తెలుసుకున్న మున్సిపాలిటీ సిబ్బందితో కూల్చివేయించినట్లు కమిషనర్ తెలిపారు. అక్రమ నిర్మాణాలను కూల్చి వెయ్యడం వలన ఆస్తి నష్టం వాటిల్లునని, అక్రమ స్థలాలను ఆక్రమించరాదని స్థలాన్ని ఆక్రమించిన వారిపై తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడునని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. పట్టణంలో ఎవరైనా మున్సిపల్ స్థలాలలో ఇల్లు గాని, దుకాణాలు, సామూహిక దుకాణాలు గాని నిర్మిస్తే వారిపై చట్టపరమైన చర్యతో పాటు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని కమిషనర్ అన్నారు.

## సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** జిల్లాలో ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజ్ వద్ద వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు ప్రారంభించడానికి వస్తున్న సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, అప్పక్ పల్లి గ్రామ శివారులో ఎలిప్యాడ్, పబ్లిక్ మీటింగ్ సంబంధించిన స్థలాలను పరిశీలించి పోలీస్ అధికారులకు ఎలిప్యాడ్ దగ్గర బ్యారికెట్స్ ఏర్పాటు, పబ్లిక్ మీటింగ్ వద్ద భద్రతా ఏర్పాట్లను,పార్కింగ్ స్థలాలను పరిశీలించి పోలీసు అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్, సిఐ శివ శంకర్, ఎస్సిఐ సిఐ రామ్ లాల్, ఎస్ఐ లు రాముడు, వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో నిరంతరం నిఘా ఉంచాలి

● పోలీస్ భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** పెద్దగట్టు జాతర ప్రశాంత వాతావరణంలో సాగెందుకు పోలీసులు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. పెద్దగట్టు జాతర నేపథ్యంలో రెండవ రోజు సోమవారం పోలీస్ కంట్రోల్ రూమ్ నందు సిసి కెమెరా విజువల్స్ ని పరిశీలించి జాతరలో ఎలాంటి సంఘటనలు జరగకుండా నిరంతరం పోలీసులు గస్తీ నిర్వహించాలని సూచించారు.అనంతరం ప్రత్యేక అధికారులతో కలిసి పలు సెక్టార్లను సందర్శించి భక్తులకి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సమస్యలపై సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా చెరువుకట్టపై పోలీసులు పర్యవేక్షించాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్ రావు, డీఎస్పీ రవి, ఈఓ కుశలయ్య, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● మహిళా సాధికారతే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ మహిళా జాబ్ మేళ



**కల్వకుర్తి, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** మహిళ సాధికారత లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా జాబ్ మేళా కల్వకుర్తి ఐక్యత ఫౌండేషన్ ఆఫీస్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ ప్రతినిధులు ఆద్వర్యంలో విజయవంతంగా పెద్దఎత్తున మహిళా జాబ్ మేళా కల్వకుర్తి పట్టణ ప్రాంత మహిళలు పాల్గొన్నారు. త్వరలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని మండలాల్లో మహిళా జాబ్ మేళ ద్వారా రిక్రూట్మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తామని అన్నారు. కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మహిళా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపనీ ప్రతినిధుల బృందం జాబ్ మేళలో పాల్గొన్న కల్వకుర్తి పట్టణ ప్రాంత మహిళల నుండి అప్లికేషన్స్ స్వీకరించడం జరిగింది,త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా ఐక్యత ఫౌండేషన్ సహకారంతో మహిళా జాబ్ మేళలు నిర్వహించి రిక్రూయిట్మెంట్ చేపట్టినట్లు తెలిపారు.ఈ సంధర్భంగా టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యంగా ఇంత మంచి అవవకాశన్ని కల్వకుర్తి నియోజకవర్గ మహిళలకు అందుబాటులోకి తెచ్చిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ వారికి ధన్యవాదాలు తెలుపుతూ...మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి,వారికి అన్ని ఆర్థిక భరోసాను అందించి,వారు అన్ని రంగాలలో ముందుండి మహిళా సాధికారత సాధించడానికి ఎప్పుడు కూడా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ జాబ్ మేళకు విచ్చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళామణులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.జాబ్ మేళాలో పాల్గొన్న మహిళామణులు మాట్లాడుతూ.. మహిళల కోసం ఇంత గొప్ప కార్యక్రమం చేపట్టి మహిళల ఎదుగుదలకు గొప్ప సహకారం అందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళలు,ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులు బృందంలో పాటు టాస్క్ సిబ్బంది, మరియు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సహకారంతో అగ్రగామిగా శేరిలింగంపల్లి

**రాష్ట్ర పిఎసి చైర్మన్ అరికెపూడి**

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :**



రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కోట్లాది రూపాయల నిధులను సేకరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. 5 కోట్ల 60 లక్షల రూపాయల అంచనావ్యయంతో మియాపూర్ డివిజన్ పరిధిలో నూతనంగా చేపట్టబోయే వరద నీటి కాలువ, సిసి రోడ్ల నిర్మాణం పనులకు మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి అరికెపూడి సోమవారం శంకుస్థాపన గావించారు. ఆయన మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ పరిధి శ్రీల గార్డెన్, జయప్రకాష్ నారాయణ నగర్, టిఎన్ నగర్ కాలనీలలో 5 కోట్ల 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు, కాంక్రీట్ సిమెంట్ రోడ్ల నిర్మాణము పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రధానంగా వరదనీటి కాల్వ నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు. తద్వారా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీ వాసులకు వరద నీటి ముంపు, రోడ్లపైకి వరద నీరు చేరడం వల్ల కలిగే ఇబ్బందుల నుండి ఉపశమనం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శ్రీల గార్డెన్ కాలనీలో 18 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, జయప్రకాష్ నారాయణ నగర్ ప్లాటినం స్కూల్ మెయిన్ రోడ్డు సమీపంలో 42 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ గాంధీ శంకుస్థాపన గావించారు. గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు 5 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన వరదనీటి కాలువ(స్ట్రామ్ వాటర్ డ్రైన్) నిర్మాణ పనులకు టిఎన్ కాలనీలోని చర్చి సమీపంలో అరికెపూడి గాంధీ కార్పొరేటర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి

**వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించండి**

**బిహెచ్ఇఎల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ తనిఖీ**

**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17( జనం సాక్షి )**





విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే మెరుగైన ఫలితాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి విద్యార్థులకు సూచించారు. సోమవారం బిహెచ్ఈఎల్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆకస్మిక తనికీ చేశారు. పదవ తరగతి క్లాస్ రూమ్ ని సందర్శించి పిల్లలతో మాట్లాడి పదవ తరగతి పరీక్షలపై అవగాహనా కల్పించారు. మీరు పది సంవత్సరాల తరువాత ఎటువంటి ఉద్యోగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో ఆ ఆలోచనకు ఇప్పుడే అంకురార్పణ చేసేసుకోవాలని అన్నారు . విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. అనంతరం పాఠశాల కిచెన్ రూమ్ ను, మధ్యాన్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. చదువులో వెనుక ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట డిఈఓ వెంకటేశ్వర్లులు, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, ఏంఈఓ, ఓపిపి రాథోడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం చేయాలి

**రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్**

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**



ఇందిరమ్మ ఇళ్లతో పేదల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం గ్రామాలను ఎంపిక చేసిందని, ప్రభుత్వం అందించే సహాయంతో లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ గౌతమ్ అన్నారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని బట్లదిన్నె గ్రామంలో ఇందిరమ్మ ఫేజ్-1 ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తో కలిసి ఆయన గ్రామంలో లబ్ధిదారుల ఇండ్ల స్థలాలను పరిశీలించారు. కొత్త ఇళ్లు నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో మండలంలో ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేసిందని,ఆ క్రమంలో మీ గ్రామం ఎంపికైనందున లబ్ధిదారులు తమ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి లబ్ధిదారుడు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు.పునాది నుండి బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న తరువాత, ప్రభుత్వ నిధులు లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాకు జమ చేయడం జరుగుతుందన్నారు. ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం 5 లక్షల రూపాయలను నేరుగా జమ చేయబడతాయని వివరించారు. మేస్త్రీలు అందుబాటులో ఉంటారని,పంచాయతీ సెక్రటరీ మీ ఇంటి దగ్గరకు వచ్చి ఎప్పటికప్పుడు ఫోటోలు తీసుకుని ప్రభుత్వానికి పంపిస్తారని అన్నారు.ఎవరైనా మధ్యవర్తులు డబ్బు కోరితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. పాత ఇళ్ల మరమ్మతు లేదా విస్తరణకు ప్రభుత్వం నిధులు అందించదని తెలిపారు. లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వం

అందిస్తున్న సహాయాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు, గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ చైతన్య, ఎస్.ఈ. భాస్కర్ రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భాస్కర్, ఎంపీడీఓ అజర్ మోహినుద్దీన్, పంచాయత్ సెక్రటరీ నివేష్,తదితరులు పాల్గొన్నారు

# బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**




జాతీయ బీసీ సంఘం గద్వాల జిల్లా అధ్యక్షులు గోద సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో గద్వాల జిల్లా కలెక్టరేట్ ముట్టడి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి బి. అరవిందస్వామి ,వనపర్తి జిల్లా అధ్యక్షులు జి. కురుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి అరవిందస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్షిప్స్ ఫీజు రియాజ్మెంట్ బకాయిలను దాదాపు 6,000 కోట్లు రూపాయలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని అలాగే బీసీ విద్యార్థులకు సొంత హాస్టల్ భవనాలు నిర్మించాలనీ,రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని,

రానున్న కాలంలో విద్యార్థుల డిమాండ్ల పరిష్కారానికి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల రాము, ధర్మతేజ,వీరేష్ బోయ, ధర్మ తేజ, హరి ప్రసాద్, వీరశేఖర్, సాయి దీప్,గణేష్,రాకేష్, రాజేష్,సుల్తాన్, తిరుమలేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునిపై పోక్సో కేసు

**గాంధారి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**



విద్యనేర్పించే గురువు విద్యార్థిని పక్కదోవ పట్టించి చివరికి పోక్సో కేసు నమోదైన సంఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు, తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ గా పని చేసే రమేష్, అదే పాఠశాలలో చదువుకునే ఒక విద్యార్థినిపై అసభ్యకరం గా మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. సబ్జెక్టుకు సంబంధించిన విషయాలు తెలుపుతానని ఫోన్ నెంబర్ ఇవ్వమని అన్నాడు. విద్యార్థిని భయపడి ఇంటిలో తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ తీసుకొని వాట్సాప్ లో చాటింగ్ చేయడం జరిగింది. దీంతో తల్లిదండ్రులు తరచూ ఫోన్లు రావడం చాటింగ్ చేయడం అనుమానం వచ్చి ట్రూ కాలర్ లో చెక్ చేసి, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఒక్క ఉపాధ్యాయుడు తప్పు చేయడం వల్ల అందరికీ అదే పేరు వస్తుందని ఆవేదన తోటి ఉపాధ్యాయులు ఎవరికి ఏం సమాధానం చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

# 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవబోతోంది

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :**



**మేధావులారా.. కాంగ్రెస్ ను ఓడించండి.. బీజేపిని గెలిపించండి**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి ఒక్క తప్పు చేయాలని అంటే ఐఏఎస్ లు మూడు తప్పులు చేస్తున్నారని వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. సీఎంగా ఉంటూ అవినీతిని, తప్పులను నిరోధించాల్సింది పోయి తప్పులు చేయాలని చెప్పడమేంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే అవినీతి, తప్పులు జరుగుతున్నాయని ఒప్పుకున్నట్లయిందన్నారు. రాష్ట్రంలో మంత్రుల మధ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందన్నారు. కొందరు మంత్రులు సొంత దుకాణాలు ఓపెన్ చేసి ప్రతి పనికి 15 శాతం చొప్పున కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి నిరుద్యోగికి రూ.56 వేల నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు స్కూటీ, తులం బంగారం, ప్రతి ఉద్యోగికి పీఆర్సీ, 4 డీఏలు, రైతులకు రైతు భరోసా, బోనస్, రుణమాఫీ బాకీ పడిందని అన్నారు. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్ అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బాకీల కాంగ్రెస్ సర్కార్ ను బండకేసి బాదాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం రోజు మధ్యాహ్నం కరీంనగర్ లోని కొండా సత్య లక్ష్మీ గార్డెన్ లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని బీజేపీ మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు ఎంపీలు రఘునందన్ రావు, జి.నగేశ్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మాజీ మేయర్లు హాజరయ్యారు. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ కు అభ్యర్థులు దొరకక బయట నుండి అద్దెకు అభ్యర్థులను తెచ్చుకున్నాయని బీఆర్ఎస్ అసలు పోటీలోనే లేదని, ఈసారి 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవడం తథ్యం అని, ఎన్నికల ఫలితాల తరువాత నుండి మళ్లీ అధికారంలోకి వచ్చేదాకా రాష్ట్రంలో బీజేపీయే ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించబోతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీజేపీకే ఉందని నిరుద్యోగులు, టీచర్లు, ఉద్యోగుల పక్షాన నిరంతరం కొట్లాడి జైలుకు పోయింది బిజెపి అని 317 జీవోపై దీక్ష చేస్తే నా ఆఫీస్ గేటును గ్యాస్ కట్టర్లతో కట్ చేయించి టియర్ గ్యాస్ వదిలి అద్దాలు పగలకొట్టి లాఠీఛార్జ్ చేయించారన్నారు.

**కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్**

కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్ ప్రతి నిరుద్యోగికి రూ.56 వేల భృతి బాకీ పడ్డరు, ప్రతి టీచర్, ఉద్యోగికి 4 డీఏలు, పీఆర్సీ బాకీ పడ్డరు, ప్రతి మహిళకు తులం బంగారం, స్కూటీ బాకీ పడ్డరు, రైతులకు రుణమాఫీ, బోనస్, రైతు భరోసా పైసలు బాకీ పడ్డరు, ప్రతి ఉద్యోగికి సరెండర్ లీవ్ ఎన్ క్యాష్ మెంట్ పైసలు బాకీ ఎటు చూసినా బాకీ.. బాకీ.. బాకీ.. ఇది బాకీల ప్రభుత్వం అని ఈ బాకీల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండకేసి బాదండి అని అన్నారు. కులగణన పేరుతో కాంగ్రెస్ పార్టీ కొరివితో తలగొక్కోంటోందని బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపితే కేంద్రం ఎట్లా ఆమోదిస్తుంది? ముస్లింలను బీసీ జాబితా నుండి తీసివేస్తే ఆ బిల్లును ఆమోదింపజేసే బాధ్యత మేం తీసుకుంటామని లేకుంటే ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో మేధావులంతా గుణపాఠం చెప్పాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# ఖురాన్‌ను ప్రేమించండి..!





**ఇస్లాం ధార్మిక పండితులు మహ్మద్ అబ్దుల్ ఖవీ**

**ఖమ్మం (జనంసాక్షి)**

పవిత్ర గ్రంథం ఖురాన్ ను ప్రతి ముస్లిం కుటుంబం ప్రేమించాలని ప్రముఖ ఇస్లాం ధార్మిక పండితులు మహ్మద్ అబ్దుల్ ఖవీ అన్నారు. ఖురాన్ ను చదవడం, నేర్చుకోవడం ద్వారా ప్రతి వ్యక్తి ఇహ పరలోక సాఫల్యం పొందుతాడని, ఎదుటి వారికి ఆదర్శంగా నిలబడతాడని ఆయన పేర్కొన్నారు. నగరంలోని గొల్లగూడెంలో గల తాలీముల్ ఇస్లాం మదర్సా వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఆధ్యాత్మిక సభలో అబ్దుల్ ఖవీ ప్రధానోపన్యాసం చేశారు. ఇంత కాలం చెడు వ్యసనాలకు అలవాటు పడి సంప్రదాయాలను నిర్లక్ష్యం చేసిన, ప్రతి వ్యక్తి తన జీవిత చరమాంకాన్ని గుర్తెరిగి ఇకపై ఇస్లాం సూచించిన పద్ధతుల ప్రకారం జీవించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రేపటి తరం పిల్లలకు ఇస్లాం విద్యతో పాటు ఇంగ్లీష మీడియం పాంత్యాంశాలను బోధించే.. ఇటువంటి మదర్సాలను ప్రోత్సాహించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. దురదృష్టవశాత్తు పాలకుల కన్ను వక్ఫ్ ఆస్తులపై పడిందని, వాటిని కాజేయడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. అందుకే మొన్నటికి మొన్న పార్లమెంట్లో వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు ఏ ఉద్దేశంతో తమ ఆస్తులను వక్ఫ్ చేశారో.. ఇకపై ఆ లక్ష్యం నెరవేరే స్థితి కనిపించడం లేదని వాపోయారు. తాలీముల్ ఇస్లాం మదర్సాను నిలబెట్టేందుకు కృషి సల్పుతున్న ప్రతి ఒక్కరి త్యాగం వృథా కాదని, కచ్చితంగా తగిన ప్రతిఫలం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మదర్సా విద్యార్థులు.. వరకట్న దురాచారంపైన, ఇస్లామిక్ విద్యాసంస్థల ప్రాముఖ్యత పై రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మదర్సాలో ఖురాన్ కంఠస్థం చేసిన 12 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సభలో

తెలుగు ఆధ్యాత్మిక ప్రసంగ కర్త ముఫ్తీ సులేమాన్ అజ్మల్, మౌలానా సయిద్ అహ్మద్ ఖాస్మీ, మౌలానా ముఫ్తీ మహ్మద్ జలాలుద్దీన్, నగరానికి చెందిన పలువురు ఉలేమాలు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# రామోజీ ఫిలిం సిటీలో ఇంటి స్థలాలను వెంటనే ఇవ్వాలి

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 ( జనం సాక్షి)**



**ఇంటి స్థలాలను కబ్జాచేసిన రామోజీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి**

**ఇంటి స్థలాలకు వెళ్ళకుండా అడ్డుకుంటున్న రామోజీ యాజమాన్యం**

**సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా**

ఇంటి స్థలాలను కబ్జా చేసిన రామోజీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఇంటి స్థలాల పట్టాలు ఉన్న లబ్ధిదారులతో కలిసి ధర్నా చేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను కబ్జా చేసిన రామోజీ యాజమాన్యంపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 2007 సంవత్సరంలో ఇంటి స్థలం లేని పేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వాలని పోరాటం చేసిన ఫలితంగా 2007 సంవత్సరంలో అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలం నాగన్ పల్లి గ్రామంలో సర్వేనెంబర్ 189లో 12ఎకరాలు, 203లో 8ఎకరాల 4గుంటల భూమిని నాగన్ పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూర్ గ్రామాలకు చెందిన 675 మంది పేదలకు 60 గజాల చొప్పున ఇంటి స్థలం పట్టాలు ఇచ్చారు. దీనికి లేఅవుట్ నక్ష ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి లబ్ధిదారులను నమ్మించి కొంతమంది లబ్ధిదారుల నుంచి అప్పుడున్న అధికారులు ఇంటి పట్టాలను కూడా తీసుకున్నారు. గత 17 సంవత్సరాలుగా సిపిఎం ఆధ్వర్యంలో ఈ ఇంటి స్థలాలు ఇవ్వాలని నిరంతరం పోరాటం చేస్తున్నామని, అందులో భాగంగానే 2022 నవంబర్ లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున లబ్ధిదారులతో కలిసి ధర్నా చేసిన సందర్భంగా రామోజీ యాజమాన్యం సర్వే నెంబర్ 189, 203లో ఇంటి స్థలాల కోసం కేటాయించిన భూమిని తమకు కేటాయిస్తే వేరే సర్వే నెంబర్లలో ఇంటి స్థలాల కోసం 25 ఎకరాల అసైన్డ్ భూమిని రైతుల నుంచి కొనుగోలు చేయడానికి అవసరమైన నష్టపరిహారాన్ని చెల్లిస్తామని రామోజీ వారు అప్పుడున్న కలెక్టర్ కి దరఖాస్తు చేసుకున్నారు. రామోజీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు వెంటనే లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కానీ నేటి వరకు అటువంటి ప్రయత్నాలు ఏవి జరగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే లబ్ధిదారులకు కేటాయించిన సర్వే నెంబర్లలోనే ఇంటి స్థలాలు ఇవ్వాలని అన్నారు. నిరుపేదలైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వమే ఐదు లక్షల రూపాయల నిధులను ఇవ్వాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తక్షణమే మంగళవారం రామోజీ యాజమాన్యాన్ని పిలిపించి ఆర్డీవో సమక్షంలో లబ్ధిదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్, మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ జంగయ్య, పంది జగన్, మండల కమిటీ సభ్యులు సిహెచ్ నర్సింహా, రాయపోల్ మాజీ ఎంపిటిసి నీరుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలకు బస్ సౌకర్యం కల్పించాలి

**నాగర్‌కర్నూల్ ఆర్సీ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని నెల్లి కొండ గేట్ దగ్గర ఉన్న ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, శ్రీపురం రోడ్ లో రూబీ గార్డెన్ కు దగ్గర ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంఘనమోని బంగారు బాబు డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉన్న భుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలలకు బస్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్య కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులకు మరియు సైన్స్ కాలేజీ విద్యార్థులకు ఉదయం సాయంత్రం బస్సు లు లేక విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారని, కళాశాలకు రావడానికి నాన్న తంతాలు పడి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9:45 కు మరియు సాయంకాలం 4:15 కు కళాశాలలకు బస్సు సౌకర్యం కల్పించాలని మరియు అన్ని కళాశాలల గేట్ల దగ్గర బస్సులు ఆపాలని డిఎం కు వివరించడం జరిగిందన్నారు. త్వరలో మా విద్యార్థుల బస్సు సౌకర్యం సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగనమోని బంగారు బాబు, నాగర్ కర్నూల్ సోషల్ మీడియా ఇంచార్జి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మల్లేష్ యాదవ్, శారద, శివ, కేల్ కన్వీనర్



రమేష్, శివ, భరత్, చాపల నరేష్, మహేష్, రమేష్ ఏబీవీపీ నాయకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్ని సదుపాయలు కల్పించాలి

- పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగాలి
- స్వామి వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ దంపతులు

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి వారి జాతరలో రెండవ రోజు సోమవారం చౌడమ్మకి భోనాలు సమర్పణలో భాగంగా పెద్దగట్టు దేవాలయంను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్, యాదవ పూజర్లు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు నిబద్ధతతో మొక్కులు చెల్లించే భక్తులకి, వచ్చే ప్రజలకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీ పెరుగుతున్నందున దేవాలయం వద్ద క్యూ లైన్, మెట్ల ద్వారా వచ్చే భక్తులకి ఎలాంటి ఇబ్బందులు పడకుండా పోలీస్ యంత్రాంగం నిరంతరం



పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గుట్ట పైన, క్రింద పరిసర ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. భక్తులకు తాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. జాతరలో అధికారులు అందరు సమన్వయంతో తమకి కేటాయించిన సెక్టారులలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వేణు మాధవరావు, తహసీల్దార్లు శ్యామ్ సుందర్ రెడ్డి, కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ప్రత్యేక అధికారులు, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొని ఇద్దరు దుర్మరణం

- కోహీర్ మండలం గొడిగారిపల్లి వద్ద ఘటన
- మృతులు జహీరాబాద్ అర్జున్ నాయక్ తాండవాసులు

**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొన్న సంఘటన కోహిర్ మండలంలోని గొటిగారిపల్లి శివారు వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సంఘటనలో అర్జున్ నాయక్ తండాకు చెందిన ఇద్దరు పవన్, శంకర్ మృతి చెందారు. మృతులు ఇద్దరు కోహిర్ మండలంలోన షేడేగుట్ట తండాలో జాతరలో పాల్గొనడానికి వెళ్లారు. జాతర అనంతరం సమీపంలో గల సిద్దాపూర్ తాండ లోని బంధువుల ఇంటికి బయలుదేరారు. కోహీర్ మండలం గొడిగారిపల్లి ఫారెస్ట్ మూలమలుపులో ఎదురుగా వస్తున్న బస్సును బలంగా ఢీకొనడంతో సంఘటనా స్థలంలో పవన్ మృతిచెందగా ఆసుపత్రికి తరలిస్తుండగా శంకర్ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ. 20 లక్షల ఆస్తి నష్టం
- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్న ఎమ్మెల్యే



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** కరెంట్ షార్ట్ సర్క్యూట్తో ఇళ్లు దగ్ధమై రూ.20 లక్షల ఆస్థి నష్టం జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం... మెదక్ పట్టణం కుమ్మరి గడ్డలో ల్యాబ్ టెక్నిషియన్ కుమ్మరి సంతోష్‌కు చెందిన ఇళ్లు సోమవారం కరెంట్ షార్ట్ సర్క్యూట్తో దగ్ధమైంది. కోతులు కరెంట్ వైర్లను పట్టుకుని ఊపడంతో మంటలు చెలరేగి ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. సంతోష్ మెడికల్ ల్యాబ్ ఏర్పాటు కోసం సమకూర్చుకున్న రూ.4 లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలు, ఫ్యాషన్ ప్రో బైక్, ఫ్రిడ్జ్, టీవీ, తదితర సామాగ్రి అంతా కాలి బూడిదైంది. సంతోష్, ఆయన భార్యకు సంబంధించి విద్యార్హత సర్టిఫికేట్లు అన్నీ కాలిపోయాయి. ఇంటికి మంటలు అంటుకున్న సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఫైరింజన్ తో వచ్చి మంటలు ఆర్పారు. అయితే అప్పటికే ఇంట్లోని సామగ్రి అంతా కాలిపోయింది. రెవెన్యూ ఇన్స్ పెక్టర్ సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. అగ్ని ప్రమాదంలో ఉన్నదంతా కాలి పోయి తీవ్రంగా నష్టపోయినందున ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సంతోష్ విజ్ఞప్తి చేశాడు. సోమవారం మెదక్ పట్టణంలోని న్యూమార్కెట్ దగ్గరలోని కుమ్మరి సంతోష్ ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన పై మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు పూర్తిగా ఇల్లు దగ్ధం కావడం దురదృష్టకరం అని ఆయన పేర్కొన్నారు. సంతోష్ కుటుంబాన్నికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని స్పష్టం చేశారు.

## రైతు భరోసా పడలేదని వినతి

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** జిల్లాలోని కొల్చారం మండలం వరిగుంతం, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన రెండు వందల మంది రైతులకు పెట్టుబడి సహాయం అందలేదని సోమవారం నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. జడ్పిటిసి ముత్యం గారి మేఘమాల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్న రానీ ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. 2023 వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ పెట్టుబడి సహాయం అందించిందని, ప్రస్తుతమున్న ప్రభుత్వం లేనిపోని ఆరోపణలు చేస్తూ సీసీఎల్ఏ లోపం వల్ల సమస్యలు ఉన్నాయని అధికారులు అన్నట్టు తెలిపారు. త్వరితగతిన రైతు భరోసా పెట్టుబడి సాయం వెంటనే అందజేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు



# డంపు యార్డ్‌కు వ్యతిరేకం కలిసికట్టుగా పోరాడుదాం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి



**నర్సాపూర్/ని, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** డంపు యార్డ్ ఎత్తేసే వరకు పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పోరాడుదాం మని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నర్సాపూర్ జేఏసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్యారా నగర్ లోని పచ్చని అడవిలో ఏర్పాటు చేస్తున్న డంపు యార్డ్ ను ఎత్తేసే వరకు పార్టీలను పక్కనపెట్టి పోరాడవలసిన అవసరం ఉందన్నారు. డంపు యార్డ్ ఏర్పాటుతో ఐదు మండలాల ప్రజలకు ముప్పు ఉందన్నారు. అడవి తో పాటు నర్సాపూర్ రాయరావు చెరువు , ఆయకట్టు, అ హత్నూర, కోల్చారం మండలాల్లోని మంజీరా నది కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. డంపు యార్డ్ ఎత్తేసే వరకు యాక్షన్ ప్లాన్ ప్రకారం మత్స్యకారులు, దోబీలు, ఇతర వృత్తుల వారు. రాజకీయ నాయకులు, కార్యక్రమాలను తీసుకొని పోరాటం చేయాలన్నారు. డంపు యార్డుకు వ్యతిరేకంగా తన వంతు పోరాటం తో పాటు పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని అన్నారు. రిలే నిరాహార దీక్షలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళి యాదవ్ సైతం మద్దతు పలికాడు. ఈ కార్యక్రమంలో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

# ఏసీబీ దాడులతో ఆ అధికారులకు గుండె దడ..

- గత చరిత్రను తలుచుకొని భయం భయంగా అధికారులు

**మర్రిగూడ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** మర్రిగూడ మండలంలోని కొంతమంది అవినీతి అధికారులకు గుండె దడ పట్టుకుంది, ఏసీబీ వరుస దాడులతో గత చరిత్రను తలుచుకొని అధికారులకు భయం పట్టుకుంది, ప్రజల రక్త మాంసాలను తిని కోట్లు కూడా పెట్టిన ఆ అవినీతి అధికారులు, కొన్ని శాఖలలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని మండల వాసులు చర్చించుకుంటున్నారు, గత 5 ఏళ్లలో మర్రిగూడ మండలం పనిచేసిన అధికారులు భారీ మొత్తంలో లంచాలు తీసుకుని ఆస్తులు కూడా పెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి, గతంలో జరిగిన అవినీతిపై కూడా ఏసిబి అధికారులు దృష్టిసాదించినట్లు తెలుస్తుంది, దీంతో అధికారులకు నిద్రాహారాలు కరువయ్యాయి, గతంలో మర్రిగూడ మండలంలో పనిచేసిన కొంతమంది అవినీతి అధికారులపై కూడా ఫిర్యాదులు అందినట్లు తెలుస్తుంది, తిమింగలాలను వదిలి పరకాలపై దాడులు జరుగుతున్నాయని మండల వాసులు చర్చించుకుంటున్నారు, ఏది ఏమైనా అవినీతి సొమ్ముతో




కోట్లు కూడా పెట్టిన ఏదో ఒక రోజు వారి బండారం బయటపడుతుందని మండల వాసులు చర్చించుకుంటున్నారు, పూర్తి ఆధారాలతో మరో కథనంతో మీ ముందుకు జనం సాక్షి..

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన 2025-26 అడ్మిషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య, అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, భవిష్యత్తులో మరిన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటర్ పూర్తైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి అందుబాటులో ఉన్న ఉచిత సేవలను ఉపయోగించుకుని మంచి స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులపై పరిశీలించి, ఏ అవసరం వచ్చినా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అంజయ్య, ఏవో మహమ్మద్ ఇర్ఫాన్, సీనియర్ అధ్యాపకుడు కోదండరాములు, ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వార్షిక పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** పదవ తరగతి వార్షిక పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ సింగారంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతుల నిర్వహణలో భాగంగా నిర్వహించిన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలలో 100% ఉత్తీర్ణత సాధించి జిల్లాకు వసతి గృహాలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. సబ్జెక్టులపై పట్టు సాధించడానికి కష్టపడి చదవాలన్నారు. ప్రతిరోజు సబ్జెక్టులపై ఉపాధ్యాయులతో అవగాహన పెంచుకొని చదవాలన్నారు. హార్డ్ వర్క్ చేస్తేనే ఏదైనా సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. పరీక్షలకు 15 రోజుల ముందు అన్ని సబ్జెక్టులు ప్రిపేర్ కావాలన్నారు. అనంతరం ఆల్ ఇన్ వన్ క్వశ్చన్ బ్యాంక్ లను మరియు బి.సి.వెల్ఫేర్ మంత్రి ఇన్స్పిరేషన్ లెటర్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ కలీం, డిఆర్‌డిఓ మొగులప్ప, డి.పి.ఆర్. ఓ.రషీద్, ఉపాధ్యాయ లు, స్వామి, సంగీత, నారాయణరెడ్డి, మధు, మహేష్, మధుసూదన్ రావు, వాసంత్రావు, కనకప్ప, శ్రీలక్ష్మి, రోజమని, శివప్రసాద్, వార్డెన్లు, మాసూద్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**చిన్నంబావి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** చిన్నంబావి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయంలో పదవ తరగతి విద్యార్థిని రాలేదని ఉపాధ్యాయినీరాలు తోటి విద్యార్థినికి వెళ్లి చూడు అని చెప్పింది. దాంతో విద్యార్థిని వెళ్లి చూడగా ఆ విద్యార్థి దాదాపు ఐదు డోలో 650 టాబ్లెట్స్ వేసుకొని ఏడుస్తూ కూర్చుంది అని విద్యార్థిని టీచర్ కు తెలియజేసింది. టీచర్ వెంబడే మండల కేంద్రంలో ఉన్న 108 ను పిలిపించి వీపనగండ్ల హాస్పిటల్ కు తరలించడం జరిగింది. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం వనపర్తి ఏరియా హాస్పిటల్‌కు తీసుకెళ్లడం జరిగిందని విద్యార్థికి ఎలాంటి హానీ జరగలేదని తెలిపారు. విషయంలోకి వెళితే కుటుంబ సమస్యల వల్ల విద్యార్థిని ఇలా చేసిందని కేజీవీబీ ఎస్ఓ ప్రశాంతి తెలిపారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థికి డోలో 650 టాబ్లెట్స్ ఒక స్లిప్పు తన దగ్గరికి ఎలా వచ్చిందని కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయులు విద్యార్థులపై నిర్లక్ష్యంగా ఉండరాదని తల్లిదండ్రులు అన్నారు.

## దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా ఆత్మకథ పుస్తకావిష్కరణ

- చిట్యాల వాసి నెల్సన్ మండేలా ఆత్మకథ రచన
- దక్షిణాఫ్రికాలో తెలుగువారి సమక్షంలో ఆవిష్కరణ



**చిట్యాల, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన రాపోలు సీతారామరాజు అనువదించిన నెల్సన్ మండేలా ఆత్మకథ స్వేచ్ఛ కోసం సుదీర్ఘ ప్రయాణం పుస్తకమును దక్షిణాఫ్రికాలో గౌతమ్ లింగ ఆధ్వర్యంలో అక్కడ తెలుగు ప్రజల సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినా ఎలిగేటి వేణు, తాళ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మండేలా పోరాటాన్ని సీతారామరాజు చక్కగా అనువదించారని కొనియాడారు పుస్తకంలో అనేక విషయాలను విశ్వసించారు తెలుగు సాహిత్య వేదిక ఇలాంటి మంచి రచనలు మరిన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ నున్నా, గుర్రాల నాగరాజు, కల్లూరి శ్రీకాంత్ బద్రి, కుప్పరాజు జయప్రకాష్, పెట్లూరి విక్రమ్, సంకు అరుణ్ తదితరులు పాల్గొన్నారు. చిట్యాల మండలానికి చెందిన రచయిత అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుండడం మండలానికి చెందిన కవులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, కందిమల్ల రాంరెడ్డి, బ్రహ్మాచారి, తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్, డాక్టర్ సాగర్ సత్తయ్య తదితరులు అభినందనలు తెలియజేశారు.

# తపాస్‌పల్లి నీటిని వేరే ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోం

- శ్రీకిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశం

**చేర్యాల, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) :** తపాస్ పల్లి నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోమని బిజెపి కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి వడ్లకొండ వెంకటేశం అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చేర్యాల ప్రాంత రైతుల అభివృద్ధి కోసం నిర్మించిన తపాస్ పల్లి రిజర్వాయర్ నీటితో ఈప్రాంత చెరువులు కుంటలు నింపాల్సింది పోయి ఇతర ప్రాంతాలకు తరలించడం సబాబు కాదన్నారు. ఓ నాయకుడు సిద్దిపేట ప్రాంతానికి తరలించాడు.. మరో నాయకుడు ఉమ్మడి నల్గొండ జిల్లా కొలనుపాక తరలించాడు చేర్యాల ప్రాంతానికి ఇంత అన్యాయం జరుగుతున్నా అధికార పార్టీ నాయకులు స్పందిచక పోవడం దారుణమన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోయి పంట పొలాలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంత చెరువులు కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి ఉద్యమిస్తామని డిమాండ్ చేశారు.



## విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 17 (జనం సాక్షి) :** బీసీలకు విద్యా ఉద్యోగ రంగాల్లో కూడా 42% రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడంతో పాటు విద్యా,ఉద్యోగ రంగాల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించే విధంగా చట్టబద్ధత చేయాలని ఆయన కోరారు. అన్ని రాజకీయ పార్టీలు కూడా బీసీలకు జనాభా దామాషా ప్రకారం పదవులు ఇవ్వాల్సిందేనని అన్నారు. బీసీలందరు కులాలకు అతీతంగా ఐక్యంగా ఉండి మన హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేసినప్పుడే ప్రభుత్వాలు భయపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్, తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎఫ్ ఖాతా బోగస్ కంపెనీకి లింకైందా?




ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ కలిగిన ఉద్యోగులకు బిగ్ అలర్ట్. మీ పీఎఫ్ ఖాతా ఏదైనా బోగస్ కంపెనీకి లింకైందా? ఓసారి చెక్ చేసుకోండి. అలా అయితే మీ డబ్బులు మొత్తం ఖాళీ అవడమే కాకుండా మూన్ లైటింగ్ సమస్య ఎదుర్కోవలసి వస్తుంది. మరి ఎలా డీలింక్ చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్ఓలో అకౌంట్ ఉన్న ఉద్యోగులందరికీ బిగ్ అలర్ట్. ఇటీవల హైదరాబాద్‌కి చెందిన ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్లకు లొంగకపోవడంతో అతడి ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ను బోగస్ కంపెనీకి అనుసంధానం చేశారు. అది తెలియకుండా మరో కంపెనీకి ఇంటర్వ్యూకు వెల్లడంతో ఒకేసారి రెండు కంపెనీల్లో పని చేస్తున్నట్లు రికార్డుల్లో కనిపించింది. దీంతో మూన్ లైటింగ్ చేశారని ఉద్యోగం అవకాశం కోల్పోవాల్సి వచ్చింది. డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వలేదనే కారణంగా బోగస్ కంపెనీలకు పీఎఫ్ ఖాతాలను లింక్ చేస్తున్నారు నేరగాళ్లు. మీ ఖాతాను ఓసారి చెక్ చేసుకోండి. మీ పీఎఫ్ ఖాతా సైతం తెలియని కంపెనీకి లింక్ అయితే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

బోగస్ కంపెనీలకు లింకైన పీఎఫ్ ఖాతాలను తొలగించాలంటో గతంలో ఈపీఎఫ్ఓకు పరిపాలన, సాంకేతిక పరిమైన అడ్డంకులు ఎదురయ్యేవి. కానీ, ఇప్పుడు ఉద్యోగులే సొంతంగా బోగస్ కంపెనీ వివరాలను తొగించుకునేందుకు డీలింక్ ఆప్షన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈపీఎప్ఓ రూల్స్ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు కంపెనీల్లో పని చేయకూడదు. ఈ నిబంధనను ఆసరగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు ఉద్యోగులను డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వని వారి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను యూపీ, రాజస్థాన్, ఒడిశా, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో నమోదు చేసిన బోగస్ కంపెనీలకు జత చేస్తున్నారు. ఇలాంటి మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఇటీవల పెరగడంతో ఈపీఎఫ్ఓ డీలింక్ ఆప్షన్ తీసుకొచ్చింది.

### డీలింక్ ఎలా చేయాలి?

1పీఎఫ్ ఖాతాదారులు ముందుగా ఈపీఎఫ్ మెంబర్ పోర్టల్‌లోకి యూఏఎన్ నంబర్, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావాలి. 1హెూం పేజీలో వ్యూ ఆప్షన్లలో ఉండే సర్వీస్ హిస్టరీపై క్లిక్ చేయాలి. 1ఈ సర్వీసు హిస్టరీలో మీ పీఎఫ్ అకౌంట్, కంపెనీల పేర్లు కనిపిస్తాయి. మీ పీఎఫ్ ఖాతా తెలియకుండా ఏదైనా కంపెనీతో లింకై ఉంటే దాని పక్కనే డీలింక్ ఆప్షన్ కనిపిస్తుంది. 1బోగస్ కంపెనీకి చెందిన డీలింక్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. 1ఈ ఓటీపీని ఎంటర్ చేసి సబ్మిట్ చేస్తే డీలింక్ ప్రక్రియ పూర్తవుతుంది. 1 ఆ తర్వాత సర్వీసు హిస్టరీ చెక్ చేస్తే డీలింక్ అయిన కంపెనీల వివరాలు కనిపించవు. 1ఒక వేళ ఉద్యోగి నిజంగానే ఒకేసారి రెండు కంపెనీల్లో పని చేస్తే, రెండు కంపెనీలు చందా చెల్లించినట్లయితే డీలింక్ చేసేందుకు కుదరదు. ఎర్రర్ వస్తుంది. 1డీలింక్ చేసే సంస్థ విషయంలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఈపీఎఫ్ఓ సూచిస్తోంది.

# లోన్ వడ్డీ రేట్లు పెంచిన రెండు దిగ్గజ బ్యాంకులు..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొద్ది రోజుల కిందట కీలక రెపో రేట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో బ్యాంకులు రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించే పనిలో పడ్డాయి. ఇప్పటికే చాలా బ్యాంకులు తగ్గించేశాయి. ఇదే సమయంలో కొన్ని బ్యాంకులు ఎంసీఎల్ఆర్‌లో కూడా కీలక మార్పులు చేశాయి. కొన్ని ఎంసీఎల్ ఆర్ పెంచగా.. ఇంకొన్ని తగ్గించాయి.

బ్యాంకుల్లో లోన్లు తీసుకునే వారికి ఇటీవల ఆర్బీఐ నిర్ణయంతో ఊరట కలిగిందన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఐదేళ్ల తర్వాత రెపో రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగొచ్చింది. దీంతో ఇదే సమయంలో రెపో ఆధారిత వడ్డీ రేట్లు ఇప్పటికే చాలా బ్యాంకుల్లో తగ్గాయి. దీంతో ఆయా లోన్లపై ఈఎంఐ లేదా టెన్యూర్ తగ్గుతుందని చెప్పొచ్చు. ఇంకా.. చాలా బ్యాంకులు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను కూడా ఫిబ్రవరి నెలలో సవరించాయి. రెండు బ్యాంకులు పెంచగా.. ఒక బ్యాంకు మాత్రం తగ్గించింది. కొన్నేమో యథాతథంగానే ఉంచాయి.

ఎంసీఎల్ఆర్ అంటే రుణ ఆధారిత వడ్డీ రేట్లు. దీనినే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు అంటారు. అం టే.. ఇక్కడ ఈ ఎంసీఎల్ఆర్ కంటే తక్కువ వడ్డీకి బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు వీల్లేదు. అన్ని బ్యాంకులకు ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో ఆర్బీఐ ఈ విధానం తీసుకొచ్చిం ది. ఎంసీఎల్ఆర్ పెంచితే.. లోన్ ఈఎంఐ




పెరుగుతుంది. ఎంసీఎల్ఆర్ తగ్గిస్తే.. లోన్ ఈఎంఐ తగ్గుతుందని చెప్పొచ్చు.

ప్రభుత్వ రంగానికి చెందిన ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంకు.. ఎంసీఎల్ఆర్ తగ్గించింది. ఇక్కడ గరిష్టంగా 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఒక నెల టెన్యూర్‌పై ఎంసీఎల్ఆర్ 10 బేసిస్ పాయింట్లు తగ్గి 8.45 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గింది. ఇక ఇతర టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ ఏం మారలేదు. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.35 శాతంగా ఉంది. 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.55 శాతంగా ఉంది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉంది. ఏడాది ఎంసీఎల్ఆర్ చూస్తే 9.10 శాతంగా ఉంది. రెండేళ్ల ఎంసీఎల్ఆర్ ఇక్కడ 9.35 శాతం ఉండగా.. ఇవి ఫిబ్రవరి 12 నుంచి అమల్లోకి వచ్చాయి.

### అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎంసీఎల్ఆర్ స్వల్పంగా పెంచింది. ఇక్కడ ఓవర్‌నైట్ టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా 9.20 శాతానికి చేరింది. ఇందులో అన్ని టెన్యూర్లపై 9.20 శాతం నుంచి 9.45 శాతంగా ఉన్నాయి. ఫిబ్రవరి 7 నుంచి ఇవి వర్తిస్తున్నాయి. ఇక ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. పంజాబ్ నేషనల్ బ్యాంకులో లెండింగ్ రేట్లు 5 బేసిస్ పాయింట్ల మేర పెరిగాయి. ఇది అన్ని టెన్యూర్లపై వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఇక్కడ కనీసం 8.40 శాతం నుంచి గరిష్టంగా 9.35 శాతంగా ఎంసీఎల్ఆర్ ఉంది. ఇక ఐడీబీఐ బ్యాంకులో రుణ రేట్లు మారలేదు. ఇవి 8.45 శాతం నుంచి 10.15 శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాలోనూ స్థిరంగానే ఉన్నాయి. దీంట్లో 8.15 శాతం నుంచి గరిష్టంగా 9 శాతంగా ఉంది. ఇది ఫిబ్రవరి 12 నుంచే అమలవుతోంది.

# అంబానీకి చుక్కెదురు..

2000 సంవత్సరంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం న్యూ ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్సింగ్ పాలసీ తొలి విడతలో రిలయన్స్ కన్సార్షియానికి కేజీ డీబ్ల్యూఎస్ 98/3 కేజీ- డీ6 బ్లాక్ గ్యాస్ వెలికితీత కోసం కేటాయించింది. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 90 శాతం, కెనడాకు చెందిన నికో రిసోర్సెస్‌కు 10 శాతం వాటా ఉంది. అయితే దాదాపు 10 ఏళ్ల తర్వాత బీపీ సంస్థకు రిలయన్స్ 30 శాతం వాటాను విక్రయించింది. తర్వాత కాలంలో దీనిని ప్రభుత్వం రంగ కంపెనీ అయిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. దీని పక్కనే ఉన్న గోదావరి బ్లాక్‌ను ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో 1997లో ఓఎన్జీసీకి కేటాయించింది.

రిలయన్స్, ఓఎన్‌జీసీ మధ్య 2013లో వివాదం మొదలైంది. ఓఎన్‌జీసీ కేజీ-డీ5 బ్లాక్, జీ-4 బ్లాక్ రిజర్వాయర్ల నుంచి రిలయన్స్ కేజీ-డీ6 బ్లాక్ కనెక్టివిటీ ఉందని అనుమానిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ కి లేఖ రాసింది. గోదావరి, కేజీ-డీడబ్ల్యూఎన్ 98/2 బ్లాకుల్లో ఉన్న జియోలాజికల్ అండ్ జియోఫిజికల్ వివరణాత్మక డేటా ద్వారా రిలయన్స్ బ్లాక్, ఓఎన్‌జీసీ బ్లాక్‌ల మధ్య గ్యాస్ కనెక్టివిటీ ఉందని తెలిపింది. మొదట గ్యాస్ ఉత్పత్తిని ప్రారంభించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ పూర్తి స్థాయిలో ఓఎన్ జీసీ వనరులను సైతం వాడుకుందని తెలిపింది. ఆ తర్వాత 2014 మే 15వ తేదీన ఢిల్లీ హైకోర్టులో రిలయన్స్ గ్యాస్ చోరీపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. 2014 సెప్టెంబర్ 10వ తేదీన ప్రభుత్వం ఈ విషయంపై ఓ నిర్ణయం తీసుకోవాలని ఓఎన్‌జీసీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీనిపై థర్డ్ పార్టీ అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిగోలెయర్, మ్యాక్ నాటన్ కన్సల్టెంట్‌ను నియమించింది. ఈ కంపెనీ 2015 నవంబర్ 19వ తేదీన నివేదిక ఇచ్చింది. 2009 ఏప్రిల్ 1 నుంచి 2015 మార్చి 31 వరకు ఓఎన్‌జీసీకి చెందిన రూ.10 వేల కోట్ల విలువైన గ్యాస్‌ను రిలయన్స్ ఉత్పత్తి చేసి విక్రయించిందని తేల్చి చెప్పింది. రిలయన్స్ దాని భాగస్వామ్య బీపీ, నికోలు 1.55 బిలియన్ డాలర్లను ఓఎన్‌జీసీకి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని వ్యతిరేకించిన రిలయన్స్ ఆర్బిట్రేషన్‌కు వెళ్లింది. 2018 జులై నెలలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ప్రభుత్వం క్లెయిమ్ చేసిన రూ.13,500 కోట్లకు చెందిన పేమెంట్లను తోసిపుచ్చింది. అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పులో వివాదం లేదని, జస్టిస్ అనూప్ భంబానీ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ పేర్కొంది. జస్టిల్ రేఖపల్లి, జస్టిస్ సౌరభ్ బెనర్జీలు 2023 మే 9వ తేదీన 2018 ఆర్బిట్రేషన్ తీర్పును తోసిపుచ్చుతూ ఫిబ్రవరి 15వ తేదీన తీర్పు వెలువరించింది.

# ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత!




బ్యాంకులో పొదుపు ఖాతా అనేది దాదాపు అందరి వద్ద ఉంటుంది. సేవింగ్స్ అకౌంట్ లోని బ్యాలెన్స్ పైనా బ్యాంకులు వడ్డీ చెల్లిస్తాయి. బ్యాలెన్స్ బట్టి ఈ వడ్డీ ఉంటుంది. అయితే, ఈ ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లను తగ్గించి ఖాతాదారులకు షాకిచ్చింది. ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టింది. ఆ వివరాలు తెలుసుకుందాం.

ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన కోటక్ మహీంద్రా బ్యాంక్ తమ ఖాతాదారులకు షాకిచ్చింది. తమ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ కలిగి ఉన్న వారికి బ్యాడ్‌న్యూస్ చెప్పింది. పొదుపు ఖాతా వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కోటక్ మహీంద్రా బ్యాంకులో రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బ్యాలెన్స్ పై ఇస్తున్న పొదుపు ఖాతాలపై ఈ వడ్డీ రేట్ల తగ్గింపు ఉంటుందని తెలిపింది. అకౌంట్ బ్యాలెన్స్ ఆధారంగా వడ్డీ రేట్లు అందిస్తోంది. సవరించిన కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 17, 2025 నుంచే అమలులోకి తీసుకొస్తున్నట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్లో పేర్కొంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును తగ్గిస్తున్నట్లు ఫిబ్రవరి 7, 2025 రోజున ప్రకటించిన సంగతి తెలిసిందే. రెపో రోటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. ఆర్‌బీఐ నిర్ణయం తర్వాత కోటక్ మహీంద్రా బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ల వడ్డీ రేటులో కోత పెట్టింది. రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య బ్యాలెన్స్ ఉన్న ఖాతాలపై వడ్డీ రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టినట్లు కోటక్ బ్యాంక్ తెలిపింది. ఈ కోటక్ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్లు, అందులోని బ్యాలెన్స్ ఆధారంగా తాజా వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

కోటక్ బ్యాంక్ డైలీ సేవింగ్స్ అకౌంట్స్ బ్యాలెన్స్ రూ.5 లక్షల వరకు ఉంటే వార్షిక వడ్డీ రేటు 3 శాతంగా ఉంది.

ఇప్పటి వరకు రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 3.50 శాతం వడ్డీ ఇస్తుండగా దానిని 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టి 3 శాతానికి తగ్గించింది.

అలాగే రూ.50 లక్షల పైన బ్యాలెన్స్ ఉండే ఖాతాలపైనా వడ్డీ రేటులో 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఇప్పటి వరకు 4 శాతం వడ్డీ ఇస్తుండగా దానిని 3.50 శాతానికి తగ్గించింది.

ఈ కొత్త వడ్డీ రేట్లు రెసిడెంట్, నాన్ రెసిడెంట్ అకౌంట్లు రెండింటికీ వర్తిస్తాయని బ్యాంక్ తెలిపింది.

సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లు ఎలా లెక్కిస్తారు?

సేవింగ్స్ అకౌంట్లపై వడ్డీ రేట్ల లెక్కింపు ఏప్రిల్ 1, 2016 నుంచి త్రైమాసిక పద్ధతిన లెక్కిస్తున్నారు. డైలీ ప్రొడక్ట్ ఆధారంగా లెక్కించి మూడు నెలలకు ఒకసారి ఖాతాలో జమ చేస్తారు. ఆర్థిక సంవత్సరంలో జూన్ 30, సెప్టెంబర్ 30, డిసెంబర్ 31, మార్చి 31వ తేదీన ఖాతాల్లో వడ్డీ జమ చేస్తారు.

# నీరు లేక అల్లాడుతున్న పాకిస్తాన్..

## 700 అడుగులు తవ్వినా చుక్క నీరు రావట్లే..!



పాకిస్తాన్ నెత్తిపై మరో పిడుగు వచ్చిపడింది. ఇప్పటికే అప్పులు, విదేశీ మారక నిల్వలు అడుగంటిపోవడం, ఆకలి కేకలు, రాజకీయ అస్థిరత, ఆర్మీ నియంత్రణతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్న దాయాది దేశం ఇప్పుడు మరో సమస్యలో చిక్కుకుంది. నీరు లేక ఆ దేశం అల్లాడిపోతోంది. వందల అడుగుల లోతుకు వెళ్లినా నీటి చుక్క కానరావడం లేదు. దీంతో నీరు లేక పాక్‌వాసులు.. తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. దాయాది దేశం పాకిస్తాన్‌లో నీటి కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది. అక్కడి భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. దీంతో ఎన్ని అడుగుల మేర తవ్వినా ఒక్క చుక్క నీరు కూడా కనిపించ డం లేదు. 700 అడుగులు తవ్వినా నీళ్లు రాకపోవడంతో.. పాక్‌వాసుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే తిండి లేక విలవిలలాడుతుండగా మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు.. ఇప్పుడు నీటి సమస్య కూడా పెరిగిపోవడంతో.. ఏం చేయాలో, ఎలా బతకాలో అర్థం కాక పాకిస్తాన్ ప్రజలు అయోమయంలో మునిగిపోయారు. పాకిస్తాన్‌లో 1990ల్లో నీటి మట్టం 100 అడుగులు ఉండగా.. అప్పటి నుంచి క్రమంగా తగ్గుతూ వస్తూ ఇప్పుడు 700 అడుగులకు పడిపోయినట్లు అక్కడి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్నది వేసవి కాలం కావడంతో.. పరిస్థితి ఇంకెంత భయంకరంగా ఉంటుందోనని పాకిస్తాన్ సతమతంలో పడింది. ఇప్పటికే ఫిబ్రవరి, మార్చి నెలల్లో తక్కువ వర్షపాతం నమోదు అవుతుందని పాకిస్తాన్ వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్‌లో కరువు పరిస్థితులు ఎదురవుతాయని హెచ్చరించింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో అలర్ట్ అయిన రావల్పిండి నగర నీరు, పారిశుద్ధ్య సంస్థ.. నగరంలో ప్రజల నీటి అవసరాలకు సంబంధించి ముందు జాగ్రత్తగా కీలక సూచనలు చేసింది. రావల్పిండి నగరాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటిస్తూ.. ప్రజలకు నీటి కొరత గురించి తీవ్ర హెచ్చరికలు చేసింది. ఇది కట్టుడు పళ్ల కంటే 300 రెట్లు ఉత్తమం! మరియు ధర చాలా చౌకగా ఉంటుంది

పాకిస్తాన్ వార్తాపత్రిక అయిన డాన్‌లో వచ్చిన ఒక రిపోర్ట్ ప్రకారం.. రావల్పిండిలోని గారిసన్ నగరంలో నివసిస్తున్న ప్రజలకు కరువు కారణంగా నీటి కొరత ఎక్కువగా ఏర్పడిందని రావల్పిండి నగర నీరు, పారిశుద్ధ్య సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ముహమ్మద్ సలీం అష్రఫ్ వెల్లడించారు. దీంతో పాటు జనాభా వేగంగా పెరుగుతుం డటం, అనేక ఆర్థిక కార్యకలాపాలు, వనరుల కొరత కూడా ఈ నీటి కొరతకు కారణం అమవుతున్నాయని చెప్పారు.

అయితే పాకిస్తాన్‌లో సీజన్‌లో వర్షాలు ఎక్కువగా కురవకపోవడం కూడా ఈ సమస్యకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. చాలా కాలంగా వర్షాలు పడకపోవడంతో రిజర్వాయర్లు, భూగర్భ జల వనరుల్లో నీటిమట్టం వేగంగా తగ్గిపోయిందని ముహమ్మద్ సలీం అష్రఫ్ తెలిపారు. ఈ కారణంగానే పాక్ ప్రజలు నీటి కొరతను ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. రావల్పిండి నగరానికి ప్రతిరోజూ 68 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం అవుతాయని పేర్కొన్నారు. అయితే రావల్-ఖాన్పూర్ ఆనకట్టలు, 490కి పైగా బోర్లు సహా ప్రస్తుతం ఉన్న అన్నిరకాల నీటి వనరులను ఉపయోగించినా.. 51 మిలియన్ గ్యాలన్ల నీరు మాత్రమే అందుంతోందని చెప్పారు. అంటే ఇప్పటికే రావల్పిండి నగరంలో నీటి సమస్య ఉందని.. రానున్న కాలంలో అది మరింత ఎక్కువ అయ్యే పరిణామాలు కనిపిస్తున్నాయని.. స్థానిక అధికారులు పేర్కొంటున్నారు.

# మరోసారి కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై దుమారం

# చైనాను శత్రువులా చూడొద్దు..

గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో సీనియర్ రాజకీయ నేత, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ మాజీ ఛైర్మన్ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. దక్షిణ భారత ప్రజలు ఆఫ్రికన్లలా, ఉత్తరాది ప్రజలు అరబ్బులుగా, తూర్పున ఉండేవారు ప్రజలు చైనీయుల్లా ఉంటారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర విమర్శలకు కారణమయ్యాయి. ఇది కాంగ్రెస్ పార్టీని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఈ క్రమంలో ఆయనతో పార్టీ పదవులకు రాజీనామా చేయించింది.

కాంగ్రెస్ సీనియర్ నేత శ్యామ్ పిట్రోడా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశం చైనాను శత్రువులా చూడొద్దని, వారి నుంచి వచ్చే ముప్పు ఊహించనివిధంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. అంతేకాదు, ఆ దేశాన్ని గుర్తించి, గౌరవించాల్సిన సమయం వచ్చిందన్న పిట్రోడా... ఇకనైనా భారత్ తన వైఖరి మార్చుకొని శత్రువులా చూడటం మానుకోవాలని ఆయన సూచించారు. ఓ ఇంటర్వ్యూలో శ్యామ్ పిట్రోడా మాట్లాడుతూ.. చైనా పట్ల భారత్ అనుసరిస్తున్న ఘర్షణాత్మక వైఖరి ఇరుదేశాల మధ్య వైరాన్ని పెంచుతోందని అన్నారు.

“చైనా పట్ల భారత్ వైఖరి ముందు నుంచి ఘర్షణాత్మకంగానే ఉంది.. మనం అనుసరిస్తోన్న విధానం దేశానికి కొత్త శత్రువులను సృష్టిస్తోంది.. భారత్‌కు సరైన మద్దతు దక్కడం లేదు. ఇప్పటికైనా భారత్ వైఖరిలో మార్పు రావాలి.. ఇది కేవలం చైనాకు మాత్రమే కాదు ఇతర దేశాలకు వర్తిస్తుంది. అయినా చైనా నుంచి ఏమి ముప్పుందో నాకు అర్థం కావడం లేదు. చైనాను అమెరికా తరచూ శత్రువుగా పేర్కొంటూ.. భారత్‌కు కూడా అదే అలవాటు చేస్తోంది.. అభివృద్ధి చెందుతున్న దేశాలు మరింత వేగంగా... పేద దేశాలు మరింత వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది.. మరోవైపు, అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధి రేటు తగ్గుతోంది.. ఈ దేశాల జనాభాలో వృద్ధులు ఎక్కువగా ఉంటున్నారు.. ఇక, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో యువత ఎక్కువగా ఉంది.. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మనం ముందుకెళ్లాలి’ అని పిట్రోడా సూచించారు. అన్ని దేశాలు ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా ప్రపంచ దేశాలు సంబంధాలు, కమ్యూనికేషన్ పెంచుకుని. అవసరమైన సమయంలో ఒకరొకరు సహకారం అందించుకోవాలని అన్నారు. కాగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ పార్టీకి చైనా అంటే అమితమైన ప్రేమ అని, అందుకు పిట్రోడా వ్యాఖ్యలే నిదర్శనమని మండిపడింది.

**శ్యామ్ పిట్రోడా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశం చైనాను శత్రువులా చూడొద్దని, వారి నుంచి వచ్చే ముప్పు ఊహించనివిధంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. అంతేకాదు, ఆ దేశాన్ని గుర్తించి, గౌరవించాల్సిన సమయం వచ్చిందన్న పిట్రోడా... ఇకనైనా భారత్ తన వైఖరి మార్చుకొని శత్రువులా చూడటం మానుకోవాలని ఆయన సూచించారు.**

‘మన భూభాగంలో 40,000 చదరపు కిలోమీటర్లను చైనాకు అప్పగించిన వారికి ఇప్పటికీ ఆ దేశం నుంచి ఎటువంటి ముప్పు కనిపించడం లేదు.. కాంగ్రెస్ పార్టీకి చైనా పట్ల ఉన్న అమితమైన



అభిమానం వెనుకున్న రహస్యం 2008 కాంగ్రెస్-చైనా కమ్యూనిస్ట్ పార్టీ మధ్య జరిగి అవగాహన ఒప్పందంలో దాగి ఉంది’ అని బీజేపీ జాతీయ అధికారి ప్రతినిధి తుహిన్ సిన్హా ఆరోపించారు.

అమెరికాలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ వెంబడి కొనసాగుతోన్న ఉద్రిక్తతల నివారణకు సాయం చేస్తానంటూ ట్రంప్ చేసిన ప్రతిపాదనను భారత్ సున్నితంగా తిరస్కరించింది. పొరుగు దేశాలతో ఉన్న వివాదాల పరిష్కారం కోసం భారత్ ఎప్పుడూ ద్వైపాక్షిక చర్చలనే మార్గంగా ఎంచుకుంటుందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రి స్పష్టం చేశారు. దీంతో శామ్ పిట్రోడా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే, పిట్రోడా వివాదాస్ప వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతేడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆయన భారతీయుల గురించి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఇది కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పడేయగా.. శామ్ పిట్రోడా వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటన చేసింది.

# ఢిల్లీ భూకంప సమయంలో “బూమ్” శబ్దాలు..

ఢిల్లీలో సోమవారం రోజు వేకువజామున భూకంపం సంభవించింది. విషయం గుర్తించిన ఢిల్లీ ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. విపరీతంగా భయపడిపోతూనే చిన్న పిల్లలను ఎత్తుకుని, ముసలి వాళ్లను పట్టుకుని.. ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ రోడ్లపై కూర్చున్నారు. ఓవైపు భూమి కంపిస్తుండగానే.. మరోవైపు భారీ స్థాయిలో బూమ్ అంటూ శబ్దాలు రాగా.. మరింతగా వణికిపోయారు జనాలు. ఏం చేయాలో పాలుపోక నరకం చూశారు. అయితే ఈ బూమ్ శబ్దం రావడం వెనుక అసలు కారణం అదేనంటూ శాస్త్రవేత్తలు షాకింగ్ విషయాలు వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

సోమవారం వేకువజామున 5.36 గంటలకు ఢిల్లీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 4.0 తీవ్రతో భూమి కనిపించగా.. ప్రజలంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా.. భూకంప సమయంలో భారీ స్థాయిలో బూమ్ అంటూ శబ్దాలు వచ్చాయి. అవి కూడా వీడియోల్లో వినిపిస్తున్నాయి. అయితే ఇలా చప్పుళ్లు రావడం వెనుక మరేదో పెద్ద కారణమే ఉందని అంతా భావించారు. అది నిజమేనని శాస్త్రవేత్తలు తాజాగా వెల్లడించారు.

తక్కువ లోతులో ఉండే భూకంప కేంద్రం ఏర్పడినప్పుడు ప్రకంపన సమయంలో ఈ బూమింగ్ శబ్దాలు వినిపిస్తుంటా యని అమెరికా జియోలాజికల్ సర్వే నిపుణులు చెప్పుకొ చ్చారు. ఆ సమయంలో భూమిపై ప్రకంపనలు రావడంతోపాటు స్వల్ప కాలం వచ్చిన భూతరంగాలు గాల్లో కలిసి ధ్వని తరంగాలుగా మారతాయని వివరించారు. అధిక ఫ్రీక్వెన్సీ కంపనాల కారణంగా బూమ్ అనే శబ్దం వస్తుందని చెప్పారు. కొన్నిసార్లు కంపనాలు జరక్కపోయినా.. ఈ భారీ శబ్దాలు వచ్చే అవకాశం ఉందన్నారు. భూకంప కేంద్రం లోతు ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువగా బూమ్ అనే శబ్దాలు వినిపిస్తాయని చెప్పారు. ఈరోజు ఢిల్లీ, బిహార్‌లో వచ్చిన ప్రకంపనల్లో భూకంప కేంద్రాలు 5 కిలో మీటర్ల నుంచి 10 కిలో మీటర్ల లోతులోనే ఉన్నాయని.. అందుకే పెద్ద ఎత్తున బూమ్ అనే శబ్దాలు వచ్చినట్లు వెల్లడించారు. ఇదంతా ఇలా ఉండగా.. మళ్లీ ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో భూకంపాలు వచ్చే అవకాశం ఉందని.. ప్రజలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని నేరుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే వెల్లడించారు. చూడాలి మరి మున్ముందు ఏం జరగనుంది అనేది.

# ఒకే ఇంట్లో శవాలై తేలిన కుటుంబ సభ్యులు..

కర్ణాటకలోని మైసూరులో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం కలవరపాటుకు గురి చేసింది. మైసూరులోని విశ్వేశ్వరయ్య నగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఒక కుటుంబ ంలో ఏకంగా నలుగురు వ్యక్తులు విగత జీవులుగా కనిపించడంతో మృతులను మైసూరులో వ్యాపారం చేస్తున్న చేతన్(45), అతని భార్య రూపాలి (43), వారు కుమారుడు కుశాల్(15), చేతన్ తల్లి ప్రియంవద(65)గా పోలీసు అధికారులు గుర్తించారు. వ్యాపారి చేతన్ మొదట తన భార్య, కుమారుడు, తల్లికి విషమిచ్చి వారు చనిపోయారు అని నిర్ధారించు కున్న తర్వాత తాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి నట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వీరి ఆత్మహత్యకు అప్పుల బాధలే కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులే వారిని ఆత్మహత్య కు ఉసిగొల్పినట్లు భావిస్తున్నారు. ఈ దారుణానికి ఒడిగట్టే ముందు చేతన్ అమెరి కాలో ఉంటున్న తన సోదరుడికి కాల్ చేసి, తన ఆర్థిక సమస్యల గురించి చెప్పుకున్నాడని, అప్పుల ఒత్తిడి తట్టుకోలేక కుటుంబంతో సహా ప్రాణాలు తీసుకుంటు న్నట్లు చెప్పి ఫోన్ కట్ చేసినట్లు పోలీసులు వివరాలు తెలిపారు.

# 22 నుండి కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**తేమ 12 శాతం లోపు ఉన్న కందులకు రూ 7550 మద్దతు ధర**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**



ఫిబ్రవరి 22 నుండి జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 1129 ఎకరాలలో కందుల సాగు జరిగిందని, మొత్తం 6 వేల 211 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఐకెపి కేంద్రాల ద్వారా గంభీరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, ఎల్లారెడ్డిపేట, చందుర్తి మండలాల్లో ఐకెపి కేంద్రాల మిగిలిన చోట్ల పిఏసిఎస్ కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు చేయడం జరుగుతుంద న్నారు. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేయాలో అధికారులు నిర్ణయించి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులలో, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కందుల కొనుగోలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి సమీప గోడౌన్లకు కందుల తరలింపు కోసం రవాణా కొరకు టెండర్ల ద్వారా అవసరమైన వాహనాలు అందుబాటులోకి పెట్టాలని, కందుల కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు, టార్పాలిన్ లు, ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కందులు కొనుగోలుకు సంబంధించి కనీసం మద్దతు ధర, పంట నాణ్యత పరిశీలన,12 తేమ శాతం , ఇతర నాణ్యత ప్రమాణాలపై అధికారులకు అవసరమైన శిక్షణ కార్యక్రమం రేపటి నుంచి అందించాలన్నారు.

తేమ 12 శాతం లోపు ఉన్న కందులకు రూ 7550 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుం దని, కందుల పంట సంబంధించి అవసర మైన నాణ్యత ప్రమాణాలను రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా మార్క్ ఫెడ్ అధికారి హాబీబ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలిబేగం, డిఆర్డిఓ శేషాద్రి, డిసిఓ రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహాప్రస్థాన నిర్మాణం పనులు వేగవంతం

**ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు.**

**మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 17 జనంసాక్షి**





మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మహాప్రస్థానం హిందూ శ్మశానవాటిక గురించి తెలుగు రాష్ట్రాల్లో చర్చ నడుస్తోందని ,హైదరాబాద్ లో మాదిరిగా ఇక్కడ అన్ని హంగులతో కూడిన శ్మశాన వాటికను గోదావరి ఒడ్డున నిర్మిస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు పేర్కొన్నారు. సోమవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున నిర్మిస్తున్న మహాప్రస్థానం స్మశానవాటిక పనులను, ఐబి చౌరస్తాలో నిర్మిస్తున్న సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి పనులను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశానవాటిక నిర్మాణ పనులు వేగవంతం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 143 రోజుల వ్యవధిలో శ్మశాన వాటిక నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్‌లో పనులు ప్రారంభించినప్పుడే శివరాత్రికి పనులు పూర్తి చేస్తామని వాగ్దానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో స్మశాన వాటిక పనులు వేగవంతంగా నడుస్తున్నాయని మహా శివరాత్రి లోపు పనులు పూర్తవుతాయని తెలిపారు. హిందూ శ్మశానవాటిక మహాప్రస్థానం అన్ని హంగులతో నిర్మాణం జరుగుతుందని తెలిపారు .ఈ కార్యక్రమం లో ఆ కాంగ్రెస్ నాయకులు చిట్ల సత్యనారాయణ, నరేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు .

# రూ.1.75 కోట్లతో జాతర ఏర్పాట్లు

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**





తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి జాతర కొరకు రూ1.75 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈనెల 25 నుండి 27 వరకు అత్యంత వైభవంగా మహాశివరాత్రి జాతర కొనసాగనుంది. జాతర పనులను ఆలయ ఈవో వినోద్ రెడ్డి ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నారు. మహాశివరాత్రి జాతరకు సుమారు నాలుగు నుండి ఐదు లక్షల వరకు భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర పనుల్లో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు గుడి చెరువు పార్కింగ్ స్థలంలో చలవ పందిర్లు ఏర్పాటు చేశారు. ఆలయ గోపురాలతో పాటు పరిసర ప్రాంతాల్లో రంగులు వేయడం పూర్తయింది. క్యూలైన్లను మరమ్మత్తులు చేశారు.

**భక్తుల రద్దీ నియంత్రణకు..**

ఈనెల జరగనున్న మహాశివరాత్రి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారనే ముందస్తు ఆలోచనతో భక్తుల రద్దీ నియంత్రణ కోసం ఆలయ అధికారులు కళ్యాణకట్ట ముఖద్వారాన్ని పార్కింగ్ ప్రాంతం వైపు ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణకట్టలో భక్తులు తలనీలాలు సమర్పించుకున్న పిదప పార్కింగ్ స్థలం నుండి ధర్మగుండం లో స్నానాల కోసం వెళ్ వెళ్ళే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి పార్కింగ్ స్థలంలో క్యూ లైన్లు ఏర్పాటు చేసి అక్కడ నుండి భక్తులను స్వామివారి దర్శనానికి వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇట్టి పనులు రెండు మూడు రోజుల్లో పూర్తికానున్నాయి.

**పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు**

మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు అన్ని జాతరకు మూడు రోజుల ముందే పూర్తి చేసే విధంగా ప్రత్యేక ప్రణాళికలు నిర్వహించుకొని పనులు చేపడుతున్నారు. గతంలో ఎదురైన సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తుగా పనులు పూర్తి చేసుకోవాలని అధికారులు చర్యలు చేపట్టారు. గత కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జాతర సమన్వయ సమావేశం నిర్వహించి పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తుల్లో అధిక శాతం భక్తులు జాగరణ చేస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండ చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. వేసవికాలంలో ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు చేపడుతున్నారు .జాతర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఆలయ గుడి చెరువు ప్రాంగణంలో భక్తుల ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని, ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

# ఆలయంలో ప్రధమ చికిత్స కేంద్రం ఎక్కడ...?

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**



దక్షణ కాశిగా పేరుగాంచినవేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులు ప్రమాదవశాత్తు ప్రమాదాలకు గురైన సందర్భంలో ఆలయ ప్రాంగణంలో ప్రథమ చికిత్స కేంద్రం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు .ఆలయ ప్రాంగణంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రాలేదు. నాలుగు రోజుల క్రితం ఆలయంలో కోడె మూకుబడిలో ఓ వృద్ధురాలు గాయపడగా ఆమెను వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించిన సంఘటన మరువక ముందే సోమవారం ఓ భక్తుడు ఆలయంలో మూర్చ వ్యాధితో కింద పడిపోయాడు. ఆలయ ప్రాంగణంలో ప్రథమ చికిత్స అందించడానికి వైద్య సిబ్బంది లేకపోవడం ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో హుటాహుటిన వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడానికి పిఆర్వో కార్యాలయం పక్కన రెండు గదులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆలయ ఈవోను గతంలోనే ఆదేశించారు. వైద్యాధికారికి ఒక గది సిబ్బందికి మరొక గది మందులు భద్రపరచడానికి తగిన ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేకపోవడం తో ఆలయ ప్రాంగణంలో ప్రమాదాలకు గురవుతున్న భక్తులకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి వైద్యులను అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

# ప్రణవ వన్ హైదరాబాద్ ఫేజ్-2కు భూమిపూజ

**హైదరాబాద్ (జనంసాక్షి)**



నగరంలో ఎత్తైన ఆకాశహర్మ్యం ఇంకొకటి రానుంది. గతంలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ లో ఎత్తైన ఆకాశహర్మ్యం కట్టిన ప్రణవ గ్రూప్ వాళ్లే ఈ భవన నిర్మాణానికి కూడా పూనుకున్నారు. అందులో భాగంగా ఎత్తైన ఆకాశహర్మ్యం ప్రణవ వన్ హైదరాబాద్ ఫేజ్–2కు సోమాజిగూడలో భూమి పూజ చేశారు. ఇదే ప్రదేశంలో అత్యంత వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. క్లబ్ హౌస్ ఓపెనింగ్ కూడా చేశారు. ఎకరం విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో 95 సూపర్ లగ్జరీ నివాసాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రణవ గ్రూప్ చైర్మన్ రవి కుమార్ గుప్తా మాట్లాడుతూ ఇవి పట్టణ జీవనానికి సరికొత్త నిర్వచనంగా నిలుస్తాయన్నారు. ఈ ప్రాజెక్ట్ హరిత, పర్యావరణ అనుకూలంగా నిర్మాణం జరుగుతుందన్నారు. ఆకర్షణీయమైన రూపకల్పనతో పాటు సుస్థిరతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా దీనిని డిజైన్ చేశామన్నారు. ప్రత్యేకంగా ప్రపంచ స్థాయి క్లబ్ హౌస్ ను రూపొందించామన్నారు. ఇది అమెరికా, యూరప్ దేశాల్లోని అత్యుత్తమ జీవనశైలికి అనుగుణంగా అద్భుతమైన సౌకర్యాలతో ఉంటుందన్నారు.

# కెసిఆర్‌కు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదు

**పెబ్బేరు ఫిబ్రవరి 17 (జనం సాక్షి)**



**వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి పర్యటన**

**స్థానిక ఎన్నికల్లో టిఆర్ఎస్ కు గుండు సున్నా**

**పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి**

అసెంబ్లీ కే రానీ కెసిఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు కోల్పోయారని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. సోమవారం రాత్రి పెబ్బేరు పురపాలక కేంద్రంలోని మార్కెట్ చైర్పర్సన్ గౌని ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి కి చెందిన ఎలక్ట్రికల్ షాప్ దగ్ధమై భారీ నష్టం జరిగిన సందర్భంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, పది సంవత్సరాలు పరిపాలించిన కెసిఆర్ ప్రజల తరఫున ప్రతిపక్ష హోదాను విస్మరించి అసెంబ్లీకి రాకుండా మొఖం చాటేశారని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు కోల్పోయారన్నారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి లో పర్యటించనున్నారని మల్లు రవి అన్నారు. లోన్ మేళా, స్కిల్ డెవలప్మెంట్, జాబ్ మేళా, పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టానున్నారు అని చెప్పారు. లోన్ మేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, అదేవిధంగా జాబ్ మేళా, స్కిల్ డెవలప్మెంట్ దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. వనపర్తి పర్యటనలో రేవంత్ రెడ్డి చదువుకున్న పాఠశాల కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తారని, అలాగే పూర్వ విద్యార్థులను కలిసి వనపర్తి అభివృద్ధిలో ముందు ఉంటా రన్నారు. అదే రోజు పలు అభివృద్ధి పనులకు శంకుస్థా పనలు, సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు మల్లు రవి వెల్లడించారుస్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల మాదిరి గా గుండు సున్న దక్కుతు ందని జోష్యం చెప్పారు. ఇప్పటికే వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి నియోజకవర్గం లోని అన్ని గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ ప్రజల వద్దకు వెళుతున్నారని అన్నారు. ఎలక్ట్రికల్ షాపులో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమని భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని మార్కెట్ చైర్ పర్సన్ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ సమావే శంలో డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువ ర్ధన్ రెడ్డి, మాజీ డిసిసిబి చైర్మన్ గట్టు తిమ్మప్ప, డిసిసిబి డైరెక్టర్ రంగారెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేసాగర్, నాయకులు రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, యుగంధర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, రామన్ గౌడు, తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల్లో గద్వాల జిల్లా మొదటి ర్యాంక్

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 17 జనం సాక్షి**




జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ స్కూల్ లో 2 వ తరగతి చదువుతున్న టి.వినోద్ సి. వి .రామన్ 32వ సంవత్సరం యంగ్ జీనియస్ 2024–25 అవార్డు రావడం మనకు స్కూల్ కి, జిల్లా కు కూడా పేరు తెచ్చాడని కరస్పాండెంట్ మధులిక రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎర్రవల్లి శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాల నందు 2వ తరగతి చదువుతున్న విద్యార్థి టి.వినోద్ అద్వితీయమైన ఫీట్ సాధించాడని తెలియజేసేందుకు నేను సంతోషిస్తున్నానాని ,ప్రత్యేకమైన అభినందనలు కూడా తెలియపరుస్తున్నానీ ,భవిష్యత్తులో ఇలాంటి పోటీ పరీక్షలలో విజయం సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని అభినందించి ఉత్తమ ప్రదర్శన చేసి మరెన్నో విజయాలు అందుకోవాలని అన్నారు. టి.వినోద్ 1,000 విలువైన బహుమతి, జ్ఞాపికతో ప్రతిష్టాత్మకమైన జిల్లా 1వ ర్యాంక్ సాధించాడనీ, సర్ రామన్ 32వ సంవత్సరం యంగ్ జీనియస్ అవార్డు 2024–25 రావడం అభినందనీయమని అన్నారు. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ప్రముఖ భారతీయ నటుడు రావురమేష్ ప్రధానం చేయడం జరిగిందనీ, హైదరాబాదులోని లలిత కళా తోరణం, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో అవార్డునిచ్చినట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీర గోవర్ధన్ రెడ్డి , డైరెక్టర్ వీర శ్రీనివాస్ రెడ్డి , కరస్పాండెంట్ మధులిక రెడ్డి తోపాటు ప్రిన్సిపాల్ నందిని కేని , తరగతి ఉపాధ్యాయురాలు కృష్ణవేణి , శ్రీదేవి, అధ్యాపక బృందం , విద్యార్థులు పాల్గొని విజేతగా గెలుపొందిన వినోద్ ను అభినందించారు.



# ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

**కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**

ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రభుత్వ పాఠశాలల బడి పిల్లలకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల శిభిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. క్రింద జిల్లాలో ఇప్పటికే 3580 మంది విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఆయా పిల్లలకు మరోసారి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన కళ్ల జోళ్ళు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, టెక్రియాల్ కే.జి.బి.వి. పాఠశాల విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కామారెడ్డి లో 200 మంది, బాన్సువాడ ఏరియా ఆసుపత్రి లో 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆసుపత్రిలోని సిబ్బంది, డాక్టర్ల హాజరు రిజిస్టర్ లను, బయో మెట్రిక్ అటెండెన్స్ లను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి ఆరోగ్యం, సదుపాయాలు ఎలా వున్నాయని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ చెత్తను మున్సిపల్ వాహనంలో తరలించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. చంద్ర శేఖర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.వెంకట్, ఆసుపత్రి డాక్టర్లు రాంసింగ్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బంజారా సమాజానికి సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**



బంజారా సమాజానికి సద్గురువు'సంత్ సేవాలాల్ మహారాజ్'అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ సంత్ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 286వ జయంతి ఉత్సవం ,మహాభోగ్ భండారో కార్యక్రమం సోమవారం ఉదయం మెదక్ పట్టణంలో సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం నందు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ శ్రీ శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని బంజారా సంప్రదా యాల ప్రకారం ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బంజారా సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఇంత ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ గారి జీవితం మనందరికీ ఆదర్శ ప్రాయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ జయంతి నిర్వహణకు గతంలో కంటే అత్యధిక నిధులు కేటాయించడం. సేవా లాల్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వ హించడం సంతోషంగా ఉందన్నారు. సమాజం కోసం సమాజ హితం కోసం ఆదర్శవంతమైన జీవితం గడిపిన సంత్ సేవాలాల్ మహారాజ్ వారి సేవలను కొనియాడారు. బంజారా సాంస్కృతి సాంప్రదాయాల నృత్యాలు అలరించాయని బంజారా సంస్కృతి సాంప్రదాయాలు పది కాలాలపాటు పదిలంగా ఉంచుకోవాలని , బంజారా జాతికి చెందిన ఎంతోమంది ఉద్యోగులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారంటే దీని వెనుక వారి కృషి పట్టుదలఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, డీఎస్పీ డివో శశికళ, సంబంధిత బంజారా గిరిజన సంఘం నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఆశ వైద్యులను సంజాయిషీ కోరిన అధికారులు

**ఆర్మూర్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి)**




:ఆర్మూర్ పట్టణం పెర్కిట్ లోని ఆశ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మంథని చిన్నారెడ్డి విషయంలో జరిగిన సంఘటన విషయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ఆసుపత్రి వైద్యులకు సంజాయిషీ కోరినట్లు తెలిసింది. ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన బ్రాహ్మణపల్లి చిన్నారెడ్డి అనే వ్యక్తి ఆశ ఆసుపత్రిలో కిడ్నీ స్టోన్ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ ఆపరేషన్ వలన తన కిడ్నీలు చెడిపోయాయని పేర్కొంటూ బాధిత కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు నాలుగు రోజుల కిందట ఆసుపత్రికి తరలివచ్చారు. ఈ విషయమై ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. వైద్యుని నిర్లక్ష్యంతోనే చిన్నారెడ్డికి కిడ్నీలు చెడిపోయాయని వాగ్వాదం చేశారు. ఈ విషయం వార్తా పత్రికలో రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రమేష్ ఆశ ఆసుపత్రి వైద్యులకు సంజాయిషి కోరినట్లు తెలిసింది. వైద్యుల నిర్లక్ష్యం తోనే చిన్నారెడ్డి కిడ్నీలు దెబ్బతిన్నాయని బాధితులు పేర్కొంటున్నందున సంజాయిషీ ఇవ్వాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్లు తెలిసింది.

# విడతలవారీగా 5 లక్షల రూపాయలు

**నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ**

**రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ యండి విపి గౌతం**

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**



గ్రామ సభల ద్వారా ఆమోదం పొంది ఇందిరమ్మ ఇళ్లు అనుమతి పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మించుకునేందుకు పనులు ప్రారంభించాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ యండి. విపి గౌతం సూచించారు. సోమవారం వనపర్తి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ తో కలిసి కొత్తకోట మండలం రామనాథపురం, వనపర్తి మండలంలోని అప్పాయపల్లి గ్రామాలను సందర్శించి లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. అప్పాయిపల్లి గ్రామంలో లబ్ధిదారులు సువర్ణ, వరలక్ష్మి ల ఇండ్లను సందర్శించి, వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకున్నారు. అప్పాయి పల్లి, రాజాపేట గ్రామాల్లో ఇదివరకే ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఆ ప్రాంతంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరగా, సానుకూలంగా స్పందించారు. అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నమూనా హౌస్ ను పరిశీలించారు. ఆ తర్వాత వనపర్తి జిల్లా ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాల్లో హౌసింగ్ సంస్థ అధికారులు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఎం డి గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు వేగంగా నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5.00 లక్షల విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ అవుతాయని, పైరవీదారులను ఆశ్రయించవద్దని విజ్ఞప్తి చేశారు. మార్చి 31 లోపు లబ్ధిదారులకు మొదటి విడత చెల్లింపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు, ఆదిశగా లబ్ధిదారులు నిర్మాణం ప్రారంభిస్తే మొదటి విడత చెల్లింపు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వెంటనే మొదటి దశ నిర్మాణానికి సంబంధించి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మొబైల్ యాప్ ద్వారా ఫోటోలు తీసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. ప్రతి దశలో పంచాయతీ కార్యదర్శులు ఫోటోలని పంపించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవోలు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు పంపే ఫోటోలను ఎంపీడీవోలు, ఏఈలు సూపర్ చెక్ చేయాలని సూచించారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్దేశిత డిజైన్ ఏమీ లేదని, 400 చదరపు గజాలలో వారికి నచ్చిన విధంగా ఇంటి నిర్మాణం చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పుడు మండలానికి ఒక గ్రామంలో ఇండ్ల నిర్మాణం ప్రారంభం అయిందని, మిగతా గ్రామాల్లో కూడా నిజమైన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ త్వరలోనే లబ్ధిదారులకు సమావేశం ఏర్పాటు చేసి ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించుకుని, మార్చి 31వ తేది లోపు మొదటి దశ పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా పైలట్ గ్రామాలు కాకుండా మిగతా అన్ని గ్రామాల్లోనూ నిజమైన అర్హుల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణం కోసం ఇసుక గురించి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, దగ్గర్లోని రీచ్ నుంచి ఎమ్మార్వో అనుమతి ద్వారా ఉచితంగా ఇసుకను పొందవచ్చని చెప్పారు. లబ్ధిదారులు ట్రాన్స్పోర్ట్ భరించుకొని ఇసుకను పొందవచ్చు అని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈవో యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, హౌసింగ్ అధికారులు విఠోబా, పర్వతాలు, పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, ఎమ్మార్వోలు రమేష్ రెడ్డి, కిషన్, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పేటకు ముఖ్యమంత్రి రాక

**ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ సిక్త పట్నాయక్**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి)**



ఈ నెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాకు వస్తున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆదేశించారు. సోమవారం హెలిపాడ్ కొరకు స్థలాన్ని ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి పరిశీలించారు. అలాగే ఫోటో ఎగ్జిబిషన్, స్టేజి తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈనెల 21న ముఖ్యమంత్రి పలు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నారు. వాటిలో మెడికల్ కళాశాల టీచింగ్ హాస్పిటల్ 100 పడకల ఆసుపత్రి నర్సింగ్ కళాశాల రెండు పోలీస్ స్టేషన్ల భవన నిర్మాణాలు, పెట్రోల్ బంక్ మహిళా సమాఖ్య భవనాలు శంకుస్థాపనలు ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెంషాలం, ట్రైనింగ్ కలెక్టర్ గరీమానరుల, అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్, ఆర్. డి.ఓ. రాంచందర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాంకిషన్, సిఐ లు శివ శంకర్, రామ్ లాల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు...

# ఈజీఎస్‌లో అక్రమాలకు చోటు ఇవ్వద్దు



**డీఆర్డీఏ ఏపీడీ చంద్రశేఖర్**

**పాలకుర్తి, ఫిబ్రవరి 17(జనంసాక్షి)**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కడ అక్రమాలకు చోటు లేకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని డీఆర్డీఏ ఏపీడీ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం 16 వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించగా, ముఖ్య అతిదిగా చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. మండలంలోని 36 గ్రామ పం చాయతీలల్లో 2023 ఏప్రిల్, 1, నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన పనులకు ఖర్చు చేసిన నిధుల వివరాలను సభలో వివరించినట్లు తెలిపారు. రూ.6 కోట్లు 15 లక్షల 82 వేలు 485 ఖర్చు చేసినట్లు తెలిపారు. కూలీలకు రూ.5 కోట్లు 35 లక్షల 29 వేలు 436 ఖర్చు చేసినట్లు వివరిం చారు. అంతే కాకుండా సామాగ్రి కొనుగోలు చేసినందుకు రూ.80 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 17 వరకు సామాజిక తనిఖీ గ్రామాల వారిగా చేపటామని పేర్కొన్నారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈజీఎస్ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఆయన సూచించారు. చిన్న పోరపాట్లు కూడా చేయ కూడదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. జాబ్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో వారికి జాబ్ కార్డులిచ్చి పనులు చూపాలని మండల అధికారులకు సూచించారు. ఎస్పార్పీ గంగరాజు, జిల్లా విజిలెన్స్ అధికారి సంధ్యారాణి, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజవర్ధన్, రాష్ట్ర టీం మానిటరింగ్ అధికారి కే. దత్తు, ఎంపీడీవో రాములు, ఏపీవో మంజుల, టీఏలు కొంరన్న, యాకూబ్ పాల్గొన్నారు. సామాజిక తనిఖీ ప్రజావేధిక కార్యక్రమం అర్ధరాత్రి దాటిన కొనసాగుతుంది.

# ఆసిఫాబాద్ జిల్లాలో దర్జాగా ఇసుక అక్రమ రవాణా

**ఇసుక మాఫియాకు రాజకీయ అండదండలు..!**

**మామూళ్ల మత్తులో సంబంధిత శాఖల అధికారులు**

**సీఎం ఆదేశాలతోనైనా... ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ పడేనా..?**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 17 (జనం సాక్షి)**



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అడ్డు అదుపు లేకుండా, దర్జాగా కొనసాగుతుంది. ఇసుక అక్రమ రవాణాకు రాజకీయ నాయకుల అండదండలు, సంబంధిత శాఖల అధికారులు మాఫియా ఇచ్చే నెలవారి మామూళ్లకు ఆశపడి ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన భూగర్భ వనరుల శాఖ ( మైనింగ్) నామాత్రంగా పని చేస్తూ.. ఇసుక అక్రమ రవాణా దారుల నుండి ముడుపులు పొందుతూ.. పరోక్షంగా సహకరిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో మైనింగ్ శాఖ ఉన్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా దారులపై దాడులు చేసిన సందర్భాలు లేవనే చెప్పవచ్చు. జిల్లాలోని పెద్దవాగు, ప్రాణహిత , ఇతర మండలాల్లోని వా గుల నుంచి ఇసుక అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతుంది. పెద్దవాగు ఇసుక ట్రాక్టర్కు రు.1500, తెల్ల ఇసుక ట్రాక్టర్కు రు.2000 వరకు ఇసుక ను వ్యాపారులు అమ్ముతున్నారు. వ్యాపారులకు ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే ఇష్ట రాజ్యాంగా తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవలసిన పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తూ.. అందిన కాడికి దండుకుంటూ.. వారి అక్రమ వ్యాపారులకు. సహకరిస్తు న్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పెద్దవాగు అసిఫాబాద్, కాగ జ్ నగర్, దహేగాం, పెంచికల్పేట్, బెజ్జూరు మండలం మీదగా కొనసాగుతుంది. అదేవిధంగా ప్రాణహిత నది సిర్పూర్ (టి), కౌటాల, చింతల మానే పల్లి, బెజ్జూరు మండలాల గుండా వెళ్తుంది. ఈ ప్రాంతాల్లో రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా దర్జాగా కొనసాగుతుంది. సిర్పూర్ నియోజకవర్గంలోని దహేగాం మండలం కొంచెం వెళ్లి ఎర్ర వాగు, వాంకిడి, అసిఫాబాద్,

రెబ్బెన మండలాలలోని వాగుల నుంచి హైదరాబాదు, తదితర నగరాలకు లారీల్లో ఇసుక క్రమ రవాణా రాత్రి వేళలో కొనసాగిస్తున్నారు. గతంలో ఒకటి, రెండు పర్యాయాల్లో పోలీసులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలను పట్టుకొని సీజ్ చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. చట్టంలో ఉన్న బలహీనతలను అడ్డుపెట్టుకొని అధికారుల అండదండలతో , రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో ఇసుక అక్రమ వ్యాపారులు తమ అక్రమ దందాను మూడు పువ్వు లు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. మరి ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా.. లేదా.. అనే విషయం వేచి చూడాల్సిందే...!

# అక్యూట్ లివర్ ఫెయిల్యూర్ తో చిన్నారి మృతి

**సారంగాపూర్ ఫిబ్రవరి 17 (జనం సాక్షి)**

సారంగాపూర్ మండలం జాం గ్రామానికి చెందిన నిపేక్ష(8) సంవత్సరం నుండి అక్యుట్ లివర్ ఫెయిల్యూర్తో బాధపడుతోంది. కుటుంబీకులు హైదరాబాద్ ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి సోమవారం ఉదయం చిన్నారి మృతి చెందింది. చనిపోయే ముందు చిన్నారి ఇంటికి వెళ్దామంటూ కళ్ళు మూసింది.




# మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్



**వనపర్తి క్రైమ్ ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**

జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా న్యాయస్థానంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 8 మార్చి 2025 రోజున జాతీయ లోక్ అదాలత్ జరుగుతుంది. దీనిని విజయవంతం చేయడం కోసం వనపర్తి జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పరిచారు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ క్రిమినల్ కాంపౌండబుల్ ఎస్ టి సి డ్రంక్ అండ్ డ్రైవ్, మెయింటెనెన్స్ కేసులను కక్షిదారులు రాజీతో పరిష్కరించుకోవాలని కోరారు. పోలీస్ శాఖ వారు కక్షిదారులతో సంప్రదించి ఎక్కువ మొత్తంలో కేసులను రాజీ పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వీ.రజని జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల న్యాయమూర్తులు ,అన్ని కోర్టుల పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, సూపర్డెంట్ ఆఫ్ పోలీస్, ఆర్డిఓ మరియు జిల్లాలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఏవివి విద్యార్థి

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 17 (జనం సాక్షి)**



ఏవివి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి టీ. కరుణాకర్ ఈనెల 14వ తేదీన జేఎన్ఎస్ హన్మకొండ నందు నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో అండర్ 16 సంవత్సరాల షార్ట్పుట్ విభాగంలో కరుణాకర్ ద్వితీయ స్థానం సాధించి ఈనెల 18 మరియు 19 తేదీల లోఉస్మాని యాయూ నివర్సి టీలో జరుగబోయే 11వ తెలంగాణ యూత్ ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. ఏ. భుజేందర్ రెడ్డి తెలిపారు. కరుణాకర్ ను ఉద్దేశించి చదువుతోపాటు ఆటలు బాగా ఆడి పాఠశాలకు మరియు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల ఆవరణలో కరుణాకర్ ను పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ టి. వాసుదేవులు, ఉపాధ్యాయ బృందం నవీన్, సంధ్యారాణి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, రమాదేవి, వీరేశలింగం, భాస్కర్, సురేష్, వసంత రాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ మహేందర్, రాజశేఖర్ లు మరియు జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బరుపాటి గోపి అభినందించారు.

# రైతన్నలకు బాసటగా ఎమ్మెల్యే

**పెద్దవంగర ఫిబ్రవరి 17(జనం సాక్షి)**



మండలలో రామచంద్రు తండా గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు వ్యవసాయ పొలాలకు నీటి సమస్య రాకుండా శ్రీ రామ్ సాగర్ కాలువల ద్వారా గ్రామాల లో నీటి పారుదల కాలువల్లో పూడికతీత మరియు కంప చెట్ల తొలగించలని ఎమ్మెల్యే యశస్విని ఝన్సీరెడ్డి, సహకారం తో కాలువలు పూడిక, మరియు కంప చెట్ల తొలగించడం కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్. ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ అని అన్నారు. కార్యక్రమం లో మండల యూత్ అధ్యక్షులు బీసు హరికృష్ణ గౌడ్ మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు జాటోత్ వెంకన్న , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భారీ అగ్ని ప్రమాదాన్ని నివారించిన అటవీ అధికారులు

**మల్హర్, ఫిబ్రవరి 17(జనంసాక్షి)**



భూపాలపల్లి మల్హర్ రావు మండలంలోని మల్లారం, కొయ్యూరు సెక్షన్ పరిధిలోని రిజర్వు ఫారెస్టులో సోమవారం మద్యాహ్నం ఆకస్మికంగా మంటలు చేరేగాయి స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు కొయ్యురు సెక్షన్ అధికారి లక్ష్మన్, ఎఫ్ బి ఓ వెంకటేష్ లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. రిజర్వ్ ఫారెస్ట్ లో వేసవిదృష్ట పశువుల కాపరులు, వాహనదారులు బీడీ సిగరెట్లు కాల్చి వేయడంతో ఎండు గడ్డి అంటుకొని పాక్షికంగా కాలిపోయినట్లు అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. మల్లారం-కొయ్యూరు రహదారి వెంట ప్రయాణించే వాహనదారులతో పాటు పశువుల కాపరులు సిగరెట్, బీడీలను నిర్లక్ష్యంగా పారవేయరాదని అడవులతోనే మానవ మనుగడ సాధ్యం అని ఇది అందరి బాధ్యత అని తెలిపారు.

# పరిస్థితులు అనుకూలించకపోయినా పట్టుదలతో చదవండి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం**

**మేడ్చల్ (జనంసాక్షి)**



అనుకున్నవిధంగా, అనుకూలంగా పరిస్థితులు లేకున్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయకుండా, మీరు ఏర్పరచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పదవ తరగతి విద్యార్థినులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం విద్యార్థులకు హితవు తెలిపారు. సోమవారం మేడ్చల్ మండలంలోని కిష్టాపూర్ లో ఉన్న తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ / జూనియర్ కాలేజీ (బాలికలు)ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇది మొదటి మెట్టు అని, పరిస్థితులు ఎలా ఉన్నప్పటికి కష్టపడి చదువుకోవాలని, చదువే మంచి భవిష్యత్తును అందిస్తుందని పదవ తరగతి విద్యార్థినులకు సూచించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తులో ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం విద్యార్థులకు తెలిపారు. పదవ తరగతిలోని ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు విద్యకై అవసరమైన సలహాలను కలెక్టరు విద్యార్థులకు వివరించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. సిలబస్ పూరైందా అని, రివిజన్ ఎలా జరుగుతుందని, స్కూల్లో వసతులు ఏలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్ కు సూచించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. ఈరోజు మెనులో ఏమి వండారని అడిగి, వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ లలిత, జోనల్ ఆఫీసర్ రజిత స్కూల్లో ఉన్న మేజర్, మైనర్ రిపేర్లకు నిధులు కావాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టరు పరిశీలించి కొత్త డ్రైనేజీ పైప్ లైన్, కూలిపోయిన ప్రహరీ గోడ నిర్మాణం, వసతి గృహం, స్కూల్ లోని ఫ్యాన్లు, లైట్లు, వైరింగ్ వంటి ఎలక్ట్రిసిటి మరమ్మత్తులు, టాయిలెట్ల రిపేర్లు, దోమల నివారణకు మెష్, ఫ్లోరింగ్ వంటి పనులకు అయ్యే ఖర్చుల అంచానాల ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఖాళీగా ఉన్న స్థలంలో మొక్కలను పెంచాలని కలెక్టరు సూచించారు.

# కొత్త మండలాలు కావాలని చలో కలెక్టరేట్

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 17 (జనంసాక్షి)**




జోగులాంబ గద్వాల జిల్లాలో నూతన మండలాలను ఏర్పాటు చేయాలనీ చలో కలెక్టరేట్ కార్యక్రమాలు నిర్వహించి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన అఖిలపక్ష నాయకులు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సోనియా కుటుంబం ముమ్మాటికీ హిందువులే

- వారంతా గాంధీ వారసులని ప్రపంచానికి తెలుసు
- జాతీయ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ అజయ్ సింగ్ యాదవ్
- సిఎం రేవంత్‌ను అభినందించిన అజయ్



హైదరాబాద్, ఫిబ్రవరి17 (జనంసాక్షి) : గాంధీ కుటుంబానికి రాహుల్,ప్రియాంకలు వారసులని, వారు పక్కా హిందువులని జాతీయ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ అజయ్ సింగ్ యాదవ్ అన్నారు. రాహుల్ కుల, మతాలపై విమర్శలు వస్తున్న వేళ ..వారు పక్కా హిందువులేనని సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమక్షంలో స్పష్టం చేశారు. జై బాపు, జై సంవిధాన్ ప్రోగ్రాం కోసం ఇక్కడికి వచ్చానని, సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేశారు.. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని జాతీయ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ అజయ్ సింగ్ యాదవ్ అన్నారు. కులగణన సిటీ స్కాన్ లాంటిదని, 46శాతం బీసీ లకు లోకల్ బాడీ ఎన్నికల్లో అమలు చేస్తోందన్నారు. కులగణన వలన వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది గేమ్ చేయింజర్ లాంటిదని, దేశంలో అన్ని రాష్ట్రాల్లో కూడా కులగణన చేయాలన్నారు. బీజేపీ రాజ్యంగం మీద దాడి చేస్తుందన్నారు అజయ్ సింగ్ యాదవ్. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం మీద దాడి చేస్తుంటే.. రాహుల్ గాంధీ ఒక్కడే ప్రతి పక్ష నేతగా బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తుండన్నారు. మోడీ, అమిత్ షా లో ఈడీ,సిబిఐలతో కాంగ్రెస్ నేతపై లతో దాడి చేస్తున్నారని, మహారాష్ట్ర, హరియాన ఎన్నికల్లో కాంగ్రెస్ బాగా పుంజుకుందన్నారు. అంతేకాకుండా.. ఈవీఎంలు వద్దు బ్యాలెట్ పేపర్లు ముద్దు అనేది కాంగ్రెస్ నినాదం.. ఓబీసీ విద్యార్థులు ఎలాంటి స్కాలర్ షిప్ లు,నీట్ లో సీట్లు పొందలేక పోతున్నారు.. కేంద్ర ప్రభుత్వం క్రిమిలేయర్ ను ఎత్తి వేయాలన్నార. కాంగ్రెస్ ముస్లిం పార్టీ కాదని, 2011 లో కులగణన చేశారన్నారు. 2014 లో ఎందుకు పార్లమెంట్ లో బిల్ పెట్టలేదని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆయన సిఎం రేవంత్‌ను కలిశారు. ఇదే సందర్భంగా భాజపా నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు తెస్తామని.. ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టించే దమ్ముందా అని సంజయ్‌ను ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో జరిగిన ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. 'బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని మోదీని ఒప్పించే దమ్ముందా.. బండి సంజయ్ దేశవ్యాప్త కులగణనకు మోదీని అడిగే సత్తా ఉందా? దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా భవిష్యత్తు బీసీలదే. భాజపా, భారాసలు బీసీ నేతను సీఎంని చేయగలవా? బీసీ నేతను సీఎం చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని అన్నారు.

# హైడ్రా ప్రజావాణికి 64 ఫిర్యాదులు



హైదరాబాద్, ఫిబ్రవర 17 (జనంసాక్షి) : సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 64 ఫిర్యాదులు వచ్చాయి. తమ కాలనీలకు వెళ్లేందుకు వీలు లేకుండా.. కొంతమంది కాలనీ వాసులు చుట్టూ ప్రహరీలు నిర్మించుకుంటున్నారని, నాలాలు కబ్జా చేసి.. వరదనీరు వెళ్లడానికి వీలు లేకుండా చేస్తున్నారని ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులందాయి. రహదారులకు అడ్డంగా నిర్మాణాలు, ప్రహరీలు నిర్మించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన వాటిని ప్రాధాన్యాంశాలుగా పరిగణించాలని హైడ్రా అధికారులకు కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ప్రహరీ నిర్మించడానికి అనుమతులున్నాయా లేదా అనేది చూసి.. వెంటనే వాటిని తొలగించాలన్నారు. రహదారులన్నీ అందరూ వినియోగించుకునేలా చూడాలని.. ఎవరికీ ఆటంకాలు కలిగించకుండా చేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి.. ఆన్‌లైన్లో గూగుల్ మ్యాప్స్ ద్వారా ఫిర్యాదుదారులతో చర్చించి.. తగిన చర్యలను అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అక్కడికక్కడే అధికారులకు ఫిర్యాదుదారులకు పరిచయం చేసి.. వారితో ఫాలోఅప్ చేయండని సూచించారు.

**ఫిర్యాదులు ఇలా..**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని కాచవని సింగారం గ్రామంలోని సర్వే నంబరు 54లో ఉన్న లేఔట్‌లోని భాగ్యనగర్ నందనవనం పార్కును కబ్జా చేశారంటూ ఫిర్యాదు. 1977లో 340 ప్లాట్లతో లే ఔట్ వేయగా.. 2007లో 110 ప్లాట్లతో గ్రామపంచాయతీ లే ఔట్‌గా తీర్మానం జరిగింది. ఇదే లే ఔట్‌ను 2006లో కొన్నట్టు చూపించి 2010లో హెచ్ ఎండీఏ అనుమతి కోసం కబ్జాదారులు దరఖాస్తు చేసుకున్నారు. హెచ్‌ఎండీఏ అనుమతి మంజూరు చేయకపోయినా.. దివ్య నగర్ ప్లాట్ ఓనర్ల సంక్షేమ సంఘం ఆ ప్లాట్లను అమ్ముకున్నారని అందులో పార్కు స్థలం కూడా ఉందని పలువురు ఫిర్యాదు చేశారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలంలోని దేవరయాంజల్ గ్రామంలోని సర్వే నంబరు 452, 453లో 3.39 ఎకరాలలో లే ఔట్ వేసి ప్రహరీ నిర్మించడంతో తమకు దారి లేకుండా పోయిందని ఆ ప్రాంత నివాసితులు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లోని రాక్‌గార్డెన్స్ పేరిట లే ఔట్‌లో పేర్కొని.. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ పేరిట వ్యాపారం చేస్తున్నారని స్థానికుడు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కాప్రా మున్సిపాలిటీలోని కుషాయిగూడ విలేజ్‌లో సర్వే నంబరు 177లో ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మేశారని.. ఆ పార్కు స్థలాన్ని పక్కన ఉన్న తమ లే ఔట్‌లో చూపిస్తున్నారని పలువురు వాపోయారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా.. అక్కడ కల్లు కాంపౌండ్ ఏర్పాటుచేశారంటూ పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్ష) : ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది... పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని గొట్టిగార్పల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న బైకును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా దవాఖానకు తరలించారు. మృతులను జహీరాబాద్ మండలం అర్జునాయక్ తాండాకు చెందిన రాథోడ్ శంకర్, పవన్‌గా గుర్తించారు. జహీరాబాద్ నుంచి సిద్ధాపూర్ తాండాలోని తమ బంధువుల ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వన్ మ్యాన్ ఆఫీస్‌ను ఆవిష్కరించిన ఎల్ఐసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : తన ఏజెంట్ల ద్వారా "వన్ మ్యాన్ ఆఫీస్" ఆన్‌లైన్ సేవను ఎల్ఐసీ ఆవిష్కరించింది. వన్ మ్యాన్ ఆఫీస్ ద్వారా, ఎల్ఐసి తన సేల్స్ ఫోర్స్ కోసం ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సీనియర్ బిజినెస్ అసోసియేట్స్, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లు, ఎల్ఐసి అసోసియేట్స్ మరియు చీఫ్ ఆర్గనైజర్‌లతో కూడిన సమగ్ర డిజిటల్ ఎకోసిస్టమ్‌ను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎల్ఐసి ఆఫ్ ఇండియా సిఇఒ, ఎండి సిద్ధార్థ మొహంతి తెలిపారు. ఎల్ఐసి వినియోగదారులకు ఎప్పుడైనా, ఎక్కడైనా జీవిత బీమాను ప్రోత్సహించడాని, సేవలను అందించడానికి ఈ సేవలు వినిఇయోగపడుతాయని తెలిపారు. 2047 నాటికి అందరికీ బీమా అనే లక్ష్యాన్ని సాధించడానికి ఇది ఉపకరిస్తుందని తెలపారు. ఎల్ఐసీ పాలసీల డిజిటల్ విక్రయంలో మా ఏజెంట్లకు సహాయం చేయడం, వివిధ రకాల సేవల కోసం కస్టమర్‌లకు అమ్మకాల తర్వాత సర్వీసింగ్ చేయడం, వారి వ్యాపారాన్ని ట్రాక్ చేయడం, వారికి శిక్షణతో కూడిన నాలెడ్జ్ పూల్‌గా వ్యవహరించడం, సంక్షిప్తంగా, ఇది సేల్స్ ఫోర్స్ చేతిలో ఉన్న మొబైల్ డిజిటల్ ఆఫీస్, అన్ని వ్యాపార, సర్వీసింగ్ అవసరాలకు సులభమైన వన్ స్టాప్ సొల్యూషన్‌గా అభివృద్ధి చెందాలని యోచిస్తోందన్నారు. మొబైల్ ఫోన్‌ల ద్వారా అందుబాటులో ఉంటుందని తద్వారా ప్రతి కోణంలోనూ వారిని నిజమైన ఆత్మ నిర్భర్‌గా మారుస్తుందని తెలిపారు. ఈ సేవలు ఆనంద (ఆత్మ నిర్భర్ ఏజెంట్స్ న్యూ బిజినెస్ డిజిటల్ అప్లికేషన్) ప్లాట్‌ఫారమ్ ద్వారా కస్టమర్లను ఆన్‌బోర్డింగ్ చేయడానికి అందిస్తాయని, ప్రీమియం వంటి ఫీచర్లను కలిగి ఉంటాయని తెలిపారు. కాలిక్యులేటర్, బెనిఫిట్ ఇలస్ట్రేషన్,ఈ నాచ్ రిజిస్ట్రేషన్, అడ్రస్ మార్పు, ఆన్‌లైన్ లోన్ అభ్యర్థన, పునరుద్ధరణ ప్రీమియం చెల్లింపులు, క్లెయిమ్ సంబంధిత విషయాలను, ఇందులో నాలెడ్జ్ సెంటర్, వివిధ బీమా ఆరోగ్య సంబంధిత కాలిక్యులేటర్‌లు, ఆఫీస్ లొకేటర్, నెఫ్ట్ శోధన మొదలైనవి కస్టమర్‌లకు సహాయం చేయడానికి ఏజెంట్లకు సహాయపడతాయని తెలిపారు. వినియోగదారుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా దశలవారీగా ఈ అప్లికేషన్‌కు మరిన్ని ఫీచర్లను జోడించాలని యోచస్తున్నట్టు తెలిపారు.

# పట్టుబడ్డ పందెం కోళ్ల వేలం

- లక్షల్లో అమ్ముడు పోయిన కోళ్లు

రంగారెడ్డి, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : మొయినాబాద్ తోల్కట్ట ఫామ్ హౌస్ కేసులో స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లకు వేలం వేశారు. దీంతో వీటికి భారీ ధరలు పలికాయి. ఇటీవల హైదారాబాద్ నగర శివారు మొయినాబాద్ పరిధిలోని తొల్కట్టలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తుండటంతో పోలీసులు దాడి చేసి పందెంరాయుళ్లతో పాటు పందెం కోళ్లను పట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే.. సోమవారం రాజేంద్రనగర్ కోర్టు ఆవరణలో పందెం కోళ్లకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో 84 కోళ్లకు వేలం పాట కొనసాగగా.. ప్రజలు వేలం పాటపై ఆసక్తి చూపారు. అయితే.. 50 వేల నుండి మొదలైన వేలం పాట లక్షల్లోకి వెళ్లింది..10 కోళ్లు 2 లక్షల 50 వేలు పలికాయి. ఉప్పరపల్లి కోర్టు ఆదేశాల మేరకు పందెం కోళ్ల వేలం ఏర్పాటు చేశారు. 10 కోళ్లు కలిపి ఒక స్లాట్ గా ఉంచి వేలం నిర్వహించారు. జడ్జి సమక్షంలో ఈ పందెం కోళ్ల వేలం జరగడం విశేషం. ఇటీవల పట్టుబడ్డ పందెం రాయుళ్లు ఈ వేలం పాటలో పాల్గొనడం గమనార్హం. అయితే.. 10 కోళ్ల స్లాట్ ను 2,50,000లకు శ్రీనివాస్ అనే వ్యక్తి. కొనుగోలు చేసాడు. ఈ వేలంలో 16 మంది అడ్వకేట్లు, 57 మంది సివిలియన్స్ పాల్గొన్నారు.

## మేడ్చల్ తహసీల్దార్ బదిలీ

- 'జనంసాక్షి' కథనాలకు ఎట్టకేలకు స్పందన






మేడ్చల్ ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : మేడ్చల్ తహసీల్దార్ ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఆమెపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో 'జనంసాక్షి' కథనాలకు స్పందించిన రెవెన్యూ ఉన్నతాధికారులు మేడ్చల్ తహసీల్దార్ బి శైలజను నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ కమిషనర్ నవీన్ మిట్టల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించారు.

# తెలంగాణ టు బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు 10శాతం రాయితీ

- ఆర్టీసీ ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్




హైదరాబాద్, ఫిబ్రవరి 17 (జనంసాక్షి) : తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోగుడ్‌న్యూస్ చెప్పింది. ఇప్పటికే తెలంగాణలో మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ కార్డ్ ఉన్న ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ప్రయాణ ఛార్జీలో ఏకంగా 10 శాతం రాయితీని ప్రకటించింది. అయితే ఇది అన్ని రూట్లలో కాదు. తెలంగాణ నుంచి బెంగళూరుకు ప్రయాణించే వారికి టిక్కెట్ ధరలో పది శాతం రాయితీ కల్పిస్తున్న ప్రకటించింది. బెంగళూరు రూట్‌లో నడిచే అన్ని సర్వీసుల్లోనూ రానుపోనూ ఈ రాయితీ వర్తించనుంది. ఈ రాయితీ వల్ల ఒక్కొక్కరికి రూ.100 నుంచి రూ.160 వరకూ ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రూట్ లో టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్ సైట్‌ని సంప్రదించాల్సింది సూచించారు. అయితే తెలంగాణ నుంచి చాలా మంది బెంగళూరు సిటీకి వెళ్తుంటారు. వ్యాపార పనులపై, అలాగే ఉద్యోగ రిత్యా అక్కడ పనిచేసే వారు కూడా తరచూ బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇలాంటి వారికి ఇప్పుడు టీజీఎస్ ఆర్టీస్ ప్రకటించిన ఈ రాయితీ ఎంతో మేలు కూరుతుంది.

# బిజెపితో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు

- పట్టభద్రులు కాంగ్రెస్‌కే ఓటేయాలి: మంత్రి జూపల్లి



నిజామాబాద్, ఫిబ్రవరి17 (జనంసాక్షి) : బీజేపీ వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆలస్యమైందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బిజెపి వల్ల తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా ఒక్క సమస్య కూడా తీరడం లేదన్నారు.బీఆర్ఎస్, బీజేపీలు నిరుద్యోగులను మోసం చేసే పార్టీలని.. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సోమవారం మంత్రి జూపల్లి నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ పోటీ చేయడం లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదరిందని.. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టలేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బీసీ కుల గణనను విమర్శించే నైతిక హక్కు బీజేపీ, బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. తెలంగాణకు బీజేపీ వల్ల ఒరిగింది ఏమీ లేదని.. ఆ పార్టీ కేవలం మతాన్ని రెచ్చ గొట్టి రాజకీయ పబ్బం గడుపుతుందని విమర్శించారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం గురించిన మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు.

# భూపాలపల్లిలో స్మార్ట్ పాయింట్ మాయాజాలం

- దొంగ బిల్లులతో కుచ్చుటోపి..
- కొనుగోలు చేసిన వస్తువుల బిల్లులో అదనంగా రూ.1285లు..
- ఆశ్చర్యానికి గురైన వినియోగదారుడు..
- షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్..






భూపాలపల్లి, ఫిబ్రవరి 17(జనంసాక్షి): భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని మంజూరునగర్ శివారులో గల రిలయన్స్ కంపెనీకి చెందిన స్మార్ట్ పాయింట్ లో మాయాజాలం వినియోగదారులను అయోమయానికి గురి చేస్తుంది. వినియోగదారులు కొనుగోలు చేసిన నిత్యవసర సరుకులతో పాటు, కొనుగోలు చేయని సరుకుల బిల్లు కూడా అదనంగా పడుతుండడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. దొంగ బిల్లులతో వినియోగదారులకు కుచ్చుటోపి వేస్తుంది. ఓ వినియోగదారుడు కొనుగోలు చేసిన వస్తువుల బిల్లులో అదనంగా రూ.1285లు వేయడాన్ని గుర్తించడం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైసమ్మ కాలనీకి చెందిన టి.సుధాకర్ అనే వినియోగదారుడు నిత్యవసర వస్తువుల కొనుగోలు కోసం ఆదివారం సాయంత్రం మంజూరునగర్ శివారులోని రిలయన్స్ కంపెనీకి చెందిన స్మార్ట్ పాయింట్ షాప్ కు వెళ్లాడు. కాగా షాపులో అవసరమైన సరుగులను కొనుగోలు చేసి కౌంటర్ వద్దకు వెళ్లగా, అక్కడే ఉన్న షాపులోని వర్కర్ కౌంటర్ వద్ద సరుకులన్నింటికీ బిల్లు వేయగా రూ.4813లు బిల్లు అయింది. టోటల్ బిల్లు రశీదు తీసుకొని మొత్తం చెల్లించి సరుకులను సుధాకర్ తీసుకొని ఇంటికి వెళ్ళాడు. అయితే బిల్లు ఎక్కువగా వచ్చిందని అనుమానం వచ్చిన వినియోగదారుడు సుధాకర్ వెంటనే సరుకులను, వాటి బిల్లును చెక్ చేసి చూడగా రూ.1285 లు అదనంగా బిల్లులో ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే సరుకులను తీసుకొని షాపు నిర్వాహకుల వద్దకు వెళ్లగా సీసీ కెమెరాలు తనిఖీ చేసి చూశాడు. బిల్లులో అదనంగా రూ.1285 ఎలా వచ్చిందో తెలియదని, సీసీ కెమెరాలు మళ్లీ తనిఖీ చేస్తామని నిర్లక్ష్యపు సమాధానం చెప్పాడు. చివరికి చేసేది లేక తమదే పొరపాటు జరిగిందని, రైస్ బ్యాగ్ బిల్లు అదనంగా పడిందని ఆ వస్తువు తీసుకోకుండా బిల్లు ఎలా పడిందో అర్థం కావడం లేదని చెప్పాడు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వినియోగదారుడు షాపు నిర్వాహకులను నిలదీశాడు. ఎంతో నమ్మకంతో షాపుకు వస్తే ఇలాంటి మోసం చేస్తారా, ఇలా రోజుకు ఎంతమంది వినియోగదారులను మోసం చేస్తున్నారని ప్రశ్నించారు. నిర్వాహకుల తప్పిదం పై అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుడు డిమాండ్ చేశారు. ఈ విషయంపై వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ కు ఫిర్యాదు చేయగా షాపు వద్దకు చేరుకుని తనిఖీ చేశారు.

**వినియోగదారులను మోసం చేయడం నేరం : వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ గోవర్ధన్..**

వినియోగదారులను మోసం చేయడం నేరమేనని వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ గోవర్ధన్ అన్నారు. స్మార్ట్ పాయింటు లో జరిగిన అదనపు బిల్లు మోసంపై ఫిర్యాదు అందగా ఆయన సోమవారం షాపును తనిఖీ చేశారు. ఈ విషయంపై బాధిత వినియోగదారున్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో చైర్మన్ గోవర్ధన్ మాట్లాడుతూ వినియోగదారులకు వినియోగదారుల హక్కుల కమిషన్ అండగా ఉంటుందన్నారు. ఈ విషయంపై పూర్తి సమాచారం సేకరించి రాష్ట్ర వినియోగదారుల హక్కుల కమిషన్ కు అందజేసి తగు చర్యలు తీసుకునేలా పాటుపడతానని ఆయన తెలియజేశారు.



# పులులు తిరిగే ఇలాఖాలో..

అది పులులు సంచరించే చోటు. తిప్పేశ్వర్ లోని మథాని ఆదివాసీ గూడెం, చుట్టూ అభయారణ్యం. బయటికి వెళ్ళాలన్న, తిరిగి రావాలన్న గుండె ధైర్యం కావాలి. అలాంటిది గూడెం శివారులో ఉన్న తమ చేనుకు వెళ్లేందుకు ఒంటరిగా ఓ మహిళా అడవి మార్గం గుండా సద్దిని నెత్తిన పెట్టి బెబ్బులి వెళ్ళే దారిలో భయమెందుకు ముందడుగు వేస్తు నిర్భయంగా సాగిపోతున్న దృశ్యం. మహారాష్ట్రా లోని యావత్ మాల్ జిల్లా తిప్పేశ్వర్ పులుల ఇలాఖాలో కనిపించింది.

– వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ, అదిలాబాద్. (జనంసాక్షి)

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370